
మన తెలంగాణ

హైదరాబాద్ | సంపుటి 7 | సంచిక: 227 | బుధవారం | 6 ఫిబ్రవరి, 2019 | పేజీలు: 12 + టాబ్లాయిడ్ | వెల రూ. 5.00

Published from: Hyderabad, Karimnagar, Warangal, Khammam, Nalgonda, Mahabubnagar, Nizamabad



రైతుబంధే బంధువు

పరిమితులు లేని పథకం, కిసాన్ సమ్మాన్‌కు పరిమితులున్నాయి

కేంద్ర వ్యవసాయ అదనపు కార్యదర్శి వసుధామిశ్రా

మన తెలంగాణ / హైదరాబాద్

తెలంగాణ ప్రభుత్వం అమలుచేస్తున్న 'రైతు బంధు' పథకానికి ఎలాంటి పరిమితులు లేవని, స్వంత సాగుభూమి కలిగిన రైతులందరికీ అమలవుతోందని, ఎన్ని ఎకరాల భూమి ఉంటే అంత ఆర్థిక సాయం ప్రభుత్వం నుంచి అందుతోందని, కానీ కేంద్ర ప్రభుత్వం అమలు చేయనున్న 'ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి' పథకానికి మాత్రం కొన్ని పరిమితులు ఉన్నాయని కేంద్ర వ్యవసాయ శాఖ అదనపు కార్యదర్శి వసుధా మిశ్రా వ్యాఖ్యానించారు. భార్య, భర్త, మైనర్ పిల్లలు ఉన్న కుటుంబాన్ని యూనిట్‌గా తీసుకుని గరిష్టంగా ఐదు ఎకరాల సాగుభూమి ఉన్నవారికి మాత్రమే వర్తిస్తుందని, అంతకంటే ఎక్కువ ఉన్నవారికి వర్తించదని అన్నారు. కానీ తెలంగాణ ప్రభుత్వం మాత్రం తరువాయి 6లో





ముద్దొచ్చే ముద్దు

ప్రపంచ శాంతి పత్రంపై పోప్ – ఇమామ్ చుంబన సంతకం

అబూధాబి: ఇదో చరిత్రాత్మక సంఘటన. ప్రపంచ శాంతి కోసం ఉగ్రవాదంపై పోరాడేందుకు అబూధాబిలోని అల్ అజర్ మసీదుకు చెందిన ఇమామ్ షేక్ అహ్మద్ అల్ తాయెబ్, పోప్ ఫ్రాన్సిస్ సోమవారం ఒక ఒప్పంద పత్రంపై సంతకం చేశారు. ఈ సందర్భంగా ఇరువురు ముద్దాడుకోవడంతో పాటు ఆలింగనం చేసుకున్నారు. అంతర్ మత సమావేశంలో ఈ ఘట్టం చోటుచేసుకుంది. మూడు రోజుల చరిత్రాత్మక తరువాయి 6లో

నిధుల పల్లెబాట

- 'నరేగా'తో పాటు ఎంపి, ఎంఎల్‌ఎల అభివృద్ధి నిధులు
- ప్రతీ గ్రామానికి నర్సరీ, డాంబర్ రోడ్డు
- 1300 గ్రామాల్లో రెండు చొప్పున వైకుంఠధామాలు
- 859 గ్రామాలకు కొత్తగా రోడ్లు
- మొక్కల సంరక్షణ గ్రామపంచాయతీల బాధ్యత
- ప్రగతిభవన్ సమీక్షలో ముఖ్యమంత్రి కెసిఆర్





టీచర్ల సమస్యలపై త్వరలో భేటీ? 3

సంఘాల ప్రతినిధులతో సమావేశం కానున్న ముఖ్యమంత్రి

మన తెలంగాణ /హైదరాబాద్

మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం (నరేగా) నిధులను సంపూర్ణంగా వినియోగించుకుని గ్రామాల్లో తెలంగాణకు హరితహారం, వైకుంఠధామాలు (శ్మశాన వాటికలు) నిర్మించాలని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు ఆదేశించారు. 'నరేగా' నిధులతో పాటు రాష్ట్ర బడ్జెట్ నుంచి కూడా నిధులు ఉంటాయని, పార్లమెంటు సభ్యులతో పాటు శాసనసభ్యులు కూడా వారి 'అభివృద్ధి నిధుల' నుంచి గ్రామాల్లో అభివృద్ధి కోసం చర్యలు తీసుకుంటారని సిఎం తెలిపారు. 'నరేగా' పథకం కింద కేంద్రం నుంచి రాష్ట్రానికి ఎంత మొత్తంలో డబ్బు వస్తుందో అంతే మొత్తంలో రాష్ట్ర ప్రభుత్వం కూడా బడ్జెట్‌లో నిధులు కేటాయిస్తుందని, ఈ నిధులను గ్రామాల అభివృద్ధికి వినియోగించాలని చెప్పారు. పంచాయతీరాజ్, అటవీ శాఖ అధికారుతో ప్రగతి భవన్‌లో గ్రామాభివృద్ధిపై మంగళవారం విస్తృతంగా సమీక్ష నిర్వహించిన సందర్భంగా పలు శాఖల అధికారులకు ముఖ్యమంత్రి పై విధంగా ఆదేశాలు జారీ చేశారు. ప్రతీ గ్రామానికి డాంబరు రోడ్డు తప్పనిసరిగా ఉండాలని ప్రభుత్వం ఒక విధాన నిర్ణయం తీసుకున్నదని, ఆ దిశగా దృష్టి పెట్టడంతో పాటు కొత్తగా 859 తరువాయి 6లో

స్కూల్ అసిస్టెంట్లుగా భాషా పండితులు, పిఇటిలు

ఫైలుపై సిఎం సంతకం

మన తెలంగాణ/హైదరాబాద్ : రాష్ట్రంలోని రెండవ శ్రేణి భాషా పండితులు, పిఇటి పోస్టులను స్కూల్ అసిస్టెంట్ పోస్టులుగా అప్‌గ్రేడ్ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీనికి సంబంధించిన ఫైలుపై ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు మంగళవారం సంతకం చేశారు. ప్రపంచ తెలుగు మహాసభల సందర్భంగా సిఎం కెసిఆర్ తెలుగు తరువాయి 6లో

200 మంది అటవీ అధికారుల బదిలీ

11మంది సస్పెన్షన్ | ఉత్తర్వులపై సిఎం సంతకం

- అడవుల సంరక్షణ దిశగా కీలక సంస్కరణలకు శ్రీకారం
- నిబద్ధత కలిగిన అధికారులకు ప్రధాన బాధ్యతలు

మన తెలంగాణ /హైదరాబాద్

అడవులు ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో కఠినంగా వ్యవహరించడంతో పాటు నిబద్ధత, అంకితభావం కలిగిన అధికారులను నియమించాలని సిఎం చంద్రశేఖర్ రావు జారీ చేసిన ఆదేశాల మేరకు అటవీశాఖ భారీ బదిలీలకు శ్రీకారం చుట్టింది. అటవీ చీఫ్ కన్జర్వేటర్ మొదలు బీట్ ఆఫీసర్ వరకు వివిధ స్థాయిల్లోని 200 మంది అటవీ అధికారులను ప్రభుత్వం బదిలీ చేసింది. దీనికి సంబంధించిన దస్త్రంపై సిఎం కెసిఆర్ మంగళవారం సంతకం చేశారు. ఎక్కువ మంది అధికారులు హైదరాబాద్‌లో కాకుండా క్షేత్రస్థాయిలో తరువాయి 6లో



ప్రశ్నించండి అరెస్టు వద్దు



కోల్‌కతా పోలీస్ కమిషనర్ రాజీవ్‌కుమార్‌పై సిబిఐకి సుప్రీం ఆదేశాలు

న్యూఢిల్లీ: శారద చిట్‌ఫండ్ కేసులో సిబిఐ దర్యాప్తునకు సహకరించవలసిందిగా సుప్రీం కోర్టు మంగళవారం కోల్‌కతా పోలీసు కమిషనర్ రాజీవ్ కుమార్‌ను ఆదేశించింది. అయితే అరెస్టుతో సహా ఆయనపై ఎటువంటి దురుసు చర్యలను చేపట్టడానికి వీల్లేదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఫిబ్రవరి 18 లోగా రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి, డిజిపి తమ సమాధానాలను దాఖలు చేయాలని చీఫ్ జస్టిస్ రంజన్ గొగోయ్ సారథ్యంలోని ధర్మాసనం ఆదేశించింది. అలాగే కుమార్‌కు కూడా నోటీసు జారీ చేసిన బెంచ్ ఆయన తన సమాధానాన్ని ఈ కేసు తదుపరి విచారణ తేదీ అయిన ఈ నెల 20 లోగా తరువాయి 6లో

కుంచెపోటు



కరివేపాకుని రుచి కోసం ఉపయోగిస్తాం.. అంతే..!

కేసు ఇక్కడే ఉండాలి

ఆంధ్రా నుంచి బదిలీ చేయాలి

నా భర్త హత్యపై అనుమానాలు

జూబ్లీహిల్స్ పిఎస్‌లో జయరాం భార్య పద్మశ్రీ ఫిర్యాదు 6



రాష్ట్రానికి రానున్న 15వ ఆర్థిక సంఘం 3

జిల్లాకు రెండు ఫ్రీడమ్ స్కూళ్లు 3

6కోట్లు..6లక్షలు.. చిత్రవధ

జయరాంను రాకేష్ హత్యచేసిన విధానం.. ఊపిరాడకుండా చేసి చంపిన వైనం

- ఆర్థిక లావాదేవీలే హత్యకు కారణం : ఎస్‌పి త్రిపాఠి
- నిందితులను పోలీసు కస్టడీకి కోరుతూ పిటిషన్ ?
- న్యాయ సలహా ప్రకారం కేసు బదిలీ చేస్తాం



మన తెలంగాణ/హైదరాబాద్

ఎన్నారై జయరాం నుంచి రూ.6 కోట్ల అప్పు రాబట్టుకోవడంలో విసిగిపోయిన రాకేష్‌రెడ్డి పథకం ప్రకారం హత్య చేసినట్లు కృష్ణాజిల్లా ఎస్‌పి సర్వశ్రేష్ఠ త్రిపాఠి పేర్కొన్నారు. జయరాం హత్య కేసులో నిందితులు రాకేష్‌రెడ్డి, డ్రైవర్ శ్రీనివాస్‌లను అరెస్టు చేశామని ఎస్‌పి తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎస్‌పి సర్వశ్రేష్ఠ త్రిపాఠి మాట్లాడుతూ డబ్బుల కోసమే పథకం ప్రకారం జయరాంను రాకేష్‌రెడ్డి హత్య చేశాడని తమ తరువాయి 6లో

హత్య తరువాత ఎసిపికి రాకేష్ ఫోన్

మల్లారెడ్డి బదిలీ

బ్రాహ్మణులకు ప్రభుత్వం అండ

బెస్ట్, వివేకానంద ఓవర్సీస్ ఎడ్యుకేషన్ లబ్ధిదారులకు చెక్కుల అందజేత



మన తెలంగాణ/హైదరాబాద్ : తెలంగాణ ప్రభుత్వం బ్రాహ్మణులను అన్ని రకాలుగా ఆదుకుంటుందని ఢిల్లీలో ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి వేణుగోపాలచారి పేర్కొన్నారు. బెస్ట్ పథకంతో పాటు వివేకానంద ఓవర్సీస్ ఎడ్యుకేషన్ పథకం కింద ఎంపికైన లబ్ధిదారులకు మంజూరు పత్రాలతో పాటు చెక్కులను అందజేత బొగ్గులకుంటలోని బ్రాహ్మణ పరిషత్ కార్యాలయంలో మంగళవారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన వేణుగోపాలచారి మాట్లాడుతూ అడగకముందే బ్రాహ్మణుల కోసం సిఎం కెసిఆర్ బ్రాహ్మణ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేశారని ఆయన తెలిపారు. సిఎం సహకారంతో మరిన్ని కార్యక్రమాలు చేపడతామన్నారు. కోకాపేటలో ఇప్పటికే మనకు బిల్డింగ్ నిర్మాణం జరుగుతుందని, అందులో హైదరాబాద్‌కు వచ్చే పేద విద్యార్థుల కోసం బస ఏర్పాటు చేస్తామన్నారు. కార్పొరేషన్‌పై సోషల్ మీడియాలో అసత్య ప్రచారాలు మానుకోవాలని ఆయన సూచించారు. ఎమ్మెల్సీ పురాణం సతీష్ ఉద్యమంలో పాల్గొన్న బ్రాహ్మణ కుటుంబాలకు అండగా ఉండాలన్న ఉద్దేశ్యంతో బ్రాహ్మణ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేశారని ఆయన తెలిపారు. గత ప్రభుత్వాలు బ్రాహ్మణులను ఓట్ల కోసం మాత్రమే వాడుకున్నారని టిఆర్ఎస్ ప్రభుత్వం ఎప్పటికప్పుడు బ్రాహ్మణుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తుందన్నారు. సిఎం కెసిఆర్‌కు బ్రాహ్మణులంటే అపారమైన గౌరవం ఉందన్నారు. బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. అందరి ఆశీస్సులు ఉన్నందునే అసెంబ్లీ ఎన్నికల్లో భారీ మెజార్టీతో టిఆర్ఎస్ ప్రభుత్వాన్ని గెలిపించారని ఆయన తెలిపారు. బ్రాహ్మణుల ఆశీర్వాదం ఎప్పుడూ సిఎం కెసిఆర్‌కు ఉంటుందని రాజ్యసభ సభ్యుడు కెప్టెన్ లక్ష్మి కాంతారావు పేర్కొన్నారు. బ్రాహ్మణ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసుకోవడం వలన ఎన్నో కార్యక్రమాలను అమలు చేసుకుంటున్నామన్నారు. సిద్ధిపేటలో బ్రాహ్మణుల కోసం గతంలోనే మండపం, ఇతర సౌకర్యాలు కల్పించారన్నారు. సిఎం సహకారం, అండ ఉన్నప్పుడే ఉపయోగించుకోవాలన్నారు. కార్పొరేషన్ పథకాలను అందరూ ఉపయోగించుకోవాలన్నారు. పేద బ్రాహ్మణులు విదేశాల్లో చదువుకోవడానికి సిఎం కెసిఆర్ వివేకానంద ఓవర్సీస్ ఎడ్యుకేషన్ పథకాన్ని ప్రారంభించడం వలన పేద విద్యార్థులు విదేశాల్లో చదువుకునే అవకాశం దక్కిందని ప్రభుత్వ సలహాదారు కెవి రమణాచారి పేర్కొన్నారు. ప్రభుత్వం తరపున శ్రీరామనుజ స్కీం, బ్రాహ్మణ ఎంటర్‌ప్రైనర్ డెవలప్‌మెంట్ తదితర పథకాలను ప్రభుత్వం ప్రారంభించిందని, వీటిని బ్రాహ్మణులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

సిఎం సిపిఆర్‌ఓ జ్వాలా నరసింగరావు మాట్లాడుతూ బ్రాహ్మణుల సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక పథకాలను ప్రవేశపెట్టిందన్నారు. బెస్ట్ స్కీం కింద ఔత్సాహిక పారిశ్రామిక వేత్తల కోసం మంచి అవకాశాన్ని ప్రభుత్వం కల్పించిందన్నారు. అనారోగ్య కారణాలతో అసెంబ్లీ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి ఈ కార్యక్రమానికి రాలేకపోయారని నిర్వాహకులు తెలిపారు. 42 మంది బెస్ట్ పథకం కింద ఎంపికైన లబ్ధిదారులకు, 110 మంది వివేకానంద ఓవర్సీస్ ఎడ్యుకేషన్ పథకం కింద ఎంపికైన వారికి మంజూరు పత్రాలతో పాటు చెక్కులను వారు అందజేశారు.

కుడి ఎడమైంది

నీటి మళ్ళింపుకోసం కృష్ణా బోర్డు ఆదేశం

మన తెలంగాణ/హైదరాబాద్: చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా ఒక కెనాల్‌కు కేటాయించిన నీటిని మరో కెనాల్‌కు మళ్లించాలని కృష్ణాబోర్డు ఆదేశాలు ఇచ్చింది. నాగార్జునసాగర్ ఎడమ కెనాల్ పరిధిలోని ఆంధ్రప్రదేశ్ ఆయకట్టుకు గతంలో కేటాయించిన నీటిని కుడి కాలువకు మళ్లించాలని కృష్ణాబోర్డు ఆదేశించింది. ఎడమ కాలువ పరిధిలోని ఎపి ఆయకట్టుకు గతంలో 3.43 టిఎంసిల నీళ్లను కేటాయించింది. అయితే ఇందులోంచి 2 టిఎంసిలను కుడి కాలువకు ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం లేఖ రాయగా, దీన్ని యథాతథంగా కృష్ణాబోర్డు అంగీకరించింది. గతంలో ఎన్నడూ కెనాల్‌కు కేటాయించిన నీటిని ఇంకో కెనాల్‌కు మళ్లించిన సందర్భాలు లేవని నిపుణులు చెబుతున్నారు. ఎడమ కాలువలో ఎపి ఆయకట్టుకు కేవలం 1.43 టిఎంసిలు మాత్రమే కేటాయించినట్లు అయింది.

కనీస మట్టం దిగవద్దు.... బోర్డు సూచన

శ్రీశైలం నుంచి కనీస నీటిమట్టాన్ని నిర్వహించాలని బోర్డు సభ్య కార్యదర్శి (ఇన్‌చార్జి) హరికేష్ మీనా ఇరు రాష్ట్రాల ఇఎన్‌సిలకు లేఖ రాశారు. త్రిసభ్య కమిటీ అనుమతి లేకుండా శ్రీశైలం నీటిని వినియోగించుకోవద్దని సూచించారు. నాగార్జునసాగర్‌లో కనీస నీటిమట్టం నిర్వహణపై ప్రభుత్వం బోర్డు దృష్టికి తీసుకెళ్లినా, దానిపై స్పందించకపోవడం గమనార్హం.

రాజన్న ఆదాయం రూ.కోటి 6 లక్షలు

మనతెలంగాణ/ వేములవాడ: శ్రీరాజరాజేశ్వర స్వామి హుండీ లెక్కింపు మంగళవారం నిర్వహించారు. సుమారు 25 రోజుల ఆదాయాన్ని లెక్కించగా రూ. 1 కోటి 6 లక్షల 98 వేల 359 రూపాయల ఆదాయం సమకూరగా, 433 గ్రాముల బంగారంతో పాటు 8 కిలోల వెండి సమకూరినట్లు ఆలయ అధికారులు వెల్లడించారు. ఈవో దూస రాజేశ్వర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ లెక్కింపు కార్యక్రమంలో ఆలయ సిబ్బందితో పాటు సత్య సాయి సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

అధ్యాపకుల పోస్టులకు ఇంటర్వ్యూలు

మనతెలంగాణ/హైదరాబాద్ : ఫారెస్ట్ కళాశాలలో ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులకు ఈ నెల 11 నుంచి ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు టిఎస్‌పిఎస్‌సి తెలిపింది. ఇతర వివరాలకు వెబ్‌సైట్ చూడాలని పేర్కొంది.

పర్యాటక ఉద్యోగుల క్యాలెండర్ ఆవిష్కరణ



మన తెలంగాణ/హైదరాబాద్: రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల సంఘం నూతన సంవత్సర కేలండర్‌ను టిఎస్‌టిడిసి ఎండి బి.మనోహర్ ఆవిష్కరించారు. మంగళవారం సంస్థ ప్రధాన కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఓఎస్‌డి వేణు, ట్రాన్స్‌పోర్ట్ జిఎం యుగంధర్, అడ్మిన్ జిఎం సురేందర్, అడ్మిన్ ఇన్‌చార్జి రవీంద్రనాయక్, యూనియన్ ప్రధానకార్యదర్శి సబ్బు రాజమౌళి, ఉపాధ్యక్షులు తిరుపతి, మహేందర్, సుమన్, వెంకటేశ్, రమేష్‌లు పాల్గొన్నారు.

ఆత్మీయ సమ్మేళనాలతో ఆనందం

ఎంఎల్‌ఎ శ్రీనివాస్‌గౌడ్, మండలి చైర్మన్ స్వామిగౌడ్



మన తెలంగాణ/హైదరాబాద్ : పాత జ్ఞాపకాలు నెమరేసుకోవడానికి ఆత్మీయ సమ్మేళనాలు ఉపయోగపడతాయని ఎమ్మెల్యే శ్రీనివాస్‌గౌడ్, మండలి చైర్మన్ స్వామిగౌడ్‌లు పేర్కొన్నారు. టిఎన్జీవో హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు ముజీబ్ ముస్సే న్ ఆధ్వర్యంలో ఆత్మీయసమ్మేళనం నాంపల్లిలోని టిఎన్జీవో కార్యాలయంలో జరిగింది. దీనికి ము ఖ్యఅతిథిగా వారు హాజరై, మాట్లాడు తూ తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న ఉద్యోగుల నాయకులు ఒక్కచోట కలిసినప్పుడు ఉద్యమం తాలూకు జ్ఞాపకాలు గుర్తుకు వస్తున్నాయన్నారు. టిఎన్జీవో రాష్ట్ర అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, బేవరేజస్ కార్పొరేషన్ చైర్మన్ దేవీ ప్రసాద్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఆయాచితం శ్రీధర్‌లు మాట్లాడుతూ ఉద్యమంలో తెలంగాణ ఉద్యోగుల పాత్ర మరువలేనిదన్నారు. ఢిల్లీలో ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి వేణుగోపాల చారి మాట్లాడుతూ ఉద్యమంలో ప్రజలను చైతన్యవంతులుగా చేయడంలో ఉద్యోగులు సఫలీకృతులయ్యార న్నారు. డైరీ, క్యాలండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో డిప్యూ టీ మేయర్ బాబా ఫసీయుద్దీన్, టిజివో అధ్యక్షులు మమతలు పాల్గొన్నారు.

వైద్యానికి రూ.10 వేల కోట్లు?

మన తెలంగాణ/ హైదరాబాద్ : ఈ సారి బడ్జెట్‌లో వైద్య ఆరోగ్య రంగానికి రూ. 10 వేల కోట్లు కేటాయించాలన్న ప్రతిపాదనను వైద్య ఆరోగ్య శాఖ సిద్ధం చేసినట్టు సమాచారం. రాబోయే బడ్జెట్‌లో వై ద్య ఆరోగ్య రంగానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని ప్రభుత్వం ఆలోచిస్తోంది. ఆ మేరకు వైద్య ఆరోగ్య రంగానికి కేటాయింపులు కూడా భారీగానే ఉంటాయని తెలుస్తోంది. ప్రస్తుతం ఓటాన్ అకౌం ట్ బడ్జెట్‌ను రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టబోతున్నందున ప్రతిపాదనలు దాదాపుగా కొలిక్కి వచ్చినట్లు వైద్యారోగ్య శాఖ ఉన్నతాధికారులు సూచనప్రాయంగా తెలిపారు. గత బడ్జెట్‌లో ఈ రంగానికి ప్రభుత్వం రూ. 7370 కోట్లు కేటాయించడంతోపాటు ఆరోగ్యశ్రీకి రూ. 699 కోట్లు, ఆసుపత్రుల అభివృద్ధికి రూ. 600 కోట్లు కేటాయించింది. దీంతోనే వైద్యారోగ్య శాఖ వివిధ ఆసుపత్రులకు వైద్య పరికరాలను కొనుగోలు చేసింది. ఈసారి దానికి అదనంగా మరో రూ. 3000 కోట్లను కేటాయించాలని ప్రభుత్వాని కి వైద్య ఆరోగ్యశాఖ ప్రతిపాదనలు పంపినట్లు తెలిసింది. బడ్జెట్ కేటాయింపుల్లో మాతా శిశు సంరక్షణ, కెసిఆర్ కిట్, ప్రజలకు అవసరమైన రో గ నిర్ధారణ పరీక్షల నిర్వహణ, డయాగ్నస్టిక్ కేం ద్రాల ఏర్పాటు తదితర కొన్ని ప్రాధాన్యతా రంగాలను ప్రభుత్వం ఎంచుకొన్నట్టు సమాచా రం. వీటి ని దృష్టిలో పెట్టుకుని ఈసారి బడ్జెట్‌లో వైద్య ఆరోగ్య రంగానికి కేటాయింపులు ఎక్కువగానే ఉంటాయని ఆ శాఖ అధికారులు అభిప్రాయపడుతున్నారు.

బొగ్గు రవాణాకు సహకరించండి

రైల్వే అధికారులను కోరిన సింగరేణి సిఎండి



మన తెలంగాణ / హైదరాబాద్ : సింగరేణి కాలరీస్‌లో అత్యధికంగా ఉత్పత్తి అవుతున్న బొగ్గును సరఫరా చేసేందుకు అవసరమైన సహకారాన్ని అందించాలని సింగరేణి సంస్థ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ శ్రీధర్ దక్షిణ మధ్య రైల్వే అధికారులను కోరారు. రానున్న రెండు నెలల్లో మరింత అధికంగా ఉత్పత్తి అయ్యే అవకాశముందన్నారు. ఈ నేపథ్యంలో రవాణాకు పూర్తిస్థాయిలో సహకరించాలని విజ్ఞప్తి చేశారు. దక్షిణ మధ్య రైల్వే ప్రిన్సిపల్ చీఫ్ ఆపరేషన్స్ మేనేజర్ ఎన్.మధుసూదన్‌రావుతో మంగళవారం సికింద్రాబాద్‌లోని రైల్ నిలయంలో సింగరేణి సిఎండి శ్రీధర్ ప్రత్యేకంగా సమావేశమయ్యారు. 2018 సెప్టెంబర్‌లో సింగరేణి సంస్థ నుంచి రోజుకు 30 రేక్‌ల బొగ్గు (ఒక రేక్‌కు 59 వాగన్లు) రవాణా చేశామని తెలిపారు. ఇది 2019 జనవరిలో 40 రేక్‌లకు పెరిగిందని తెలిపారు. ఈ నేపథ్యంలో ఫిబ్రవరి, మార్చి నెలలో 45 రేక్‌లకు పెరిగే అవకాశముందని తెలిపారు. వచ్చే రెండు నెలల్లో అత్యధికంగా ఉత్పత్తి అవుతున్న బొగ్గును సరఫరా చేసేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని కోరారు. దీనికి స్పందించిన మధుసూదన్‌రావు సింగరేణి సంస్థ నుంచి ఉత్పత్తి అయ్యే బొగ్గు రవాణా సాఫీగా జరగడానికి సహకరిస్తామని హామినిచ్చారు. సమావేశంలో చీఫ్ ఫ్రైట్ ట్రాఫిక్ మేనేజర్ బి.నాగ్యా, సికింద్రాబాద్ డివిజన్ సీనియర్ డిఓఎమ్ ఎన్.మనోజ్, సింగరేణి సంస్థ ఎక్జిక్యూటివ్ డైరెక్టర్ ఆల్విన్, మార్కెటింగ్, ప్లానింగ్ జనరల్ మేనేజర్ ఆంటోని రాజా పాల్గొన్నారు.

కోర్టుల్లో నూతన మౌలిక సదుపాయాలు

వివిధ శాఖల అధికారులతో సిఎస్ సమావేశం



మన తెలంగాణ/ హైదరాబాద్ : రాష్ట్రంలోని న్యాయస్థానాలలో అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జోషి తెలిపారు. కోర్టులలో సౌకర్యాల కల్పనపై సచివాలయంలో మంగళవారం జరిగిన సమావేశంలో సుప్రీం కోర్టు ఆదేశాల ప్రకారం సదుపాయాల కల్పనకు చర్యలు చేపట్టినట్లు వివరించారు. ఈ సమావేశంలో సుప్రీంకోర్టు న్యాయవాది గౌరవ్ అగర్వాల్, ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి రామకృష్ణారావు, రోడ్డు భవనాల శాఖ ముఖ్య కార్యదర్శి సునీల్ శర్మ, న్యాయ శాఖ కార్యదర్శి నిరంజన్‌రావు, హైకోర్టు అధికారులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ, జిల్లాలలో నిర్మాణంలో ఉన్న కోర్టు సముదాయాల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని అన్నారు. ఇంకా నిర్మించాల్సిన ప్రాంతాలలో సమీకృత కోర్టు కాంప్లెక్స్‌లకు ప్రణాళికలను రూపొందించాలని అధికారులకు సూచించారు. జిల్లాలలో జ్యుడిషియల్ అధికారుల నివాస భవనాలను నిర్మించడానికి చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. కోర్టులలో ఖాళీగా ఉన్న పోస్టులను రాష్ట్రపతి ఉత్తర్వుల ప్రకారం భర్తీ చేయడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

విహెచ్‌తో మాకు ప్రాణహాని

అంబర్‌పేట్ కాంగ్రెస్ నేతల ధర్నా

మన తెలంగాణ/హైదరాబాద్ : కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత వి. హనుమంతరావుతో తమకు ప్రాణహాని ఉందని, దళితులమైన తమకు రక్షణ కల్పించాలని కోరుతూ అంబర్‌పేటకు చెందిన పార్టీ నాయకులు మంగళవారం గాంధీభవన్‌లో గాంధీ విగ్రహం ముందు ధర్నా చేశారు. నియోజకవర్గానికి చెందిన మోహన్, రాజేశ్‌ల ఆధ్వర్యంలో పలువురు పార్టీ కార్యకర్తలు పెద్దఎత్తున గాంధీభవన్‌కు చేరుకుని విహెచ్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఇటీవల మల్లు భట్టి విక్రమార్కకు జరిగిన సన్మానసభలో విహెచ్ తమను అకారణంగా దుర్భషలాడారని పేర్కొన్నారు. పైగా తాము రౌడీ షీటర్లమని నిందలు వేసి బూతులు తిట్టారన్నారు. సీనియర్ నేతగా ఉన్న విహెచ్ హుందాగా వ్యవహరించాల్సిందిపోయి తమపై దాడి చేసి చంపుతామంటూ బెదిరించడం ఎంత వరకు సమంజసమని వారు ప్రశ్నించారు. పార్టీ కార్యకర్తలనే టార్గెట్‌గా చేసుకుని దాడులకు పాల్పడుతున్న విహెచ్‌ను వెంటనే పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని ఈ సందర్భంగా వారు డిమాండ్ చేశారు.

15వ ఆర్థికసంఘం భేటీకి అధికారులు రెడీ

మన తెలంగాణ/హైదరాబాద్: రాష్ట్రంలో పర్యటించనున్న 15వ ఆర్థిక సంఘానికి సమర్పించేందుకు వివిధ శాఖల అధికారులు తగిన నివేదికలు రూపొందించాలని ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి కె.రామకృష్ణారావు కోరారు. సచివాలయంలో మంగళవారం 15 వ ఆర్థిక సంఘానికి సమర్పించాల్సిన నివేదికపై ఆర్థిక శాఖ ముఖ్యకార్యదర్శి అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రామకృష్ణారావు మాట్లాడుతూ ఎన్.కె.సింగ్ నేతృత్వంలోని 15 వ ఆర్థిక సంఘం ఈ నెల 18 నుండి 20 వరకు రాష్ట్రంలో పర్యటిస్తుందని తెలిపారు. ఈ పర్యటనలో 18న స్థానిక సంస్థలు, పట్టణ మున్సిపాలిటీలు, వాణిజ్యం, పరిశ్రమలకు చెందిన ప్రతినిధులను కలవడంతో పాటు ఈ నెల 19న ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు సమక్షంలో వివిధ శాఖల అధికారులతో సమావేశమవుతారని తెలిపారు. 20న ఆర్థిక నిపుణులతో సమావేశమైన అనంతరం క్షేత్రస్థాయి పర్యటన చేస్తారని తెలిపారు. రైతుబంధు, రైతుబీమా, సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం, మిషన్ భగీరథ, టిఎస్ ఐపాస్, కెసిఆర్ కిట్, కెజి టూ పిజి తదితర ప్రాధాన్యత అంశాలపై నివేదికలు రూపొందించాలన్నారు. ప్రభుత్వ ఆర్థిక సలహాదారు జిఆర్.రెడ్డి ఫైనాన్స్ కమిషన్ మార్గదర్శకాలను వివరించడంతో పాటు రాష్ట్ర ప్రత్యేక అవసరాలను నివేదికలలో పొందుపరచాలన్నారు. ఈ సమావేశంలో ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు అజయ్ మిశ్రా,రాజేశ్వర్ తివారి, డిజిపి మహేందర్ రెడ్డి, సాధారణ పరిపాలనా శాఖ ముఖ్య కార్యదర్శి అదర్ సిన్హా, ముఖ్య కార్యదరుల్శు సోమేశ్ కుమార్, శాంతికుమారి, అరవింద్ కుమార్, సునీల్ శర్మ, కార్యదర్శులు బి.వెంకటేశం, నవీన్ మిట్టల్, బెనహర్ మహేశ్ దత్ ఎక్కా, పిసిసిఎఫ్ పి.కె.ఝా తదితరులు పాల్గొన్నారు.

ఆరు రాష్ట్రాల డిజిపిల భేటీ

మన తెలంగాణ/హైదరాబాద్ : అనతికాలంలో జరుగనున్న పార్లమెంట్ ఎన్నికల భద్రత గురించి మంగళవారం ఆంధ్రప్రదేశ్‌లోని తిరుపతిలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు, ఓడిశా, చత్తీస్‌గఢ్ రాష్ట్రాల డిజిపిలు సమావేశమయ్యారు. ఈ సమావేశంలో పార్లమెంట్ ఎన్నికలలో తీసుకోవాల్సిన భద్రతా చర్యలపై చర్చించారు. మవోయిస్టుల కదలికలు, పోలీస్ సిబ్బంది తరలింపు తదితర అంశాలపై ఆరు రాష్ట్రాల పోలీసు ఉన్నతాధికారులు చర్చించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర హోంశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ రాజీవ్ త్రివేది, రాష్ట్ర ఎడిజి జితేందర్, సీనియర్ ఐపిఎస్‌లు స్టిఫెన్‌రవీంద్ర తదిరులు పాల్గొన్నారు. పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు ఆరు రాష్ట్రాల పోలీసులు సమన్వయంతో సమాచారం పంచుకోవాలని భేటిలో చర్చించారు. రాష్ట్రాల సరిహద్దులలో చెక్‌పోస్టులు ఏర్పాటు చేసుకుని నగదు, మద్యం, మావోయిస్టులను కట్టడి చేయాలని నిర్ణయం తీసుకున్నారు. సమావేశంలో ఎడిజి జితేందర్ మాట్లాడుతూ ఇటీవల తెలంగాణ రాష్ట్రంలో అసెంబ్లీ, గ్రామ పంచాయతీ ఎన్నికలలో చేపట్టిన చర్యలను మిగితా రాష్ట్రాల డిజిపిలకు వివరించారు. ఇటీవల రాష్ట్రంలో మూడు దఫాలుగా జరిగిన పంచాయతీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగేటట్లు అన్ని రకాల చర్యలు చేపట్టామన్నారు. మూడు విడతల ఎన్నికలు సైతం ఏలాంటి అవాంతరాలు, రీపోలింగ్ లేకుండా నిర్వహించామని తెలిపారు. ముఖ్యంగా మావోయిస్టు ప్రభావిత ప్రాంతాలలో సిఆర్‌పిఎఫ్, రాష్ట్ర ఇంటెలిజెన్స్, గ్రేహౌండ్స్ దళాలు కలిసి సంయుక్తంగా పనిచేశాయన్నారు. దీంతో రాష్ట్రంలో మావోయిస్టు ప్రభావిత ప్రాంతాలలో 6.7 శాతం ఓటింగ్ అధికంగా పెరిగిందన్నారు. రాష్ట్ర సరిహద్దుల్లో ఏర్పాటు చేసిన చెక్‌పోస్ట్‌లే కారణంగా మావోయిస్టుల కదలికలను, రాకపోకలను అరికట్టడం జరిగిందన్నారు. ఎన్నికల సమయంలో నగదు, మద్యం, మావోయిస్టులను అరికట్టేందుకు రాష్ట్ర వ్యాప్తంగా 90 చెక్ పోస్టులను ఏర్పాటు చేశామన్నారు. పార్లమెంట్ ఎన్నికలలోనూ ఓటర్లపై ప్రభావం చూపే వాటిపై తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు, ఓడిశా, చత్తీస్‌గఢ్ రాష్ట్రాల సరిహద్దుల్లో నిఘాను పెంచాలని నిర్ణయించారు. తెలంగాణ రాష్ట్రంలో వరుస ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించినందుకు ఇతర రాష్ట్రాల డిజిపిలు తెలంగాణ రాష్ట్ర పోలీసుల పనితీరును ప్రశంసించారు.

శాఖల సమన్వయంతోనే వన్యప్రాణులకు రక్ష

మన తెలంగాణ/హైదరాబాద్: అడవుల్లో వన్య ప్రాణుల్ని వాటి మానాన్న వదిలిపెట్టేసినా అవి అంతరించడం తగ్గుతుంది. ప్రత్యేకింది పులుల రక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోకపోయినా నష్టం తక్కువగానే ఉంటుంది. ఇలా చేస్తే పులులకు మేలు చేసినట్లే అవుతుంది. అడవుల రక్షణకు ఓగార్డు ఉంటాడు. కాలం చెల్లిన ఓ తుపాకీ పట్టుకుని గార్డు విధులు నిర్వహిస్తాడు. అడవులు, ప్రత్యేకించి పులులు, వన్య ప్రాణుల రక్షణకు ప్రభుత్వం అన్ని శాఖల సమన్వయంతో పనిచేయిస్తేనే ఫలితాలు ఉంటాయి.. అని హైకోర్టు వ్యాఖ్యానించింది. పూర్వపు ఆదిలాబాద్ జిల్లా విస్తరించిన కవ్వాల్ పులుల సంరక్షణ కేంద్రంలో పులుల సంరక్షణ పథకాన్ని అమలు చేయాలని కోరుతూ దాఖలైన ప్రజాహిత వ్యాజ్యం విచారణ సందర్భంగా మంగళవారం హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ టీబీఎన్ రాధాకృష్ణన్, న్యాయమూర్తి జస్టిస్ ఎ.రాజశేఖర్‌రెడ్డిలతో కూడిన ధర్మాసనం పైవిధంగా అభిప్రాయాన్ని వ్యక్తం చేసింది. ఆదిలాబాద్, నిర్మల్, ఆసిఫాబాద్, మంచిర్యాల, కుమ్‌రంభీమ్ జిల్లాల్లో విస్తరించి ఉన్న ఈ కేంద్రం ద్వారా పులుల సంరక్షణ పథకాన్ని అమలు చేసేలా తెలంగాణ సర్కార్‌కు ఆదేశాలివ్వాలని అభ్యర్థిస్తూ హైదరాబాద్‌లోని బండ్లగూడ జాగిర్ దియా సూర్ పిల్ దాఖలు చేశారు. విద్యుత్ శాఖను కూడా ప్రతివాదిగా చేస్తామని ప్రకటిస్తూ విచారణ 7వ తేదీకి వాయిదా వేసింది.

టీచర్ల సమస్యలపై త్వరలో భేటీ



పదోన్నతులు, బదిలీలపై స్పష్టత • సంఘాల ప్రతినిధులతో సమావేశం కానున్న సిఎం

మన తెలంగాణ/హైదరాబాద్: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంపై వివిధ ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులతో ముఖ్యమంత్రి కెసిఆర్ సమావేశమయ్యే అవకాశం ఉంది. ముఖ్యమంత్రి సైతం సానుకూలంగానే ఉన్నారని టీచర్ ఎంఎల్‌సిలు వెల్లడించారు. ఏకీకృత సర్వీసు నిబంధనలను కొట్టి వేస్తూ హైకోర్టు గతంలో ఇచ్చిన తీర్పుపై సుప్రీం కోర్టు తాజాగా స్టే విధించిన నేపథ్యంలో మంగళవారం శాసనమండలి ఛీఫ్ విప్ పాతూరి సుధాకర్‌రెడ్డి, టీచర్ ఎంఎల్‌సిలు కాటేపల్లి జనార్ధన్‌రెడ్డి, పూల రవీందర్‌లు సిఎం కెసిఆర్ కలిసి ఉపాధ్యాయుల సమస్యలపై చర్చించారు. భాషా పండితులు, పిఇటిలకు స్కూల్ అసిస్టెంట్ల హోదా కల్పించే విషయంపై సిఎం సానుకూలంగా స్పందించారని టీచర్ ఎంఎల్‌సిలు పేర్కొన్నారు. అంతర్ జిల్లాల బదిలీలపై కూడా సిఎం సానుకూలంగా ఉన్నారని అన్నారు.

వెంటనే టీచర్ల అంతర్ జిల్లాల బదిలీలు చేపట్టాలి : పాతూరి

ఉపాధ్యాయుల అంతర్ జిల్లాల బదిలీల ప్రక్రియ వెంటనే ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని శాసనమండలి ఛీఫ్ విప్ పాతూరి సుధాకర్‌రెడ్డి ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావుకు విజ్ఞప్తి చేశారు. వేర్వేరు చోట్ల ఉపాధ్యాయులుగా పనిచేస్తున్న భార్య, భర్తల బదిలీలు, పరస్పర అంగీకార(మ్యూచ్‌వల్) బదిలీలకు ప్రాధాన్యత ఇవ్వాలని ముఖ్యమంత్రికి రాసిన లేఖలో కోరారు. అంతర్ జిల్లాల బదిలీలపై 2012లోనే మార్గదర్శకాలు విడుదలయినప్పటికీ అవి అమలు కావడం లేదని ఆయన పేర్కొన్నారు. ఉపాధ్యాయుల అంతర్ జిల్లాల బదిలీలపై సిఎం కెసిఆర్ ఇదివరకే సానుకూలంగా స్పందించిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. అంతర్ జిల్లాల బదిలీల హామీ అమలుకు అడ్డంకులు ఏమీ లేనందున ప్రక్రియ ప్రారంభానికి ఆదేశాలు జారీ చేయాలని పాతూరి సిఎం కెసిఆర్‌ను కోరారు. ఉపాధ్యాయుల పదోన్నతులకు లైన్ క్లియర్ అయ్యింది. ఏకీకృత సర్వీసు నిబంధనలపై హైకోర్టు ఇచ్చిన తీర్పును సుప్రీం కోర్టు నిలుపుదల చేసింది. ఈ అంశంపై టీచర్ ఎంఎల్‌సిలు సిఎం కెసిఆర్‌ను కలిసి చర్చించారు. ఉపాధ్యాయుల పదోన్నతులకు న్యాయపరమైన అడ్డంకులు తొలగిపోవడంతోపాటు ప్రభుత్వం సానుకూలంగా ఉన్న నేపథ్యంలో త్వరలో ఉపాధ్యాయులకు పదోన్నతులు లభించే అవకాశం కనిపిస్తోంది. రాష్ట్రంలోని పాఠశాలల్లో పనిచేస్తున్న అర్హులైన ఉపాధ్యాయులకు హెచ్‌ఎం, ఎంఇఒ, డిప్యూటి ఇఒ, డైట్ లెక్చరర్, జూనియర్ లెక్చరర్ వంటి పోస్టుల్లో పదోన్నతులు లభించనున్నాయి. ఏకీకృత సర్వీస్ నిబంధనల విషయంలో ప్రభుత్వ, పంచాయతీరాజ్ టీచర్ల వివాదం కారణంగా పాఠశాల విద్యాశాఖలో గత 20 ఏళ్లుగా పదోన్నతులు లేకుండా పోయాయి. ఏకీకృత సర్వీసు నిబంధనలపై రాష్ట్రపతి సవరణ ఉత్తర్వులు అమలైతే రాష్ట్రంలో సుమారు 10 వేల నుంచి 12 వేల మంది ఉపాధ్యాయులకు పదోన్నతులు లభించనున్నాయి. ఉపాధ్యాయుల పదోన్నతులకు సంబంధింధి ఏకీకృత సర్వీసు నిబంధనల సవరణ ఉత్తర్వులకు రాష్ట్రపతి ఆమోదం తెలిపినప్పటికీ, రాష్ట్ర హైకోర్టు ఆ సవరణ ఉత్తర్వులను కొట్టివేస్తూ గత ఏడాది ఆగస్టు 28న తీర్పు వెలువరించింది. దానిని సవాల్ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్(ఎస్‌ఎల్‌పి) దాఖలు చేసింది.సోమవారం రాష్ట్ర ప్రభుత్వం దాఖలు చేసిన ఎస్‌ఎల్‌పిని విచారించిన సుప్రీంకోర్టు రాష్ట్ర హైకోర్టు ఇచ్చిన తీర్పుపై స్టే విధించింది. దాంతో రాష్ట్రంలో ఉపాధ్యాయుల పదోన్నతులకు మార్గం సుగమమైంది. రాష్ట్రంలో పదోన్నతుల ద్వారా సుమారు 500 మండలా విద్యాధికారి పోస్టులు, డిప్యూటీ ఇఒ, బి.ఇడి కళాశాలల్లో అధ్యాపకులు, డైట్ లెక్చరర్ పోస్టులతోపాటు సుమారు వెయ్యికిపైగా ప్రధానోపాధ్యాయుల పోస్టులు భర్తీ కానున్నాయి. వీటితోపాటు ప్రస్తుతం సెకండరీ గ్రేడ్ టీచర్లుగా కొనసాగుతున్న టీచర్లకు స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతి లభించనుంది.

జిల్లాకు రెండు ఫ్రీడం స్కూళ్లు



మన తెలంగాణ/హైదరాబాద్ : రాష్ట్రంలో ఫ్రీడం స్కూల్స్‌ను ప్రారంభించనున్నట్లు రాష్ట్ర ఎస్‌సి, ఎస్‌టి గురుకుల విద్యాసంస్థల కార్యదర్శి డాక్టర్ ఆర్.ఎస్. ప్రవీణ్‌కుమార్ వెల్లడించారు. ప్రతి జిల్లాకు రెండు ఫ్రీడం స్కూళ్లు ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఫ్రీడం పాఠశాల విధానంలో విద్యార్థులు సొంతంగా నేర్చుకుంటారని, ఉపాధ్యాయులు కేవలం మార్గదర్శకులుగానే ఉంటారని పేర్కొన్నారు. రాష్ట్ర ఉన్నత విద్యామండలి, కళాశాల, సాంకేతిక విద్యా శాఖల సంయుక్త ఆధ్వర్యంలో 'ఉన్నత విద్య, మానవ వనరుల'పై జరుగుతున్న రెండు రోజుల సదస్సులో రెండవ రోజు జరిగిన 'ఫైర్ సైడ్ ఛాట్ రౌండ్'లో ఇక్ఫాయ్ గ్రూప్ డైరెక్టర్ ప్రొఫెసర్ సుధాకర్‌రావు డాక్టర్ ఆర్.ఎస్.ప్రవీణ్‌కుమార్‌తో ఛాట్ చేశారు. ఈ సందర్భంగా ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ, తాము తరగతిగదిలో ఉపాధ్యాయులకు శిక్షణ ఇవ్వమని, టీచర్లకు సమీపంలోని గ్రామాలకు పంపించి ఆ గ్రామాలలో తల్లిదండ్రులు, విద్యార్థుల పరిస్థితులు అర్థం చేసుకునేలా చేస్తామని అన్నారు. దీని ద్వారా ఉపాధ్యాయులు బోధించే సమయంలో ఎంతో జాగ్రత్తగా వ్యవహరిస్తారని చెప్పారు. గురుకుల డిగ్రీ కళాశాలల్లో గ్రాడ్యుయేషన్ చేసే విద్యార్థులను ప్రథమ సంవత్సరంలో విద్యార్థులకు కమ్యూనికేషన్ స్కిల్స్ నేర్పించే 3సి ప్రోగ్రాంలో చేరేలా ప్రోత్సహిస్తామని తెలిపారు. అలాగే ద్వితీయ సంవత్సరంలో కంప్యూటేషన్ స్కిల్స్, చివరి సంవత్సరంలో విద్య, ఉపాధి, పరిశ్రమల వ్యవస్థాపక అంశాలపై దృష్టి సారించేలా ప్రోత్సహిస్తామని అన్నారు. విద్యార్థుల్లో ఆత్మస్థైర్యం పెంచేలా కార్యక్రమాలు చేపడతామని పేర్కొన్నారు. వీటితో పాటు ప్రాజెక్ట్ మిర్రర్, ప్రాజెక్ట్ బియాండ్ ఫోర్ వాల్స్, యూత్ పార్లమెంట్ సెషన్, వర్చువల్ కార్నివల్, భారత్ దర్శన్, ఇంటర్నేషనల్ ఇంటర్న్‌షిప్, సమ్మర్ అండర్‌గ్రాడ్యుయేట్ రీసెర్చ్ ఫెలోషిప్ తదితర ప్రాజెక్టులు చేపడుతున్నట్లు తెలిపారు.

ముగిసిన సదస్సు

ఉన్నత విద్యలో ఉత్తమ విధానాలు, సంస్కరణలపై 'హయ్యర్ ఎడ్యుకేషన్ అండ్ హ్యూమర్ రిసోర్స్' పేరుతో కళాశాల విద్యా శాఖ, సాంకేతిక విద్యా శాఖ, ఉన్నత విద్యామండలి సంయుక్త ఆధ్వర్యంలో మారియట్ హోటల్‌లో 4,5 తేదీలలో రెండు రోజుల పాటు నిర్వహించిన సదస్సు మంగళవారం ముగిసింది. ఈ సదస్సులో ఉన్నత విద్యలో మనరాష్ట్రంతోపాటు వివిధ రాష్ట్రాలలో అమలు చేస్తున్న ఉత్తమ విధానాలు, ఉన్నత విద్యలో తీసుకురావాల్సిన సంస్కరణలపై చర్చలు, సమావేశాలు నిర్వహించారు. ఈ సదస్సుకు అఖిల భారత సాంకేతిక విద్యామండలి డిప్యూటీ డైరెక్టర్ నీతూ భగత్ సహా యెస్ బ్యాంకు కంట్రీ హెడ్ రింకీ డింగ్రా, ప్రముఖ సినీ నటి హాజరయ్యారు.

మళ్లీ మోడీనే ప్రధాని


ఆత్మవిశ్వాసంతో పనిచేయండి
పార్లమెంట్ ఎన్నికల్లో మనదే విజయం
బిజెపి సమావేశంలో కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ



మన తెలంగాణ/హైదరాబాద్: 'ఆత్మవిశ్వాసంతో పనిచేయండి... బుల్లెట్‌లా దూసుకపోండి... రానున్న పార్లమెంట్ ఎన్నికల్లోనూ మనదే విజయం... నరేంద్రమోడీ మరోసారి ప్రధానిగా బాధ్యతలు చేపట్టడం ఖాయం' అని కేంద్ర మంత్రి నితిన్‌గడ్కరీ అన్నారు. మంగళవారం నగరంలోని ఇంపీరియల్ గార్డెన్‌లో జరిగిన సికింద్రాబాద్, హైదరాబాద్, మల్కాజ్‌గిరి పార్లమెంట్ స్థానాల బిజెపి బూత్ కమిటీల అధ్యక్షులు, శక్తి కేంద్రాల ప్రముఖులతో నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రానున్న లోక్‌సభ ఎన్నికలకు పార్టీ నేతలు, కార్యకర్తలు సమాయత్తం కావాలని పిలుపునిచ్చారు. ఎన్నికల సమయంలో ప్రజలను గందరగోళ పెట్టే చేసే రాజకీయాలు జరుగుతుంటాయని, పార్టీ కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రధాని నరేంద్రమోడీని ధైర్యంగా ఎదుర్కొనే సత్తా లేకనే దేశంలోని ప్రతిపక్షాలన్నీ ఏకమవుతున్నాయన్నారు. కేవలం మోడీపై భయంతోనే ఒకటవుతున్నారని మండిపడ్డారు. ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు పదిశాతం రిజర్వేషన్లను అందిస్తున్న ఘనత మోడీ ప్రభుత్వానికే దక్కిందని, 55 సంవత్సరాల కాంగ్రెస్ పాలనలో జరగిన పనులు వాజపేయి, మోడీ హయాంలో జరిగాయన్నారు. రాష్ట్రాల్లోని నదుల నీళ్ల సముద్రంలో కలవకుండా చూడాలని మోడీ ప్రభుత్వం భావిస్తోందన్నారు. పోలవరం కోసం వంద శాతం నిధులు ఏపికి కేంద్రమే ఇస్తోందన్నారు. మహారాష్ట్ర, చత్తీస్‌ఘడ్, తెలంగాణల మధ్య కాళేశ్వరం ప్రాజెక్ట్ కోసం సిఎం కెసిఆర్ తన వద్దకు పలుమార్లు వచ్చారన్నారు. అయితే ప్రాజెక్టుకు అవసరమైన అన్నిరకాల అనుమతులను 8 రోజుల్లోనే ఇచ్చామన్నారు. ఐదేళ్ళ కాలంలో వేల కోట్ల రూపాయల ప్రాజెక్టులకు తాను అనుమతులు ఇచ్చానని, కానీ ఒక్క రూపాయి అవినీతి కూడా జరగలేదని గర్వంగా చెప్పుకోగలుగుతున్నారు. ఈ సమావేశానికి పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతా సాంబమూర్తి అధ్యక్షత వహించగా పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి మురళీధర్‌రావు, రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కె. లక్ష్మణ్, కేంద్ర మాజీ మంత్రి బండారు దత్తాత్రేయ, ఎమ్మెల్సీ రాంచందర్‌రావు, మాజీ శాసనసభ్యులు కిషన్‌రెడ్డి, రాంచందర్‌రావు, ప్రభాకర్ తదితరులు పాల్గొని ప్రసంగించారు.

24 లక్షల ఓటరు దరఖాస్తులు!

ఇప్పటికే 9.32 లక్షల అదనపు ఓటర్లు



5వ తేదీ సాయంత్రం వరకు అప్‌డేట్ చేసిన దరఖాస్తుల వివరాలు ఇలా

దరఖాస్తు నమూనా	వచ్చినవి	ఆమోదించినవి	తిరస్కరించినవి	పెండింగ్
ఫామ్ 6	1797628	932756	61047	803825
ఫామ్ 6ఎ	2091	94	72	1925
ఫామ్ 7	197818	138836	5986	52996
ఫామ్ 8	222914	97126	20761	105027
ఫామ్ 8ఎ	150685	76634	3467	70584
మొత్తం	2371136	1245446	91333	1034357

మన తెలంగాణ/హైదరాబాద్: ప్రత్యేక ఓటరు జాబితా సవరణలో భాగంగా రాష్ట్రం మొత్తంమీద దాదాపు 24 లక్షలకు పైగా దరఖాస్తులు వచ్చాయి. ఈ నెల 4వ తేదీతో ఓటర్ల జాబితాలో పేరు మార్పులు, అడ్రస్, నియోజకవర్గ మార్పులకు గడువు ముగిసింది. ప్రస్తుతం వచ్చిన దరఖాస్తుల్లో 12.45 లక్షలు సక్రమంగా ఉండడంతో ఆమోదం తెలిపిన ఎన్నికల యంత్రాంగం మరో 10.34 లక్షల దరఖాస్తులను పరిశీలిస్తూ ఉంది. అత్యధికంగా ఓటర్ల జాబితాలో కొత్తగా పేరును నమోదు చేసుకోడానికి వినియోగించే ఫామ్ 6 అప్లికేషన్‌లు 18 లక్షల వరకు వచ్చినట్లు ఎన్నికల అధికారులు తెలిపారు. ఇందులో 9.32 లక్షల దరఖాస్తులను ఆమోదించగా, 61,047 లక్షల దరఖాస్తులు తిరస్కరణకు గురయ్యాయి. మరో 8.03 లక్షల దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. ఆన్‌లైన్, ఆఫ్ లైన్ విధానా ల్లో లక్షల సంఖ్యలో దరఖాస్తులు వచ్చాయని, ఈ నెల 5వరకు ఆన్‌లైన్ చేసిన దరఖాస్తుల సంఖ్య 23.71 లక్షలుగా ఉందని, బూత్ స్థాయి అధికారులు మాన్యువల్‌గా స్వీకరించిన దరఖాస్తులను ఇంకా ఆన్‌లైన్‌లో అప్‌డేట్ చేయాల్సి ఉందని, మొత్తం దరఖాస్తుల సంఖ్య 24 లక్షలు దాటుతుందని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి కార్యాలయ అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ నెల 22వ తేదీన తుది జాబితా ప్రకటిస్తారు.



భక్తి అడుగు జాడ... నాగోబా నీడ

మన తెలంగాణ / ఇంద్రవెల్లి: అడవుల జిల్లాగా పేరొందిన ఆదిలాబాద్ జిల్లాలో ఆదివాసీలకు ఎంతో ప్రాశస్త్యంగల నాగోబా జాతరతో ఇంద్రవెల్లి మండలం ఆదివాసీల ఆరాధ్య దైవం కేస్లాపూర్ నాగోబా ఆలయ ప్రాంగణం భక్తజన సంద్రంగా మారింది. సోమవారం అర్ధరాత్రి మేస్రం వంశీయుల మహాపూజ అనంతరం మంగళవారం తెల్లవారుజామున మేస్రం వంశస్తుల కోడళ్లు కుల దేవత వద్ద భేటింగ్ అయ్యారు. మేస్రం వంశీయుల పెద్దల ఆశీస్సులు పొందారు. ఆలయం వెనుక పెర్సపేన్ పూజలు నిర్వహించారు. భేటింగ్ అయిన కొత్త కోడళ్లతో మేస్రం వంశీయుల పటేల్‌ల సతీమణులు సత్యదేవత పూజలు చేయించారు. ఇలా చేయడం వల్ల జీవితం సుఖ సంతోషాలతో సాగుతుందని వీరి నమ్మకం. నాగోబా పూజ కోసం కోనేరు నుంచీ నీరు తీసుకొచ్చి ప్రత్యేకంగా నైవేద్యం వంటివి సమర్పించి మొక్కులు తీర్చుకున్న తర్వాత ఉపవాస దీక్షలను విడచారు. మేస్రం వంశీయుల్లో కొత్తగా పెళ్లి చేసుకున్న వారు ఇప్పటి వరకు నాగోబా దర్శనం చేయని 50కి పైగా మేస్రం వంశీయుళ్లలో కోడళ్లు తెల్లటి దుస్తులు ధరించి భేటింగ్ పరిచయంలో పాల్గొన్నారు. అనంతరం నాగోబా ఆలయంలో మేస్రం వంశీయుల పెద్దల ఆశీర్వాదం తీసుకున్నారు. ఈ భేటింగ్ పరిచయ కార్యక్రమంలో వారు పూర్తిగా మేస్రం వంశంలో చేసినట్లు భావించారు. నాగోబా జాతరకు మహారాష్ట్ర, ఛత్తీస్‌ఘడ్, జార్ఖండ్, మధ్యప్రదేశ్, ఓడిసా, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన మేస్రం వంశస్థుల గిరిజనులు కుటుంబాలతో కలిసి పెద్ద సంఖ్యలో చేరుకున్నారు. ఈ జాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.



ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు





తెల్లటిదుస్తులు ధరించి భేటింగ్‌లో పాల్గొన్న మేస్రం కోడళ్లు

ఎవరికి వారే!


సంపాదకీయం

ఇప్పటికే యుద్ధ వాతావరణం అలముకున్న వచ్చే లోక్‌సభ ఎన్నికలలో రస వత్తర రాజకీయ క్రీడ సాగనున్నదని స్పష్టపడుతున్నది. పోరు రెండు ప్రధాన రాజకీయ పక్షాల మధ్య, ఇద్దరు ప్రధాని అభ్యర్థుల నడుమ ముఖా ముఖీ, బాహాబాహీ అయితే పెద్దగా ఆసక్తికరమనిపించదు. యుద్ధం ఎవరి మధ్యో, ఎవరి బలాలు ఏమిటో స్పష్టంగా అంచనా వేయలేని నేపథ్యంలో జరిగే సంకుల సమరమే అయోమయావస్థను అదే సమయంలో అమిత ఉత్కంఠను రేకెత్తిస్తుంది. ఇప్పటి పరిస్థితిని బట్టి చూస్తే మరి కొద్ది నెలల్లో జరగబోయే లోక్‌సభ ఎన్నికల రంగస్థలం ఇలాగే ఉండే సూచనలు కనిపిస్తున్నాయి. ఒక వైపు ప్రధాని నరేంద్ర మోడీ గ్రాఫ్ (రేఖాపటంలో సూచీ) పడిపోతున్నట్టు స్పష్టంగా రుజువవుతున్నది. మరోవైపు ఆయనను నేరుగా ఢీకొనే ఉమ్మడి ప్రత్యర్థి కొరత కూడా రూపుకడుతున్నది. రాఫెల్ యుద్ధ విమానాల కొనుగోలులో లొసుగులను, మోడీ – అనిల్ అంబానీ 'అవినీతి అనుబంధాన్ని' పదేపదే ఎత్తి చూపుతూ ప్రధానిని బోనెక్కించడంలో కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ సఫలీకృతుడవుతున్న దృశ్యం స్పష్టాస్పష్టంగానైనా తెర మీదకు ఎక్కి ఉన్నది. బ్యాంకులకు భారీగా ఎగనామం పెట్టి విదేశాలకు పారిపోయిన విజయ మాల్యా వంటి వారిని రప్పించడం ఖాయమనిపిస్తున్నది. అలాగే 2013 నాటి అగస్టావెస్ట్‌లాండ్ వివిపి హెలికాప్టర్ల కుంభకోణాన్ని కేంద్రం తిరగదోడుతున్నది. ఇటువంటి చర్యల ద్వారా అవినీతి అంతుచూసే జనహిత నేతగా నిరూపించుకోడానికి ప్రధాని పాచికలు కదుపుతున్నారు. ఆ మేరకు రాహుల్ గాంధీ రాఫెల్ విమర్శనాస్త్రాల పరంపరను బలహీనపరచడానికి మోడీ కృషి చేస్తున్నారు. అయితే లోక్‌సభ ఎన్నికల రణరంగం కేవలం మోడీ – రాహుల్ మధ్య ద్వంద్వ యుద్ధ వేదికగా మాత్రమే నిరూపించుకోబోవడం లేదు. బలమైన ప్రాంతీయ రాజకీయ పక్షాలు రంగంలో ఉన్నాయి. ఇవన్నీ కలిసి జాతీయ స్థాయి కూటమిగా అవతరించి బరిలో దిగితే దేశ రాజకీయ ముఖ చిత్రమే మారిపోతుంది. అటువంటి పరిణామానికి మాత్రం ఆస్కారం కనిపించడం లేదు.

ఉత్తరప్రదేశ్‌లో సమాజ్‌వాదీ, బహుజన సమాజ్ పార్టీలు బిజెపికి, కాంగ్రెస్‌కు దూరంగా అపూర్వమైన ప్రత్యేక కూటమిగా అవతరించాయి. దాదాపు 44 శాతంగా ఉండే ఆ రాష్ట్ర ఎస్‌సి, బిసి ఓట్లతో కూడిన తమ ఉమ్మడి ఓటు బ్యాంకుతో అక్కడ గల 80 లోక్‌సభా స్థానాల్లో కనీసం 70 పైచిలుకు సీట్లను గెలుచుకోడానికి, తద్వారా మోడీ అధికార రథాన్ని తల్లకిందులు చేయడానికి వ్యూహ రచన చేసి ముందుకెళుతున్నాయి. అయితే ఈ రెండు పార్టీలు కాంగ్రెస్‌ను కలుపుకోకుండా దూరం పెట్టడం అందరి దృష్టినీ ఆకర్షిస్తున్నది. యుపిలో హస్తం పార్టీకి పెద్దగా ఓటు బ్యాంకు లేనందువల్లనే ఎస్‌పి, బిఎస్‌పిలు దానిని నిర్లక్ష్యం చేశాయన్నది వాస్తవమే. అయితే దీనితో అలుక వహించిన కాంగ్రెస్ యుపిలో అన్ని లోక్‌సభ స్థానాలకు పోటీ చేయనున్నట్టు ప్రకటించింది. అదే జరిగితే ముస్లిం మైనారిటీ ఓట్లలో చీలిక వచ్చి బిజెపి లాభపడుతుందని పరిశీలకులు భావిస్తున్నారు. ఇది మోడీపై ప్రతిపక్షం పోరాటాన్ని ఆ మేరకు బలహీనపరుస్తుంది.

ఈసారి లోక్‌సభ ఎన్నికల్లో గణనీయమైన శక్తి సామర్థ్యాలున్న ముగ్గురు మహిళలు తమ ప్రతాపాన్ని చూపబోతున్నారు. వీరు ముగ్గురు ఒకే అమ్ముల పొదిలో ఉండివుంటే వారి ఉమ్మడి తడాఖా భారతీయ జనతా పార్టీని బెంబేలెత్తించడానికి ఎక్కువ అవకాశం ఉంటుంది. కాని ప్రియాంక గాంధీ కాంగ్రెస్‌లోనూ, మాయావతి ఎస్‌పి, బిఎస్‌పి కూటమిలోనూ, మమతా బెనర్జీ మరొక మోడీ వ్యతిరేక పార్టీల బృందంలోనూ ఉన్నారు. ఈ మొత్తం నేపథ్యం ఇంతటి బలహీన స్థితిలోనూ భారతీయ జనతా పార్టీకి, నరేంద్ర మోడీకి భరోసాను కలిగించేదిగా ఉన్నదని భావించక తప్పదు. ఐకమత్యంతో సింహాన్ని తరిమికొట్టగలిగిన నాలుగు ఎద్దులూ విడిపోయినప్పుడు దాని ముందు ఓడిపోవడం సహజమైనట్టే రేపటి లోక్‌సభ ఎన్నికల్లో అనైక్య ప్రతిపక్షం చివరికి తోక ముడవక తప్పని పరిస్థితి తల ఎత్తితే ఆశ్చర్యపడవలసిన పని లేదు. ఇందుకు తోడు ఒక్క మతతత్వ విషయంలో తప్ప ఇతరత్రా ప్రత్యామ్నాయ విధానమంటూ ప్రతిపక్షానికి లేకపోవడం స్పష్టంగా కనిపిస్తున్నది. బిజెపి, కాంగ్రెస్‌ల ఆర్థిక విధానాలు ఒకే రకమైనవి. పబ్లిక్ రంగాన్ని నిరుత్సాహపరిచి ప్రైవేటుకు పట్టంగట్టిన చరిత్రే రెండు పార్టీలదీ. ఇతర ప్రతిపక్షాలు కూడా సరికొత్త ఆర్థిక విధానాన్ని రూపొందించుకోలేదు. ఇది పాలక ప్రతిపక్షాల మధ్య కొట్టవస్తున్నట్టు కనిపిస్తున్న సారూప్యం. ఇటువంటప్పుడు ఒక్క శక్తిగా ఉన్న బిజెపివైపా, భిన్న కుంపట్లుగా విడిపోయి ఉన్న ప్రతిపక్షాలవైపా ఎటువైపు అనే ప్రశ్న దేశ ప్రజల ముందు నిలువెత్తున నిలుస్తుంది.

కోల్‌కతాలో పంజరపు చిలుక



జనవరి 19వ తేదీన దాదాపు 20 పార్టీలు కోల్ కతాలో జరిగిన బ్రిగేడ్ ర్యాలీలో పాల్గొన్నాయి. పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి వేదికపై స్వయంగా నడిపించిన మహాసభలో ఈ పార్టీలన్నీ చేతులు కలిపి మోడీ సర్కారును కూల్చుతామన్నాయి. ఆ తర్వాత వివిధ పార్టీల నాయకులకు మమతా బెనర్జీ సౌజన్య పూర్వక విందు ఇచ్చారు. అందులో ఆమె స్వయంగా వివిధ నాయకులకు పశ్చిమ బెంగాల్ ఆహార పదార్థాలను వడ్డిస్తూ కనిపించారు. ప్రధాని పదవికి పోటీపడే అనేకమంది నేతలు అక్కడ మనకు కనిపించారు. కేంద్రంలో నరేంద్ర మోడీ నాయకత్వంలోని, బిజెపి సారథ్యంలోని ఎన్‌డిఎ ప్రభుత్వాన్ని కుప్పకూల్చడమే ధ్యేయంగా ఈ పార్టీలన్నీ కలిసి పనిచేస్తామన్నాయి.

నెల రోజులు కూడా గడవకముందే, మమతా బెనర్జీ కోల్‌కతాలో ధర్నా చేయవలసిన అవసరం వచ్చింది. ముఖ్యమంత్రి అయినా సరే అవసరమైతే ధర్నాకు కూర్చోవడం తప్పుకాదని, అలా చేయడం అవసరమేనని ఇంతకు ముందు ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ చాటి చెప్పిన సంగతి బహుశా ఆమెకు గుర్తుండి ఉంటుంది. త్వరలోనే ఒక మహాయుద్ధానికి సిద్ధం కావలసి ఉందని ఆమెకు తెలుసు. ఎన్నికలు దగ్గరపడుతున్నాయి. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఆయుధాలు పదును పెట్టుకుంటోంది.

మమతాబెనర్జీ ఎందుకు ధర్నా చేస్తున్నారన్న ప్రశ్నకు జవాబు, అంతకు ముందు రోజు సిబిఐ అధికారులకు, కోల్ కతా పోలీసులకు మధ్య జరిగిన ఘర్షణ. పాంజీ స్కీముల కుంభకోణానికి సంబంధించిన కోల్ కతా పోలీసు కమిషనర్ రాజీవ్ కుమార్‌ను ప్రశ్నించాలని సిబిఐ అధికారులు కోల్‌కతా వచ్చారు. కాని కోల్‌కతా



వచ్చిన ఈ సిబిఐ అధికారులను కోల్‌కతా పోలీసులు నిర్బంధంలోకి తీసుకుని పోలీసు స్టేషనుకు తరలించారు. రాజీవ్ కుమార్‌కు ఈ కుంభకోణంలో ప్రమేయం ఉందని సిబిఐ ఆరోపణ. కాని మమతాబెనర్జీ మాత్రం ఆయన నిజాయితీపరుడైన, సమర్థుడైన పోలీసు అధికారి అని కితాబు ఇచ్చారు. విశ్వసనీయతలేని, పంజరంలో చిలక వంటి సిబిఐ నుంచి తన అధికారులను కాపాడుకుంటున్న నాయకురాలిగా ఆమె ఈ ధర్నాతో ప్రజలకు పరిచయమయ్యారు. ఒక కుంభకోణంలో విచారణను అడ్డుకునే ప్రయత్నంగా ఇది కనిపిస్తున్నప్పటికీ రాజకీయంగా ఇది గొప్ప ఎత్తుగడ కాదనలేం. మమతా బెనర్జీ ఇలా తిరగబడతారని బహుశా బిజెపి ఊహించలేదు.

ఇప్పుడేం జరిగింది. వివిధ పార్టీలు మమతాబెనర్జీకి మద్దతుగా ముందుకు వచ్చాయి. సిబిఐ గురించి ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. పంజరంలో చిలక అని కోర్టు స్వయంగా వ్యాఖ్యానించింది. ఏ ప్రభుత్వం అధికారంలో ఉంటే ఆ ప్రభుత్వం చేతిలో కీలు బొమ్మగా వ్యవహరిస్తుందన్న అనుమానాలు బలంగా ఉన్నాయి. కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు కాంగ్రెసుకు అనుకూలంగా రాజకీయ ప్రత్యర్థులపై ఉపయోగించారన్న ఆరోపణలు వినిపించాయి. ఇప్పుడు బిజెపి అధికారంలో ఉన్నప్పుడు బిజెపి ప్రత్యర్థులపై ఉపయోగిస్తున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి. ఇటీవల సిబిఐలో జరిగిన రచ్చ కూడా అందరికీ తెలిసిందే. ఈ నేపథ్యంలో ఇటీవల అకస్మాత్తుగా పాత కేసులపై అనేక కేంద్ర సంస్థలు చురుకుగా పని చేస్తుండడం, రాజకీయ ప్రత్యర్థులే లక్ష్యంగా ఐటి, ఆదాయపు పన్ను శాఖల దాడులు జరుగుతుండడం ఇవన్నీ ప్రజలు గమనించడం లేదనుకుంటే పొరబాటు. సిబిఐ కూడా పాత కేసుల విచారణ విషయంలో ఒక్కసారి చురుకుగా చర్యలు తీసుకోవడం, అది కూడా ఎన్నికలకు ముందు జరుగుతున్న ఈ పరిణామాలను ప్రజలు కూడా నిశితంగా గమనిస్తున్నారు. సిబిఐ పని తీరును ప్రజలు గమనించడం లేదనుకోవడం పాలకుల భ్రమ.

బ్రిగేడ్ ర్యాలీ తర్వాత ప్రతిపక్ష ఐక్యత స్పష్టంగా ముందుకు వచ్చిన నేపథ్యంలో మమతాబెనర్జీని ఇబ్బంది పెట్టేలా సిబిఐని కేంద్రమే ప్రయోగించి ఉంటే ఎన్నికలకు ముందు ఇది రాజకీయ తప్పిదమే. అలాగే, ఈ నేపథ్యంలో ధర్నాకు దిగడం ద్వారా పరిస్థితిని తనకు అనుకూలంగా వాడుకోవడం మమతాబెనర్జీ రాజకీయ చాకచక్యానికి నిదర్శనం. మోడీతో ప్రత్యక్షంగా తలపడుతున్న నేతగా ఆమె గుర్తింపు ఈ చర్యతో ఎక్కువైంది. బలమైన సంకల్పం ఉన్న నాయకులనే ప్రజలు ఆదరిస్తారన్నది కూడా ఆమెకు తెలుసు. ప్రతిపక్ష ఐక్యత సందర్భంగా తలెత్తిన మరో ప్రశ్న, తదుపరి ప్రధాని అభ్యర్థి ఎవరన్నది. ప్రతిపక్ష నాయకుల్లో చాలా మంది పోటీపడుతున్నారు. కాని రాజకీయ చర్చ తమ చుట్టు తిప్పుకున్నవారికే అవకాశాలు ఎక్కువ ఉంటాయి. మమతాబెనర్జీ చుట్టే ఇప్పుడు చర్చ తిరుగుతోంది. 2019 సార్వత్రిక ఎన్నికల్లో మమతాబెనర్జీకి ఇది ఎంతో ఉపయోగపడే సానుకూలాంశం.

ఇటీవల అఖిలేష్ యాదవ్‌కు కూడా సిబిఐ నుంచి హెచ్చరికల వంటి సందేశాలు వెళ్ళాయి. అఖిలేష్ యాదవ్ కూడా సిబిఐని కేంద్రం వాడుకుంటుందని విమర్శించారు. కాని మమతాబెనర్జీ తనపై సిబిఐని ప్రయోగించి దెబ్బతీయాలని చూస్తున్నారని చెప్పడమే కాదు, ఇలాంటి ప్రయత్నాలు సహించేది లేదన్న రీతిలో పోరాటానికి సిద్ధమయ్యారు. మోడీపై మమతాబెనర్జీ పోరాటం ఇప్పుడు మిగిలిన నాయకులను మరుగుజ్జులుగా మార్చేసింది. రాఫెల్ పై రాహుల్ గాంధీ చేస్తున్న పోరాటం కాని, ప్రియాంక గాంధీ రాజకీయాల్లోకి వచ్చి సృష్టించిన సంచలనం కాని అన్నీ ఇప్పుడు వెనక్కు వెళ్ళి పోయాయి. కనిపిస్తున్నది కేవలం మమతా బెనర్జీ మాత్రమే.

పశ్చిమ బెంగాల్లో బలపడడానికి బిజెపి చేస్తున్న ప్రయత్నాలు బెడిసి కొడుతున్నాయా? పశ్చిమబెంగాల్ రాజకీయాల్లో ఎన్నికలు ఎలా గెలవాలన్నది మమతాబెనర్జీకి బాగా తెలిసిన విద్య. ఇప్పుడు ఆమె కోల్‌కతా వేదికగా జాతీయ రాజకీయాల్లో ప్రకాశించే అవకాశం దొరికింది. ప్రజలు ఈ పరిణామాలన్నింటిని గమనిస్తున్నారు. ఇప్పుడు ప్రతిపక్ష ఐక్యతను నిరూపించాలంటే, ఇంతకు ముందు ఫ్రంట్ గురించి మాట్లాడిన ప్రతి నాయకుడు మమతా బెనర్జీకి మద్దతివ్వక తప్పని పరిస్థితి ఆమె సృష్టించారు.

కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ ఆమెకు మద్దతుగా మాట్లాడారు. జెడి (యస్) నాయకుడు దేవెగౌడ, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిఎంకె నాయకుడు స్టాలిన్, ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్, నేషనల్ కాన్ఫరెన్స్ నాయకుడు ఉమర్ అబ్దుల్లా, ఆర్‌జెడి నాయకుడు తేజస్వీ యాదవ్, రాష్ట్రీయ లోక్ దళ్ నాయకుడు జయంత్ చౌదరీ, కర్నాటక ముఖ్యమంత్రి కుమారస్వామి, సమాజవాది పార్టీ నాయకుడు అఖిలేష్ యాదవ్, మాజీ కేంద్రమంత్రి యశ్వంత్ సిన్హా, కశ్మీర్ మాజీ ముఖ్యమంత్రి, పిడిపి పార్టీ నాయకురాలు మహబూబా ముఫ్తీ, జార్ఖండ్ మాజీ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్, మహారాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి శరద్ పవార్ మాత్రమే కాదు, బిజెపికి సన్నిహితంగా ఉండే శివసేన కూడా మమతాబెనర్జీ వైపే నిలిచాయి. జాతీయ రాజకీయాల్లో మోడీ వ్యతిరేక ఫ్రంటుకు కావలసిన సువర్ణావకాశం, ప్రధాని పదవికి అభ్యర్థిగా మమతా బెనర్జీ బలపడే అవకాశం ఇప్పుడు లభించాయి.

వందన (డైలీ ఓ)

గిరిజన నాగారాధన జాతర



గుర్రం విజయ శ్రీనివాస్
9666089111

ఆదిలాబాద్ జిల్లా కేస్లాపూర్‌లో నాలుగు రోజుల పాటు జరిగే నాగోబా జాతర సోమవారం అర్ధరాత్రి ప్రారంభమైంది. ప్రపంచంలోని అతిపెద్ద గిరిజన జాతరలలో ఒకటిగా ఇది ప్రసిద్ధిగాంచింది. సర్ప జాతిని పూజించడమే ఈ పండగ ప్రత్యేకత. అమావాస్య రోజు తమ ఆరాధ్య దైవమైన నాగోబా (శేషనారాయణమూర్తి) పురివిప్పి నాట్య మాడుతాడని గిరిజనుల నమ్మకం. అమావాస్య నాడు సరిగ్గా సాయంత్రం ఏడు గంటల నుంచి రాత్రి పన్నెండు గంటల మధ్య కాలంలో గిరిజన పూజారులకు తమ ఆరాధ్య దైవం ఆదిశేషువు కనిపిస్తాడని వారందించే పాలు తాగి ఆశీర్వదించి అదృశ్యమవుతాడని గిరిజనులు విశ్వసిస్తారు. ఆదిమ గిరిజనుల్లో మేస్రం వంశీయుల ఆరాధ్య దైవం నాగోబా. గోండుల దేవత, నాగోబా దేవాలయం ఆదిలాబాద్‌కు 40 కిలో మీటర్ల దూరంలో ఇంద్రవెల్లి మండలం ముత్నూర్ దగ్గర కేస్లాపూర్ గ్రామంలో ఉంది. కేస్లాపూర్‌లో జరిగే ఈ జాతరను ప్రభుత్వం రాష్ట్ర పండుగగా ప్రకటించింది. కేస్లాపూర్ జనాభా 800 కు మించదు. కాని పండగనాడు లక్షలాది మందితో అది జనారణ్యంగా మారుతుంది.

విభిన్నమైన ఆచార వ్యవహారాలు

గిరిజనులకు ఆరాధ్య దైవం ఆదిశేషుడు కావడం వల్ల అనాదిగా కేస్లాపూర్ గ్రామంలో వెలిసిన వారి కులదైవం నాగోబా పూజ ఇత్యాది కార్యక్రమాల నిర్వహణ బాధ్యత మేస్రం కులస్థులకు అప్పగించారు. కాగా పెద్దవాడన్న గౌరవంతో పుష్యమాసం అమావాస్య రోజు జరిగే పూజను మడావికి అప్పగించారు. అయితే కాలానుగుణంగా పూజా కార్యక్రమాలు నిర్వహించే మేస్రం వంశం రెండుగా చీలిపోయింది. వాటిలో ఒకటి నాగ్‌బిడే మేస్రం, రెండవది భూయ్యాడే మేస్రం ఈ రెండు శాఖల వారి వృత్తుల ఆధారంగా 17 శాఖలుగా చీలిపోయారు. అయినా పూజలు నిర్వహించేది మాత్రం అనాదిగా వస్తున్న ఆచారం ప్రకారం మేస్రం వంశస్థులకే దక్కింది.

పండుగ చేసుకునే పద్ధతి

కేస్లాపూర్ జాతరకు 16 రోజుల ముందు పుష్యమాస పౌర్ణమికి ఒక రోజు ముందు తమ కులదైవాన్ని పుష్య అమావాస్య రోజున అభిషేకించడానికి పవిత్ర గోదావరి జలం తేవడానికి కాలినడకన బయలుదేరి వెళతారు. ఇదే వంశంలోని మిగితా శాఖల వారు వారి వెంట వెళతారు. మిగితా ఏడు శాఖల వారు క్రమం తప్పకుండా వెళ్లాలన్నది నియమం. పై ఏడు శాఖలు ముందుగా నాగోబా ఆలయం చేరుకుని కలశం తీసుకుని గోదావరి నదికి బయలుదేరుతారు. వారికి ముందుగా పరదాన తెగ, వాయిద్యం వాయిస్తూ ఉంటే వెనక నుంచి గిరిజనులు వెళుతుంటారు. కేస్లాపూర్‌కు సుమారు వంద కిలో మీటర్ల దూరంలో ఉన్న కలమడుగు మండలం సమీపాన ఉన్న గోదావరి నదిలో అస్తమడుగు వరకు అరణ్యం గుండా నడిచి వెళ్లి గోదావరి జలం కలశంతో తీసుకుంటారు. ఈ అస్తమడుగులో గిరిజనుల పూర్వులు స్నానం చేస్తుండగా నాగదేవత ప్రత్యక్షమై దర్శనమిచ్చాడనే నమ్మకంతో అక్కడి జలాన్ని పవిత్ర జలంగా గిరిజనులు భావిస్తుంటారు.

ఇక పుష్యమాసంలో వచ్చే పౌర్ణమినాడు మేస్రం వంశీయులు 20 మంది గిరిజనులు వెంటరాగా కొత్త కుండలతో కడెం మండలంలోని గోడిసిర్యాల పరిసర ప్రాంతాల్లో ప్రవహిస్తున్న గోదావరి జలాన్ని తీసుకువచ్చేందుకు బయలుదేరుతారు. దీంతో జాతర ప్రారంభమైనట్టే. ఆ జలాన్ని తీసుకురావడానికి కేస్లాపూర్ నుంచి గోదావరి దాకా కాలినడకన 80 కిలోమీటర్లు వెళ్తారు. కేస్లాపూర్ చేరుకొని జాతర ప్రాంగణంలోని గిరిజనులు చెప్పుకునే ప్రాశస్త్యం గల మర్రి చెట్టు కింద విడిది చేసి అమావాస్య రోజు రాత్రి నాగోబాకు కొత్త కుండల్లో గోదావరి నుంచి తెచ్చిన నీళ్లతో అభిషేకం చేస్తారు. తరువాత క్షీరాభిషేకం చేసి గిరిజన ఆచారాల మేరకు పూజలు నిర్వహిస్తారు. 3 సంవత్సరాలకోసారి పూజారిని మార్చడం ఆనవాయితీ.

గంగా జలాన్ని తీసుకురావడమే కాకుండా, వంట చేసి జాతరలో భక్తులకు భోజనం పెడతారు.

ఇక జలంతో నిండిన కలశాన్ని 'పూసిగూడ' గ్రామానికి లేదా ప్రధాన పూజారి ఉండే నార్నూర్ మండలం గురిజాల గ్రామానికి తెచ్చి అక్కడ ఒక్క రోజు ఉన్న తరువాత కలశం అదే గ్రామంలో ఉంచి గిరిజనులంతా తమ ఇళ్లకు తరలి ఒక దినమంతా పండుగ జరిపి తిరిగి కలశం ఉన్న స్థలానికి చేరుకుంటారు. ఇక్కడి నుంచి బయలుదేరి కేస్లాపూర్‌కు ఎనిమిది కిలో మీటర్ల దూరంలోని ఇంద్రవెల్లిలో ఆగి అక్కడ వెలిసిన ఇంద్రాదేవికి సామూహికంగా పూజలు జరుపుతారు. ఇంద్రాదేవి వెలిసిన నాటి నుంచి ఈ గ్రామానికి ఇంద్రవెల్లి పేరు వచ్చింది. సరిగ్గా పుష్య అమావాస్య రోజున కలశం భద్రపరిచిన మర్రిచెట్టు దగ్గర బావినీరు మట్టి కలిపి ఒక పుట్టను తయారుచేసి ఆలయం పక్కన ఉన్న పూల మందిరాన్ని ఆ మట్టితో అలికి అమావాస్య అర్ధరాత్రి కలశంలో



22 పొయ్యిలు మాత్రమే పెడతారు

జాతరకు వచ్చే మేస్రం వంశీయులు వేలాది మంది ఉన్నా వారు వంట చేసుకునేది మాత్రం 22 పొయ్యిల మీదే. ఈ పొయ్యిలు ఎక్కడపడితే అక్కడ పెట్టడానికి వీల్లేదు. ఆలయ ప్రాంగణంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ప్రహరీ గోడ లోపల, గోడకు చుట్టూ దీపాలు వెలిగించేందుకు ప్రత్యేక అరలు (దుగుడు) ఉన్నాయి. ఆ దీపాల కాంతుల వెలుగులో 22 పొయ్యిల్లో మెస్రం వంశీయులు వంతుల వారీగా వంటలు చేసుకుంటారు. మిగితా జాతుల వారు ఎక్కడైనా వంట చేసుకోవచ్చు. ఇదిలా ఉంటే సిరికొండ మండలంలోని గుగ్గిల్ల వంశీయులు మాత్రమే నాగోబా కోసం కుండలు తయారు చేయడం ఆచారంగా వస్తోంది. గుగ్గిల్ల వంశీయులకు మేస్రం వంశీయుల మధ్య తరతరాలుగా సంబంధాలు కొనసాగుతున్నాయి. పుష్యమాసంలో నెలవంక కనిపించిన తరువాత మేస్రం వంశీయులు ఎడ్ల బండ్లలో సిరికొండకు వస్తారు. అక్కడి గుగ్గిల్ల వంశస్థుడైన కుమ్మరి ఇంటికి చేరుకొని కుండలు తయారు చేయాలని కోరుతారు. వంటల కోసం రెండు పెద్ద కుండలు (కాగులు), వాటిపై కప్పిపెట్టేందుకు పాత్రలు (చిప్పలు), దీప ప్రమిదలు, నీటి కుండలు కలిపి సుమారు 130కి పైగా కుండల తయారీకి ఆర్డర్ ఇస్తారు. మేస్రం వంశీయులు ఈ కుండల్లోనే ఉన్న జలంతో ఆలయంలో ఉన్న నాగదేవతను అభిషేకిస్తారు. గోదావరి నదినుంచి తీసుకొచ్చిన జలంతో నాగోబా విగ్రహాన్ని శుభ్రపరుస్తారు. ఆలయాన్నంతా శుద్ధి చేస్తారు.

వధూవరుల పరిచయ వేదిక

మేస్రం వంశస్థుల్లో వివాహమైన నూతన వధువులను తప్పక కేస్లాపూర్‌లో నాగోబా దేవుని వద్దకు తీసుకెళతారు. ఆమె చేత ఆ దేవునికి పూజ చేయించి వధువులను పరిచయం చేస్తారు. దీన్నే బేటింగ్ కియ్‌వల్ అంటారు. ఎప్పటి వరకైతే మేస్రం తెగ వధువు ఈ పరిచయ వేదికలో పాల్గొనదో అప్పటిదాకా వారు నాగోబా దేవుడిని చూడడం, పూజించడం నిషిద్ధం. వధువులు ఇంటి నుంచి ఎడ్ల బండి వెనుక వెదురు బుట్టలో పూజాసామాగ్రిని పట్టుకొని కాలి నడకన బయలుదేరతారు. కేస్లాపూర్‌లోని నాగోబా గుడిని చేరుకుంటారు. పరిచయం చేయాల్సిన వధువులను 'భేటి కొరియాడ్' అని పిలుస్తారు. వధువులు ఇద్దరు చొప్పున జతలుగా ఏర్పడి ముఖం నిండా తెల్లటి దుస్తులతో ముసుగు ధరిస్తారు. పూజా కార్యక్రమానికి ముందు నాగోబా దేవుని దగ్గరకు వారిని తీసుకెళ్లి పరిచయం చేస్తారు. అక్కడి నుండి శ్యాంపూర్‌లోని (బుడుందేవ్) జాతర అయ్యాక ఎవరి గృహాలకు వాళ్లు వెళతారు.

తెలుగుభాషకు కెసిఆర్ పట్టం



ఇలపావులూరి మురళీమోహన రావు
8143318849


మూడేళ్ళ క్రితం అనుకుంటాను... మహా సహస్రావధాని గరికపాటి నరసింహారావు ఒక ఇంటర్వ్యూలో కొన్ని ఆసక్తికరమైన సంగతులను ప్రస్తావించారు. తెలుగు, ఆంధ్రము ఒకటేనా? వేరువేరా? స్థూలంగా చూస్తే రెండూ ఒకటిగానే కనిపిస్తాయి. కానీ, ఆంధ్రులు మాట్లాడేది ఆంధ్రము, తెలంగాణాలో మాట్లాడేది తెలుగు అని వారు చెప్పినట్లు గుర్తు. ఆంధ్రులు తొలి నుంచి బ్రిటిష్ వారి ప్రభావానికి గురై ఆంగ్ల భాషకు ప్రాధాన్యత ఇచ్చి ఆంగ్లభాషను నేర్చుకుని, ఆంగ్లంలో చదువుకుని, విదేశాలు వెళ్లి అక్కడ స్థిరపడి తమ మాతృభాషను నిర్లక్ష్యం చెయ్యగా, తెలంగాణలో మాత్రం తమ మాతృభాషను, సంస్కృతిని, నుడికారాలు, జాతీయాలను పదిలంగా కాపాడుకుంటూ వస్తున్నారని, తెలంగాణాలో మాట్లాడేది మాత్రమే అచ్చమైన తెలుగుభాష అని ఆయన వివరించారు. 'పిల్ల పోయినా పురిటి కంపు పోలేదు' అన్నట్లు ఆంగ్లేయులు మన దేశం విడిచి పెట్టి వెళ్ళిపోయి డెబ్బై ఏళ్ళు గడిచినా, మనకు మాత్రం ఇంకా ఆంగ్ల భావ దాస్యం మాత్రం చావలేదు. కార్పొరేట్ విద్యా సంస్కృతి పుణ్యమా అని గత ముప్పయి ఏళ్లుగా ఆంగ్ల మాధ్యమంలో విద్యాబోధన ఊడలు దిగి విస్తరించింది. ప్రయివేట్ కాలేజీలు పుట్టగొడుగుల్లా మొలుచుకుని వచ్చాయి. మాతృభాషలో విద్యాబోధన చేసే ప్రభుత్వ విద్యాసంస్థలకు క్రమేపీ ఆదరణ తగ్గుతూ వచ్చింది. ప్రజలలో వ్యాపించిన బలహీనతలను ప్రయివేట్ విద్యాసంస్థలు సొమ్ము చేసుకుంటూ నర్సరీకి కూడా ఏడాదికి లక్షల్లో ఫీజులు వసూలు చేయడం మొదలు పెట్టాయి. తమ పాఠశాలలను యాభయ్, వంద ఎకరాల సువిశాల ప్రాంగణాలలో, ఎసి చెయ్యబడిన తరగతి గదులు, ఐరావతాల లాంటి బస్సులు, ఫైవ్ స్టార్ భోజన వసతులు ఏర్పాటు చేసి తల్లితండ్రులను ఆకట్టుకుంటూ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయి. ఈ పాఠశాలల్లో ఆంగ్లం తప్ప తెలుగు భాషను పొరపాటున కూడా ఉచ్చరించడం పెద్ద నేరంగా భావిస్తారు. కొన్ని పాఠశాలలైతే, విద్యార్థుల తల్లితండ్రులు కూడా ఆంగ్లం కచ్చితంగా నేర్చుకుని ఉండాలని, ఇంట్లో కూడా పిల్లలతో ఆంగ్లంలో మాత్రమే మాట్లాడాలని షరతులు విధిస్తాయి. మూడేళ్లు కూడా నిండని తమ పసిపిల్లలు ముద్దు ముద్దుగా ఎబిసిడిలు పలుకుతుంటే తల్లితండ్రులు మురిసిపోతుంటారు. దురదృష్టం ఏమిటంటే, ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయులు కూడా తమ పిల్లలను లక్షల రూపాయలు డొనేషన్లు, ఫీజులు చెల్లిస్తూ కార్పొరేట్ స్కూల్స్‌లో చేర్పిస్తుంటే, ఇక సామాన్యులకు ప్రభుత్వ పాఠశాలల మీద గౌరవం ఎక్కడుంటుంది?

ఈ పరిస్థితుల్లో 2014 లో తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత తొలి ముఖ్యమంత్రి అయినా కల్వకుంట్ల చంద్రశేఖర రావు తెలుగు భాషకు మళ్ళీ పునర్వైభవాన్ని తీసుకుని రావాలని సంకల్పించారు. దయనీయస్థితిలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలకు నిధులను మంజూరు చేసి వాటిని కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా తీర్చిదిద్దాలని ప్రయత్నాలు మొదలు పెట్టారు. ప్రభుత్వరంగంలో వందలాది గురుకుల పాఠశాలలను ఏర్పాటు చేశారు. అంతే కాకుండా టెన్త్ క్లాస్ వరకు తెలుగు మాధ్యమాన్ని కూడా నిక్కచ్చిగా అమలు పరచాలని ఆదేశించారు. ప్రభుత్వం తీసుకున్న దిద్దుబాటు చర్యల మూలంగా గత నాలుగేళ్లలో ప్రభుత్వ పాఠశాలలు విద్యాబోధనలో, ఫలితాలను సాధించడంలో గణనీయమైన పురోగతిని సాధించాయి. తెలుగు భాషాభివృద్ధికి మరింత దోహదం చేసే విధంగా 2017 సంవత్సరంలో ప్రపంచ తెలుగు మహాసభలను నిర్వహించింది కేసీఆర్ ప్రభుత్వం. ఐదురోజుల పాటు అట్టహాసంగా జరిగిన ఆ సభల్లో తెలుగు భాషా పునర్వికాసానికి మరింతగా కృషి చెయ్యాలని తీర్మానించారు. అలాగే తెలుగు సాహిత్యాన్ని వెలుగులోకి తీసుకొచ్చి కవులకు, రచయితలకు మరింత గుర్తింపు కలిగించడమే కాకుండా, ప్రభుత్వ దైనందిన కార్యకలాపాలలో కూడా మాతృభాషకు ప్రాధాన్యత ఇవ్వాలని నిర్ణయించారు.



ఆ చర్యలకు కొనసాగింపుగా ఆంగ్లభాషలోప్రచురించబడి, సామాన్యులకు ఏమాత్రం కొరుకుడుపడని చట్టాలను తెలుగు భాషలో అనువదించాలని, ప్రజలందరికీ అర్థం అయ్యేలా చట్టాలు రూపొందాలని తాజాగా ముఖ్యమంత్రి కెసిఆర్ అధికారులను ఆదేశించారు. అలాగే శాసనసభ సభ్యులకు తెలుగులోనే ప్రవర్తనా నియమావళిని అందుబాటులోకి తీసుకుని రావాలని, ప్రజలు మాట్లాడే భాషలోనే పరిపాలన కొనసాగాలని, ఉన్నతాధికారులు కూడా తెలుగులోనే మాట్లాడాలని కెసిఆర్ ఆదేశాలు జరీ చెయ్యడం ముదావహం. అలాగే ఉత్తర ప్రత్యుత్తరాలు, జిఓలు కూడా తెలుగు భాషలోనే ఉండాలని ముఖ్యమంత్రి ఆదేశించడంతో అధికారులలో కొంత కదలిక వచ్చింది. మన ప్రభుత్వ కార్యాలయాలలో అధికారులు ఆంగ్లం మాట్లాడటానికే ప్రాధాన్యత ఇవ్వడం ఈనాటికీ కనిపిస్తుంది. ఇంగ్లీష్‌లో మాట్లాడితే ఎదుటివాడు భయపడతాడు అనే ఒక నమ్మకం ఇంకా మన నరాల్లో సజీవంగా ఉన్నది. సామాన్య పేదలు అధికారులు మాట్లాడే భాష అర్థం కాక, ఆ విషయాన్ని వారికి చెప్పుకోలేక మథనపడుతుంటారు. అలాగే ప్రభుత్వం ఇచ్చే జిఓల్లో భాష తెలుగులో ఉన్నప్పటికీ, అది చదువుకున్నవారికి కూడా అర్థం కాదు. అంత జటిలంగా ఉంటుంది ఆ భాష. అక్షరాలు తెలుగులో ఉన్నప్పటికీ అర్థం చేసుకోలేని దుస్థితి. ఈ సమస్య నుంచి విముక్తి పొందాలంటే రాష్ట్రంలోని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నుంచి చిన్న ఉద్యోగి కూడా విధిగా తెలుగులోనే మాట్లాడటం,సాధారణ ప్రజలకు అర్థమయ్యే వాడుక భాషలో మన చట్టాలను, ప్రభుత్వ కార్యకలాపాలను రూపొందించడం ఆవశ్యకం. అంతే కాదు, ఆంగ్లంలో మాట్లాడే అధికారులకు జరిమానాలు కూడా విధిస్తే సత్వర ఫలితాలు ఒనగూరుతాయి. తెలుగుకు పట్టాభిషేకం చేస్తున్న ముఖ్యమంత్రి కెసిఆర్‌కు ధన్యవాదాలు, అభినందనలు.

సకుటుంబం



ఒక అధ్యయనం ప్రకారం భారతదేశంలో ఇంటి పనుల్లో భార్యలకు సాయం చేసే మగవాళ్లు 20 శాతం కంటే తక్కువ. ఆఫీస్ పని తప్ప ఇంటి పని తమది కాదనే ఆలోచనతోనే పురుషులు పెరుగుతారు. ఇది సంప్రదాయబద్ధమైన ఆలోచనగా కనిపించినా వాస్తవం ఇదే. బహుళ పాత్రల్ని పోషించవలసింది స్త్రీ మాత్రమే. భార్యగా, తల్లిగా, ఉద్యోగినిగా, వంట ఇంటి పనులు, క్లీనింగ్, ఇంటీరియల్ డెకరేటర్, సాధారణ మెయింటెనెన్స్ వర్కర్ ఇలా ఆమెది బహురూపాల నాటకం...

ఇంటి పని ఇద్దరిదీ!

ఇన్ని పనులలో ఆమె శాంతిగా, సంతోషంగా, ఆరోగ్యంగా, తృప్తిగా ఉంటోందా? నూటికి 70 శాతం మంది తాము భర్తల కంటే ఎక్కువ పనిచేస్తున్నట్లే చెబుతున్నారు స్త్రీలు. కుటుంబ రధసారధులు ఇద్దరూ ఒకేరకమైన జీవిత విధానంలో ఎందుకు లేరు? అంటే సమాజం నిర్దేశించిన పాత సూత్రాలు మాత్రమే. తానింత కష్టపడుతున్నా ఆ పని వంక కన్నెత్తి చూడకుండా విశ్రాంతిగా ఉండే భర్త పైన భార్యకు కోపం రావటం సహజమే. కానీ అలా కోపాన్ని బయటపెట్టుకొని ఇల్లు రణరంగంలా మార్చేసుకోవద్దు అంటున్నారు ఫ్యామిలీ కౌన్సెలర్స్. కమ్యూనికేషన్ గ్యాప్ వల్లనే ఎన్నో సమస్యలు వస్తాయంటున్నారు.

ముందుగా భార్యాభర్తలు ఇద్దరి మధ్యను మాటల వంతెన అవసరం. భార్య తప్పని సరిగా తాను నెట్టుకొస్తున్న బరువు బాధ్యతల గురించి భర్తతో చర్చించాలి. నేనేందుకు చెప్పటం, అతనే గ్రహించాలి అనుకోవటం దగ్గరే అసలు యుద్ధం ప్రారంభం. అదీ ఇంటి పనీ, పిల్లల సంరక్షణ, బజారు పనీ, ఏదైనా కానీ భర్త దాన్ని ఎలా షేర్ చేసుకుంటే తనకు సంతోషంగా ఉంటుందో భార్య మాట్లాడొచ్చు. నేను సాయం చేయనా అని భర్త అడగాలని ఎదురుచూస్తూ కోపంతో రగిలిపోయినా లాభం ఏముందీ! కుటుంబానికి సంబంధించిన ఒక నోట్ బుక్ ఇద్దరి ఎదుట ఉంది అనుకోవాలి. ఆ డైరీ ఇద్దరి మనసుల ప్రపంచం. ఇందులో ఇద్దరి గొంతులు వినబడాలి.

ఒక అధ్యయనం ప్రకారం స్త్రీలు ఒకే సమయంలో బహుళమైన పనులు చేయగలిగే సామర్థ్యంతో ఉంటారనీ, కానీ పురుషులు ఒక సమయంలో ఒకే పని మాత్రమే చేయగలరని చెబుతోంది. దానికి అధ్యయన కారులు ఇచ్చిన విశ్లేషణ కాసేపు అవతల పెట్టి, పురుషులు ఒక్క పని సమర్థవంతంగా చేయగలరు అని తీసుకొంటే ఇప్పుడు వాద ప్రతివాదాలు పక్కన పెట్టి , భర్త ముందు తనపై ఉన్న బరువు భారాన్ని పరిచి అతను ఏ పనులు ఎంచుకోగలడో అడగవచ్చు. శాంతిగా కుటుంబంలో సంతోషంగా జీవించాలంటే అలాంటి ఒప్పందాలు అవసరం కూడా.

స్నేహంగా అంతకంటే కచ్చితంగా స్పష్టంగా ఈ విషయం తేల్చుకోవాలి. అన్ని నేనే చేస్తా సాయం చేయటం లేదు అన్న స్టేట్‌మెంట్ ఇళ్లల్లో వర్కవుట్ కాదు. స్నేహంగా సరదాగా పనులు పంచుకోవాలన్న తత్వం ఉంటే ఈ ఒప్పందాల ప్రశ్నేరాదు కదా! ముందుగా ఒక జాబితా తయారుకావాలి. ఆ జాబితాలో పనులు ఇద్దరూ కలిసి ఎంచుకోవాలి. పని ఎవరు నైపుణ్యంతో చేయగలరు? దీని వల్ల ఇద్దరి మధ్య సహకార ధోరణి వస్తుంది.

> **ఇక జీవితంలో అలవాటు చేసుకొన్న పర్‌ఫెక్ట్ అన్న పదానికి ఉద్వాసన చెప్పకపోతే ఇంటిపనుల్లో భాగస్వామ్యం దొరకదు. చాలా మందికి ప్రతి పనీ గీసినట్టు పర్‌ఫెక్ట్‌గా ఉండాలి. ఆ చాదస్తంతో అవతల వాళ్లు ఏం చేసినా వంకలు పెడుతూ పోతే అవతల వాళ్లకి అవకాశం ఇచ్చినట్లే .**

ఈ రోజుల్లో ఇద్దరూ చదువుకొంటున్నారు. హాస్టల్స్‌లో ఉంటున్నారు. హోటల్ భోజనం చేస్తున్నారు. భార్యా భర్తలుగా ఒక కప్పు కింద కాపురం మొదలు పెట్టాక ఇద్దరూ, తాము ఇద్దరికీ చాలా కొత్తగా అనిపించే ఇంటి పనులన్నీ నేర్చుకొని చేయటం మొదలుపెట్టాలి. ఇలా నేర్చుకొనే క్రమంలో సాధారణంగా ఆడపిల్లలు తల్లి దగ్గర నుంచి చూసిన ఇంటి పనులు తేలిగ్గా భుజాలకెత్తుకొంటారు. అలా తీసుకోలేని అబ్బాయిలు కాస్త వెనకబడతారు . కానీ పూర్తిగా చేయలేని వారు కాదు! ఇంటి పని విభజించి చేసుకుంటూ పోతే, నెమ్మదిగా వాళ్లద్దరికే పరిమితంగా ఉన్న ఆ ఇంట్లో అన్ని అలవాటు అయిపోతాయి.

ఇక జీవితంలో అలవాటు చేసుకొన్న పర్‌ఫెక్ట్ అన్న పదానికి ఉద్వాసన చెప్పకపోతే ఇంటిపనుల్లో భాగస్వామ్యం దొరకదు. చాలా మందికి ప్రతి పనీ గీసినట్టు పర్‌ఫెక్ట్‌గా ఉండాలి. ఆ చాదస్తంతో అవతల వాళ్లు ఏం చేసినా వంకలు పెడుతూ పోతే అవతల వాళ్లకి అవకాశం ఇచ్చినట్లే . నాకు సరిగ్గా రాదు, నేను నీలాగా చేయలేను అనే సాకుతో మొత్తం పనులు ఎగ్గొట్టడం కష్టమైన పని కాదు. అలాగే అమ్మాయిలు ఇల్లాలుగా రూపాంతరం చెందాక, భర్తగారి తల్లిలాగా వంటపని, ఇంటిపనిలో నూరు మార్కులు తెచ్చుకొనే లాగా ఉండరు. ఆమె కూడా నేర్చుకొనే ప్రాసెస్‌లోనే ఉంటుంది.

ప్రతి క్షణం ఆమెను తమ తల్లులు, తోబుట్టువులతో పోల్చి హింసిస్తే ఇక ఆ ఇంట్లో కురుక్షేత్రానికి తెరతీసినట్టే. భార్యాభర్తలు ఇద్దరూ ఆ కుటుంబానికి మూలస్తంభాలు . ఒకళ్లనొకళ్లు సంతోషపెట్టుకోవడం వాళ్ల బాధ్యత. అర్థం చేసుకొని మెలగడం కర్తవ్యం. ఆ ఇంట్లో తమ చేతుల మధ్యన తమ కలల పంటలో పుట్టి పెరగాలని, ఆ ఇంట్లో శాంతిగా, నవ్వుల పాలవెల్లిగా ఉండాలని భార్య భర్తలు తెలుసుకొంటే ఆ ఇంట్లో సమస్యలే రావు.

-అరుణ చేబ్రోలు

నెల తప్పిన అమ్మాయికి సాయంగా ఓ యాప్



సాంకేతిక పరిజ్ఞానం వృద్ధి అయ్యే కొద్దీ, మనుషులకుసాటి మనుషులతో అవసరాలు తీరి పోతున్నాయి. ఇందుకు విచారించాలా? ఆనందించాలా? అనేది వేరే సంగతి. పెద్దవాళ్లు దగ్గరలేని గృహిణి తొలిసారిగా తల్లి అయినప్పుడు ఆమెకు అనేక సందేహాలు ఉంటాయి. అలాంటివారికోసం వచ్చిందే im pregnant అనే యాప్. గూగుల్ ప్లే స్టోర్ నుంచి యాప్‌లో స్టోర్ నుంచి దీన్ని ఉచితంగా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ప్రెగ్నెన్సీ కన్‌ఫర్మ్ అయ్యాక ఈ యాప్‌లో గర్భిణీ వివరాలు నమోదు చేస్తే చాలు. ఇక నెలలు నిండే దాకా ఈ యాప్‌దే బాధ్యత. డాక్టర్ చెప్పిన డెలివరీ తేదీ, ప్రతినెలా బరువు, బి.పి వివరాలు అప్లికేషన్‌లో వివరంగా ఇప్పుడు వాటి ఆధారంగా గర్భిణీ ఆరోగ్యంగా ఎలా ఉందో ఈ యాప్ చెప్పేస్తుంది.

ఏ నెలలో ఎలాంటి ఆహారం తీసుకోవాలి? ఎలాంటి వ్యాయామాలు చేయాలి? ఎలాంటి పుస్తకాలు చదవాలో, పుట్టబోయే పిల్లల పేర్లు వాటి అర్థాలు కూడా ఈ యాప్‌లో ఉన్నాయి. అమ్మలు, నాన్నలకు దూరంగా గర్భిణులుగా ఉన్న అమ్మాయిలకు, వాళ్ళు లేని లోటు తీర్చేట్లుగా ఉందీ యాప్.

అలల్లాంటి అందమైన జుట్టుకీ వైద్యం



అందమైన మొహానికి అలల్లాంటి జుట్టే అందం. అడ్వర్‌టైజ్‌మెంట్స్‌లో చెప్పినట్లు కొత్తగా జుట్టయితే మొలుచుకుంటూ రాదు గానీ, పుట్టుకతో వచ్చిన జుట్టుని మాత్రం మనం శ్రద్ధగా కాపాడుకుంటే వూడిపోకుండా వుంటుంది. ఆరోగ్యంగా మెరుపులీనుతూ ఉంటుంది. ముందు ముందే తెల్లబడిపోకుండా ఉంటుంది. జుట్టుకి సరైన పోషకాలు అందాలంటే షాంపూలు పనికిరావు. కోడి గుడ్డు పచ్చసొన జుట్టుకు పట్టిస్తే మాయిశ్చర్‌గా పనిచేస్తుంది. ఓ గంట సేపు ఆరనిచ్చి తలస్నానం చేయాలి. జుట్టు మెత్తగా, సాఫీగా ఉంటుంది. ఆల్మండ్ ఆయిల్‌లో ఉండే ఇ- విటమిన్ జుట్టుకు మెరుపును మృదుత్వాన్నీ ఇస్తుంది. అలాగే పుల్లల్లాగా వేలాడే మునగలో రుచి ఉంటుందా? ఆరోగ్య ప్రయోజనాలు ఏముంటాయి అనుకొంటాం కదా! ఇది యాంటీ డిప్రెసెంట్. ముడతలు వయసురీత్యా పడే గీతలు తగ్గిస్తుంది. ముఖ్యంగా శిరోజాల ఎదుగుదలకు సహకరిస్తుంది. ఇంట్లో చేయగలిగే ఆరోగ్య పద్ధతులతో పాటు ప్రకృతి ఇచ్చే కొబ్బరి, కొబ్బరిపాలు, మునక్కాడలు ఇవన్నీ శిరోజాల రక్షణకు ఉపయోగపడేవే.

ఎంత పనిలో ఉన్నా తాగండి..!



పని ఒత్తిడిలో మంచినీళ్లు తాగే తీరిక కూడా లేదంటుంటారు కొంతమంది. కానీ శరీరానికి నీరు అందకపోతే చాలా సమస్యలు తలెత్తుతాయి. నీటిని తాగకపోతే ఏం జరుగుతుందో తెలుసుకుందాం..

డీహైడ్రేషన్ కలుగుతుంది. మలబద్ధకం ఏర్పడి సతమతం చేస్తుంది.
* తలనొప్పి, అలసట, ఆందోళన, తలతిరగడం వంటి సమస్యలు తలెత్తే అవకాశం ఉంది.
* మూత్రవిసర్జన తగ్గుతుంది. ఒక్కోసారి ఆగిపోనూవచ్చు. కండరాలనొప్పులు, బలహీనత, కాళ్లు చేతులు చల్లబడటం వంటివి జరుగుతాయి.
* చర్మం పొడిబారుతుంది. కాంతి విహీనంగా మారుతుంది. నోరు పొడిబారుతుంది. అజీర్ణం వల్ల అనేక జీర్ణ సంబంధిత సమస్యలు కలుగుతాయి.
* మూత్రవిసర్జన సమయంలో మంట, నొప్పి కలుగుతాయి. మూత్రవిసర్జన సక్రమంగా జరగకపోవడం వల్ల రక్తం మలినాలతో నిండిపోతుంది. శరీరంలోని విషపదార్థాలు విసర్జింపబడక శరీరంలోనే పేరుకుపోతాయి.
* వయసు పెరిగేకొద్దీ దాహం తగ్గుతుంది. అలా అని నీరు తాగాలని లేకపోయినా నీటిని తప్పనిసరిగా తీసుకోవాలి. రోజుకు కనీసం 3 లీటర్ల నీటిని తగ్గకుండా తాగాలి.
* అధిక రక్తపోటు, ఆస్తమా, విపరీతమైన వంటి నొప్పులకు మూలకారణం నీటి సరఫరా తగినంత లేకపోవడమేనని వైద్యులు చెప్తున్నారు.

చిట్కాలు

* **చింతపండు రంగు మారకుండా ఎక్కువ రోజులు తాజాగా ఉండాలంటే కాస్త ఉప్పు చల్లి గాలివెళ్లని డబ్బాలో ఉంచండి.**
* **ఎండు ఉసిరి ఒక కప్పు, రెండు కప్పుల పెరుగు తీసుకుని ఒక ఇనుప గిన్నెలో రాత్రంతా నానబెట్టాలి. మరుసటిరోజు ఉదయం ఈ మిశ్రమాన్ని మాడుకు పట్టించాలి. ఇలా వారానికి ఒక సారి క్రమం తప్పకుండా చేస్తే తెల్లజుట్టు నల్లబడుతుంది.**



నకిలీ నోటుపై వేటు

- పది మంది అరెస్టు... మరో ఇద్దరు పరారీ
- త్వరలో పట్టుకుంటాం: సిపి మహేష్ భగవత్

మన తెలంగాణ/మన్సూరాబాద్: నకిలీ నోట్లను చలామణీ చేస్తున్న పది మంది ముఠా సభ్యులను ఎల్బీనగర్ ఎస్ఓటి పోలీసులు అరెస్ట్ చేశారు. మంగళవారం ఎల్బీనగర్ క్యాంప్ కార్యాలయంలో రాచకొండ సిపి మహేష్ భగవత్ మీడియా సమావేశం ఏర్పాటు చేసి కేసు వివరాలను వెల్లడించారు. ఈ సంధర్భంగా నిందితుల నుంచి రూ మూప్పై ఒక లక్షల ఇరవైఐదు వేల రూపాయల నకిలీ నగదును స్వాధీనం చేసుకున్నారు. ఈ ముఠా చాలాకాలంగా నకిలీ నోట్లను చలామణీ చేస్తున్నట్లు తెలిపారు. ముఠా సభ్యులు రూ.500, 2000 నకిలీ నోట్లను కమిషనరేట్ పరిధిలో చౌటుప్పల్, ఇబ్రహీంపట్నం ,మేడిపల్లి పశువుల మార్కెట్లో నకిలీ నోట్లను చలామణీకి నడిపిస్తున్నట్లు పేర్కొన్నారు.ఆదిలాబాద్ జిల్లా చెన్నూర్ గ్రామానికి చెందిన ఇప్పనపల్లి రాజేష్ (34) ప్రైవేట్ ఉద్యోగం చేస్తు నగరంలో ఎల్బీనగర్ భైరమలగూడ డాక్టర్స్ కాలనీలో నివాసం ఉంటున్నాడు. శ్రీకాకుళం జిల్లా బాలాజీకాలనీకి చెందిన రోషన్ మహబూబ్ షేక్ (37) హోటల్ వ్యాపారం చేస్తున్నాడు. ఎలూరుకు చెందిన బోతపాటి సుకేష్ (42) మెకానిక్ గా చేస్తుంటాడు. ఎలూరు తంగళ్ళమూడి బోడేటి నగర్‌కు చెందిన ఇన్నపల్లి దుర్గాప్రసాద్ (39) గోల్డ్ స్మిత్‌గా చేస్తుంటాడు. ఓల్డ్ మలక్‌పేట్‌కు శ్రీపురం కాలనీకి చెందిన మహ్మద్ బాబా (28) మాంసం దుకాణం నడిపిస్తాడు. చంద్రయానగుట్ట హాఫీజ్‌బాబానగర్‌కు చెందిన మహ్మద్ షకీల్ (21) మాంసం దుకాణం నడిపిస్తాడు. విజయవాడకు చెందిన పోలదాసు ధరణి (38) నగరంలో కెపిహెచ్‌బి వివేకానందనగర్ కాలనీలో నివాసం ఉంటూ దంత వైద్యులు పని చేస్తున్నాడు. రాజమండ్రికి చెందిన కోప్పల శ్రీనివాస్ (38) ట్రావెల్స్ వ్యాపారం చేస్తుంటాడు. రాజమండ్రి రావులపాలెంకు చెందిన ఇన్నపల్లి శ్రీనివాస్ చంద్రశేఖర్ (38) స్థిరాస్తి వ్యాపారం చేస్తుంటాడు. మీర్‌పేట్ కు చెందిన మహ్మద్ ఇస్మాయిల్ (38) ఆటో నడిపిస్తాడు. పది మంది ముఠా సభ్యులుగా ఏర్పడి నకిలీ నోట్లను చలామణీ చేసి పశువుల సంతలో మార్పిడి చేస్తున్నారు. విజయనగరంకు చెందిన రాజశేఖర్, సురేష్,నాయుడులు పరారీలో ఉన్నారు, వారిని త్వరలో పట్టుకుంటామని సిపి తెలిపారు. ఇప్పనపల్లి రాజేష్‌కు గతంలో నేర చరిత్ర కలదని, 2013లో నకిలీ విద్యా సర్టిఫికెట్లు తయారు చేసి అరెస్ట్‌య్యాడు.

నకిలీ నోట్‌కు ఒరిజనల్ నోట్లుకు తేడా

తెల్ల పేపర్‌పై ఒరిజనల్‌నోట్ పెట్టి పెన్సిల్‌తో రుద్దడంతో తెల్లపేపర్‌పై గాంధీ బొమ్మ ,నోట్ విలువ, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బిఐ) కనిపిస్తుందని, మ్యాక్‌బెల్ నోట్ తెల్లపేపర్ పై రుద్దడంతో ఏమీ కనిపించదని తెలిపారు. అసలు, నకిలీ నోటు సైజు తేడా ఉంటుందని ప్రజలు గమనించాలని తెలిపారు. ప్రజలు నకిలీ నోట్ చేతులు పట్టుకోగానే వెంటనే తేడా ఉంటుందని ,నకిలీ ,అసలు నోట్ చేతులో నలిపితే తేడా ఉంటుందని అవి గమనించాలని పేర్కొన్నారు. ఎక్కడైన తేడా కనిపించినచో బాంక్ క్యాషియర్‌కు చూపిస్తే వెంటనే అసలు విషయం బయట పడుతుందన్నారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని తెలిపారు.

మహీంద్ర కారు, ప్రింటర్లు స్వాధీనం : నిందితుల నుంచి మహీంద్ర టియువి కారు నెంబర్ (ఎపి 03బివి3068) వాహనం ,హెచ్‌పి కలర్ ప్రింటర్, స్కానర్, స్క్రీన్ ప్రింటింగ్ మెటీరియల్ ,గ్రీన్ కలర్ పేపర్ రోల్, కట్టర్, మొబైల్ పోన్లు స్వాధీనం చేసుకొని, నిందితులను రిమాండుకు తరలించారు. ఎల్బీనగర్ డిసిపి సన్‌ప్రీత్ సింగ్,ఎల్బీనగర్ ఎసిపి ప్రధ్వీధర్ రావు, ఎల్బీనగర్ ఎస్‌హెచ్ ఓ అశోక్‌రెడ్డి, ఎల్బీనగర్ ఎస్ఒటి సిఐ రవికుమార్, ఎస్ఐ రాజులకు, పోలీసులకు సిపి క్యాష్ రివార్డు అందించారు.

11, 12 తేదీల్లో విఐపి బ్రేక్ దర్శనాలు

మన తెలంగాణ/తిరుమల ప్రతినిధి: తిరుమల శ్రీవారి ఆలయంలో ఈ నెల 12న రథసప్తమి పర్వదినం సందర్భంగా సామాన్య భక్తుల సౌకర్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఫిబ్రవరి 11,12 తేదీల్లో విఐపి బ్రేక్ దర్శనాలను ప్రోటోకాల్ ప్రముఖులకు మాత్రమే టిటిడి పరిమితం చేసింది.ఆదేవిధంగా, ఫిబ్రవరి 12న చంటిపిల్లల తల్లిదండ్రులకు, వయోవృద్ధులు, దివ్యాంగులకు, దాతలకు సుపథం మార్గంలో కల్పించే ప్రత్యేక దర్శనాలను టిటిడి రద్దు చేసింది. కాగా, 12న రథసప్తమినాడు శ్రీవారి ఆలయంలో నిర్వహించే ఆర్జిత సేవలైన అష్టదళపాదపద్మారాధన, కల్యాణోత్సవం, ఆర్జిత బ్రహ్మోత్సవం, ఊంజల్‌సేవ, వసంతోత్సవం, సహస్రదీపాలంకార సేవలను టిటిడి రద్దు చేసింది. సుప్రభాతం, తోమాల, అర్చన ఏకాంతంగా నిర్వహిస్తారు.

ఎస్‌ఎలుగా భాషాపండితులు, పిఇటిలు

(మొదటిపేజీ తరువాయి)

భాషా పండితుల పోస్టులను అప్‌గ్రేడ్ చేస్తామని ఇచ్చిన హామీని ఇప్పుడు నిలబెట్టుకున్నారు. ఇకపై తెలంగాణ రాష్ట్రంలో గ్రేడ్-2 పండిట్ పోస్టులు ఉండవు. ఈ నిర్ణయంతో రాష్ట్రంలోని వేలాది మంది భాషా పండితులకు మేలు జరుగుతుంది.

సిఎంకు కృతజ్ఞతలు తెలిపిన టీచర్ ఎంఎల్‌సిలు

తెలుగు పండిట్లు, పిఇటిలను స్కూల్ అసిస్టెంట్లుగా అప్‌గ్రేడ్ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు ఇవ్వడం పట్ల టీచర్ ఎంఎల్‌సిలు హర్షం వ్యక్తం చేశారు. ప్రభుత్వ చీఫ్ విప్ పాతూరి సుధాకర్‌రెడ్డి, ఎంఎల్‌సిలు పూల రవీందర్, కాటేపల్లి జనార్దన్‌రెడ్డి, ప్రముఖ కవి, రచయిత దేశపతి శ్రీనివాస్ ప్రగతిభవన్‌లో మంగళవారం సిఎం కెసిఆర్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. భాషా పండితుల చిరకాల వాంఛను సిఎం నెరవేర్చారని, విద్యారంగం చరిత్రలో ఇదొక అపూర్వ నిర్ణయంగా నిలిచిపోతుందని వారు పేర్కొన్నారు. సిఎం కెసిఆర్‌కు తెలుగు భాషపై ఉన్న ప్రేమకు ఇది నిదర్శనమని అన్నారు.

అరెస్టు వద్దు

(మొదటిపేజీ తరువాయి)

అందజేయాలని ఆదేశించింది. మధ్యేమార్గంగా రాజీవ్ కుమార్ షిల్లాంగ్‌లో సిబిఐ ఎదుట హాజరుకావాలని కూడా కోర్టు తెలిపింది. ముఖ్య కార్యదర్శి, డిజిపిల సమాధానాలు వచ్చిన తర్వాత పోలీసు అధికారుల సమక్షంలో ఆయన వ్యక్తిగతంగా ఏప్పుడు హాజరుకావాలన్న విషయమై తెలియచేస్తామని కోర్టు తెలిపింది.సిబిఐ తరుపున కోర్టులో హాజరైన అటార్నీ జనరల్ కెకె వేణుగోపాల్ పశ్చిమ బెంగాల్‌లో రాజ్యాంగ వ్యవస్థ కుప్పకూలిపోయిందని వ్యాఖ్యానించారు. శారద చిట్ ఫండ్ కేసులో దర్యాప్తునకు సహకరించవలసిందిగా రాజీవ్ కుమార్‌కు ఆదేశాలు జారీచేయాలని కోరుతూ సిబిఐ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. కోల్‌కతా పోలీసు కమిషనర్ రాజీవ్ కుమార్ ఈ కేసులో సాక్ష్యాలను నాశనం చేస్తున్నారని సిబిఐ అనుమానాలు వ్యక్తం చేసింది.2014నుంచి శారదా చిట్‌ఫండ్ కుంభకోణంలో జరిగిన పరిణామాలను సిబిఐ తరుపున హాజరైన అటార్నీ జనరల్ కెకె వేణుగోపాల్, సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతాలు కోర్టుకు వివరించారు.ఆయన దర్యాప్తుకు సహకరించడం లేదని కూడా వేణుగోపాల్ ఆరోపించారు. ఈ కుంభకోణంపై దర్యాప్తు జరిపిన రాష్ట్ర సిట్ పూర్తి కాల్‌డేటా వివరాలను ఇవ్వలేదని కూడా తెలిపారు. కాగా రాజీవ్‌కుమార్‌ను ప్రశ్నించడం కోసం సిబిఐ అధికారులు కోల్‌కతాలోని ఆయన నివాసం వద్దకు వెళ్లినప్పుడు జరిగిన పరిణామాలను కూడా ఆయన బెంచ్‌కు తెలిపారు. కాగా, రాజీవ్ కుమార్ తరుపున సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీ వాదిస్తూ, సిబిఐ అధికారులు మంచి పేరు తెచ్చుకునేందుకే ఈ చర్యకు పాల్పడ్డారని ఆరోపించారు. రాజీవ్ కుమార్‌పై ఒక్క ఎఫ్ఐఆర్ కూడా దాఖలు కాలేదని ఆయన చెప్పారు. ఇరు పక్షాల వాదనలు విన్న తర్వాత రాజీవ్ కుమార్ దర్యాప్తుకు సహకరించాల్సిందేనని బెంచ్ స్పష్టం చేసింది. అయితే ఈ కేసులో సిబిఐ అధికారులు నత్వర చర్యలకు దిగకూడదని, ఆయనను అరెస్టు చేయకూడదని స్పష్టం చేసింది.

రేషన్ కార్డు ఆధారంగా పిఎంకెఎస్ఎఫ్

వివరాలు ఇవ్వాలని పౌరసరఫరాల శాఖను కోరిన పార్థసారథి

మన తెలంగాణ/హైదరాబాద్: ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి (పిఎంకెఎస్ఎఫ్) పథకం అమలుకు కావాల్సిన సమాచార సేకరణపై రాష్ట్ర వ్యవసాయ శాఖ దృష్టి సారించింది. కుటుంబాన్ని యూనిట్‌గా తీసుకుని ఈ పథకాన్ని అమలు చేయాలని కేంద్రం తెలపడంతో రేషన్ కార్డుల వివరాలు సేకరణపై దృష్టి పెట్టింది. ఈ మేరకు వ్యవసాయ శాఖ ముఖ్య కార్యదర్శి సి. పార్థసారథి, పౌర సరఫరాల శాఖ కమిషనర్‌కు మంగళవారం కేంద్రం అధికారులు వేర్వేరు లేఖలు రాశారు. ప్రస్తుతం ప్రజా పంపిణీ వ్యవస్థలో 'ఎలక్ట్రానిక్ పిడిఎస్' విధానంలో నిక్షిప్తమై ఉన్న గణాంకాలు, వివరాలు మాత్రమే లబ్ధిదారులుగా పరిగణించే 'రైతు కుటుంబం' నిబంధనలకు కీలకంగా ఉంటుందని కేంద్రం భావిస్తోంది. భార్యా భర్తలకు విడివిడిగా వారి పేరు మీద పట్టాలు ఉన్నప్పటికీ వారు



ఒకే కుటుంబం కిందకు వస్తారు కాబట్టి పౌరసరఫరాల విభాగంలోని 'ఇపిడిఎస్'లో ఉన్న వివరాల ఆధారంగా నిర్ధారణకు రావచ్చని కేంద్రం భావిస్తోంది. అందుకే వివరాలను అందజేయాల్సిందిగా రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. రైతుబంధు మాదిరి అందరికీ కాకుండా కొన్ని పరిమితులతో పిఎంకెఎస్ఎఫ్ పథకాన్ని అమలు చేయాలని కేంద్రం నిర్ణయించింది. భార్య, భర్త, మైనర్ పిల్లలు ఉన్న కుటుంబాన్ని యూనిట్‌గా తీసుకుని గరిష్టంగా ఐదు ఎకరాల సాగుభూమి ఉన్నవారికి మాత్రమే వర్తిస్తుందని చెబుతోంది. అయితే వీటికి సంబంధించి ఇంకా పూర్తిస్థాయి మార్గదర్శకాలు రాలేదు. రైతుబంధు కింద దాదాపు 53 లక్షల మంది రైతుల వివరాలు, ఆధార్ కార్డు నెంబర్‌లు, బ్యాంకు ఖాతా నెంబర్‌లను తదితర వివరాలను వ్యవసాయ శాఖ సేకరించింది. అయితే ఇవ్వన్నీ వ్యక్తిగతంగా ఉన్నాయి. దీంతో ఆధార్ నెంబర్‌లు, రేషన్ కార్డులో కుటుంబం వారీగా ఉన్న వివరాల ఆధారంగా వర్గీకరణ చేయాలని భావిస్తున్నారు. తెలంగాణలో ఐదెకరాలలోపు ఉన్న 47.08 లక్షల మంది రైతులు ఉన్నారు. ఈ లెక్కన ఏడాదిలో రూ.2824.59 కోట్లు అందుతాయని వ్యవసాయ శాఖ అంచనా వేసింది. అయితే కేంద్రం విధించే నిబంధనలతో ఈ సంఖ్య మరింత తగ్గే అవకాశం ఉంది. రాష్ట్రంలో ఒకే కుటుంబానికి చెందిన భార్య, భర్తలతో పాటు మేజర్ అయిన పిల్లల పేర్ల మీద భూములు ఉన్నాయి. దీంతో చాలా వరకు రైతులకు కేంద్రం నుంచి పెట్టుబడి సొమ్ము అందదని సచివాలయ వర్గాలు పేర్కొంటున్నాయి.

బంధువు

(మొదటిపేజీ తరువాయి)

ఇలాంటి నిబంధనలేవీ లేకుండా ఎంత భూమి ఉన్నా వారికి కూడా ఆ మేరకు అందిస్తోందని అన్నారు. కేంద్ర ప్రభుత్వం త్వరలో అమలుచేయనున్న 'కిసాన్ సమ్మాన్ నిధి' పథకం అమలు గురించి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, రెవిన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, వ్యవసాయ శాఖ ముఖ్యకార్యదర్శి తదితరులతో మంగళవారం సచివాలయంలో సమావేశమై చర్చించిన తర్వాత మీడియాతో మాట్లాడుతూ పై విధంగా వ్యాఖ్యానించారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 'రైతుబంధు' పథకంలో కేంద్ర పథకాన్ని విలీనం చేయడం లేదా ఆ పథకం కింద విడుదలయ్యే నిధులను రాష్ట్ర పథకంలోకి జమ చేయడం లాంటి ప్రతిపాదనలేవీ ఈ సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వం నుంచి రాలేదని ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు.

కేంద్ర పథకం అమలుకు రాష్ట్రం సిద్ధంగా ఉంది : వసుధా మిశ్రా

కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన 'కిసాన్ సమ్మాన్ నిధి' పథకంపై చర్చించేందుకు తాను హైదరాబాద్ వచ్చానని, దీని అమలుకు సంబంధించిన విధి విధానాలను ప్రాథమిక స్థాయిలో చర్చించినట్లు వసుధా మిశ్రా తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం 'రైతుబంధు' పథకాన్ని అమలుచేస్తున్నందున రైతులందరి వివరాలు సిద్ధంగా ఉన్నాయని, వీటి ఆధారంగా కేంద్ర ప్రభుత్వ పథకానికి ఎంత మంది రైతు కుటుంబాలు అర్హమో నిర్ధారిస్తామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం దగ్గర ఉన్న గణాంకాలను ఇవ్వడానికి సిద్ధంగా ఉంటే తాము తీసుకుంటామని, తమ దగ్గర ఉన్న వివరాలను కోరినట్లయితే రాష్ట్రానికి ఇవ్వడానికి ఎలాంటి అభ్యంతరమూ లేదన్న విషయాన్ని ఈ సమావేశంల స్పష్టం చేసినట్లు తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో ఇప్పటికే 'రైతుబంధు' పథకం అమలవుతోంది కాబట్టి లబ్ధిదారుల పేర్లు, చిరునామా, బ్యాంకు ఖాతా, ఆధార్ నెంబర్, మొబైల్ ఫోన్ నెంబర్ తదితర గణాంకాలన్నీ సిద్ధంగా ఉన్నాయని, అవి ఇంకా సిద్ధం చేయని రాష్ట్రాలకు మాత్రం కేంద్రం సమకూరుస్తుందని ఒక ప్రశ్నకు సమాధానంగా తెలిపారు.

కేంద్ర, రాష్ట్ర పథకాలు వేర్వేరు

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి' పథకానికి 'రైతుబంధు'కు ఎలాంటి సంబంధం లేదని, కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకం చిన్న, సన్నకారు రైతులకు మాత్రమే వర్తిస్తుందని వివరించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న 'రైతుబంధు' పథకం స్వంత భూమి ఉన్న రైతులందరికీ వర్తిస్తుందన్నారు. అందుకే కుటుంబాన్ని యూనిట్‌గా తీసుకొని కిసాన్ సమ్మాన్ పథకం అమలవుతుందని తెలిపారు. కుటుంబానికి కూడా స్పష్టమైన నిర్వచనాన్ని రూపొందించామని, భార్య, భర్త, మైనర్ పిల్లలు కలిసి ఉన్న కుటుంబాన్ని యూనిట్‌గా తీసుకుంటున్నామని, వీరందరి పేర్ల మీద ఉన్న మొత్తం భూమిని కలిసి పరిగణనలోకి తీసుకుని ఐదు ఎకరాల లోపు ఉన్నట్లయితే ఆ పథకానికి అర్హులుగా నిర్ణయిస్తామని ఆమె వివరించారు. ఈ పథకం కింద కేంద్ర ప్రభుత్వం ఏటా ఇచ్చే ఆరు వేల రూపాయలను నేరుగా అర్హులైన రైతుల బ్యాంకు ఖాతాలోకి జమ చేస్తామని తెలిపారు. ఆధార్ లేదా ఏదైనా గుర్తింపు కార్డుతో పాటు బ్యాంక్ ఖాతాల వివరాలు ఇందుకు అవసరమవుతాయని, తెలంగాణ విషయంలో ఆ తరహా ఇబ్బందులేమీ ఉండవని ఒక ప్రశ్నకు సమాధానంగా బదులిచ్చారు. కేంద్ర పథకాన్ని రైతుబంధులో కలపాలంటూ రాష్ట్ర ప్రభుత్వం నుంచి తమకు ఎలాంటి ప్రతిపాదనలు అందలేదని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం దగ్గర అర్హులైన లబ్ధిదారుల పూర్తి వివరాలు ఉన్నందున వీలైనంత త్వరగా అమలు చేయాలని కోరామని పేర్కొన్నారు. ఈ పథకం అమలుకు రాష్ట్రంలోని వ్యవసాయ శాఖ నోడల్ ఏజెన్సీగా వ్యవహరిస్తుందని, ఆ శాఖ ఉన్నతాధికారి నోడల్ ఆఫీసర్‌గా వ్యవహరిస్తారని తెలిపారు. ఈ సమావేశంలో ప్రధాన కార్యదర్శి ఎస్‌కె జోషి, రెవిన్యూశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్ తివారి, వ్యవసాయ శాఖ ముఖ్య కార్యదర్శి పార్థసారథి తదితరులు పాల్గొన్నారు.

కేసు ఇక్కడే ఉండాలి

- ఆంధ్ర నుంచి బదిలీ చేయాలి
- నా భర్త హత్యపై అనుమానాలు
- జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో జయరాం భార్య పద్మశ్రీ ఫిర్యాదు



మన తెలంగాణ/హైదరాబాద్: ఎన్నారై జయరాం హత్య కేసులో ఎపి పోలీసుల దర్యాప్తులో అనేక అనుమానాలు కలుగుతున్నాయని కేసును వెంటనే తెలంగాణ పోలీసులకు బదిలీ చేయాలని మృతుని భార్య పద్మశ్రీ డిమాండ్ చేశారు. ఈక్రమంలో జయరాం హత్య కేసులో శిఖాచౌదరి, ఆమె తల్లి తదితరులను కాపాడేందుకు ఎపి పోలీసులు కుట్ర చేస్తున్నారని ఆమె ఆరోపించారు. ఎపి పోలీసులపై తనకు నమ్మకం లేదని, తనకు న్యాయం చేయాలని కోరుతూ పద్మశ్రీ మంగళవారం జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. తన భర్త జయరాంను హత్య చేసిన తరువాత నిందితుడు రాకేష్ రెడ్డి అటు పోలీసులతో పాటు ఇటు శిఖాచౌదరికి ఫోన్‌ద్వారా సమాచారం అందించాడని, నేరం జరిగిన విషయం తెలిసిన వెంటనే వారు ఎందుకు పోలీసులకు ఫిర్యాదు చేయలేదని ఆమె ప్రశ్నించారు. జరిగిన నేరాన్ని దాయడం కూడా నేరమే కదా అని ఆవేదన వ్యక్తం చేశారు. జయరాం ను హత్య చేసిన నిందితుడు రాకేష్‌రెడ్డికి సహకరించిన ఎఎస్‌పి మల్లారెడ్డి, సిఐ శ్రీనివాసులకు బదిలీ చేయడం, ఆపై నోటీసులివ్వడంతో పోలీసు శాఖ సరిపెట్టిందని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. జయరాం హత్యలో దాదాపు 10మంది పాత్ర ఉందని ఆమె ఆరోపించారు. తన భర్తను చంపిన వారికి సహరించిన పోలీసులను కాపాడే యత్నం కూడా జరుగుతోందని ఆమె అనుమానం వ్యక్తం చేశారు. ముఖ్యంగా జయరాం హత్య విషయం ముందుగా తెలిసిన వారందరిపై చర్యలు తీసుకోవాలని ఆమె డిమాండ్ చేశారు. తన భర్తను అతని తరపు బంధువులే చంపించారని మృతుడు జయరాం భార్య పద్మశ్రీ తన ఫిర్యాదులో పేర్కొన్నారు. జయరాం మేనకోడలు శిఖాచౌదరి కిలాడీ అని, డబ్బు కోసం ఎంతటికైనా తెగిస్తుందని, అమెరికాలో ఉన్న కాలంలో జయరాం తన సోదరి, ఆమె కుమార్తె శిఖాతో తనకు ప్రాణహాని ఉందని తరచూ చెప్పేవాడని తెలిపింది. వ్యాపార లావాదేవీల కోసమే జయరాం ఇండియా వచ్చారని, ఇంత ఘోరం జరుగుతుందని తాను ఊహించలేదన్నారు. శిఖా చౌదరి తన భర్తను లోబరుచుకుని ఆస్తిని కాజేయాలని చూసిందని తెలిపారు. హత్య సమాచారం అందుకున్న శిఖాచౌదరి నేరుగా జయరాం ఇంటికి వెళ్లి జగిత్యాలలో 10 ఎకరాలకు సంబంధించిన డాక్యుమెంట్లను దొంగలించిన విషయంపైనా ఫిర్యాదులో పేర్కొన్నారు. తన భర్త హత్య చేసినవారిని, అందుకు సహకరించిన వారిపై కఠిన చర్యలు తీసుకునేంతవరకు తాను న్యాయ పోరాటం చేస్తానని మీడియాకు వివరించారు.

ముద్దొచ్చే ముద్దు

(మొదటిపేజీ తరువాయి)

పర్యటన నిమిత్తం పోప్ ఫ్రాన్సిస్ యుఎఇ వచ్చారు. ప్రపంచ శాంతి కోసం పరస్పరం చేతులు కలపాలని ముస్లిం సమాజానికి ఇటీవలే పిలుపునిచ్చిన పోప్ యుఎఇ రాక ప్రాధాన్యతను సంతరించుకుంది. మానవాళికి సంబంధించి ప్రపంచ శాంతి కోసం, పరస్పర సహజీవనం కోసం చేసుకున్న ఈఒప్పంద పత్రం క్రిస్టియన్లు, ముస్లిముల మధ్య చర్చలకు ముఖ్యమైన ముందడుగుగా వాటికన్ అభివర్ణించింది. మత విశ్వాసాలలో స్వేచ్ఛ, సహన సంస్కృతి పెంపుదల, ప్రార్థనా స్థలాల పరిరక్షణ, మైనారిలీలకు పూర్తిస్థాయి పౌరసత్వం వంటివి ఈ ఒప్పందంలోని ముఖ్యాంశాలు.

నిధుల పల్లెబాట

(మొదటిపేజీ తరువాయి)

గ్రామాలకు రోడ్డు సౌకర్యం కల్పించాలని, ఇందుకు అవసరమైన ప్రతిపాదనలను వెంటనే తయారుచేసి పనులను ప్రారంభించాలని స్పష్టం చేశారు. మూడువేలకంటే ఎక్కువ జనాభా ఉన్న 1300 గ్రామ పంచాయతీల్లో రెండు చొప్పున స్మశానవాటికలు ఉండాలని వివరించారు.

'హరితహారం' పనులకు తొలి ప్రాధాన్యత : గ్రామ పంచాయతీల ఆధ్వర్యంలోనే 'నరేగా' పనులు జరగాలని, హరితహారం పనులకు మొదటి ప్రాధాన్యం, స్మశాన వాటికల నిర్మాణానికి రెండో ప్రాధాన్యం ఇవ్వాలని ముఖ్యమంత్రి కెసిఆర్ స్పష్టం చేశారు. 'నరేగా' నిధులను గ్రామాల్లో ప్రజలకు ఎప్పటికీ ఉపయోగపడే ఆస్తులను సృష్టించడానికి ఉపయోగించుకోవాలని సూచించారు. అన్ని గ్రామ పంచాయతీలకు ఖచ్చితంగా బిటి రోడ్డు ఉండేలా రహదారుల వ్యవస్థను నిర్మించాలన్నారు. 'తెలంగాణకు హరితహారం'లో భాగంగా రాష్ట్రంలోని మొత్తం 12,751 గ్రామాల్లో నర్సరీలను ఏర్పాటు చేయాలని, ప్రతీ గ్రామంలో మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని, వీటికి నరేగా నిధులను పూర్తి స్థాయిలో వినియోగించుకోవాలని సూచించారు. గుంతలు తవ్వడానికి, నీళ్లు పోయడానికి, ఇతర పనులకు ఈ నిధులను వాడాలని, అటవీశాఖ అధికారుల సలహాలు, సాంకేతిక సహకారంతో గ్రామ పంచాయతీల ఆధ్వర్యంలో నర్సరీలను ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. మొక్కలు పెట్టడం, వాటిని రక్షించడం లాంటి బాధ్యతలు గ్రామ పంచాయతీలు చేపట్టాలని ముఖ్యమంత్రి తెలిపారు.

అన్ని గ్రామాల్లో తప్పనిసరిగా 'వైకుంఠధామాలు' : రాష్ట్రంలోని అన్ని గ్రామాల్లో ఖచ్చితంగా ఆరు నెలల వ్యవధిలో వైకుంఠధామాలను నిర్మించాలని, ఏదేని పంచాయతీలో ప్రభుత్వ భూమి లేనట్లయితే గ్రామ పంచాయతీలు వాటి స్వంత నిధులతో స్థలాన్ని సమకూర్చుకోవడమో లేక దాతల నుంచి స్వీకరించడంపైనో దృష్టి పెట్టాలని ముఖ్యమంత్రి సూచించారు. వైకుంఠధామం నిర్మాణానికి నరేగా నిధులను వినియోగించుకోవాలని, మూడు వేల లోపు జనాభా కలిగిన 11,412 గ్రామాల్లో ఒకటి చొప్పున, అంతకంటే ఎక్కువ జనాభా కలిగిన 1300 గ్రామాల్లో రెండు చొప్పున మొత్తం 14,012 గ్రామాల్లో వైకుంఠధామాలు నిర్మించాలని సిఎం స్పష్టం చేశారు. గ్రామాలను పరిశుభ్రంగా ఉంచడం గ్రామ పంచాయతీల బాధ్యత అని నొక్కిచెప్పిన కెసిఆర్ గ్రామాల్లో పాడుబడిన ఇళ్ళ శిథిలాలను తొలగించాలని, పాడుపడిన లేదా నిరుపయోగంగా ఉన్న బావులను పూడ్చేయాలని పేర్కొన్నారు. మురికి, కంప చెట్లను తొలగించాలని, కూలిపోయిన ఇండ్ల శిథిలాలను కూడా తొలగించాలని స్పష్టం చేశారు.

ప్రతీ పంచాయతీకి డాంబరు రోడ్డు : రాష్ట్రంలోని అన్ని గ్రామ పంచాయతీలకు ఖచ్చితంగా బిటి రోడ్డు (డాంబర్ రోడ్డు) ఉండాలని ప్రభుత్వం విధానపరమైన నిర్ణయమే తీసుకుందని గుర్తుచేసిన ముఖ్యమంత్రి కొత్తగా 859 గ్రామాలకు రహదారులను నిర్మించాలని ఆదేశించారు. వీటికోసం వెంటనే ప్రతిపాదనలు తయారు చేసి, పనులు ప్రారంభించాలని సూచించారు. 'నరేగా'తో పాటు వివిధ రకాలుగా సమకూరిన నిధులతో గ్రామాల్లో జరుగుతున్న పనులను ఆకస్మికంగా తనిఖీ చేయాలని సంబంధిత అధికారులను ముఖ్యమంత్రి కెసిఆర్ ఆదేశించారు. ప్రస్తుతం గ్రామాల్లో జరుగుతున్న పనులను అధికారులు ఇరవై బృందాలుగా విడిపోయి ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. ఈ సమీక్షా సమావేశంలో ప్రభుత్వ ముఖ్య సలహాదారు రాజీవ్ శర్మ, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్‌కె జోషి, పార్లమెంటు సభ్యులు వినోద్ కుమార్, బండ ప్రకాశ్, శాసనసభ్యులు ఈటల రాజేందర్, రెడ్యానాయక్, బాల్క సుమన్, మాజీ శాసనసభ్యురాలు మాలోతు కవిత, పంచాయతీ రాజ్ ముఖ్య కార్యదర్శి వికాస్ రాజ్, కమిషనర్ నీతూ ప్రసాద్, అదనపు పిసిసిఎఫ్ డోబ్రియాల్, సిఎంవో ప్రత్యేక కార్యదర్శులు స్మితా సభర్వాల్, భూపాల్ రెడ్డి, ఓఎస్‌డి ప్రియాంక వర్గీస్ తదితరులు పాల్గొన్నారు.

200మంది అటవీ అధికారుల బదిలీ

(మొదటిపేజీ తరువాయి)

పనిచేసేలా చర్యలు తీసుకోవాలని సిఎం సూచించారు. అడవుల సంరక్షణ, అటవీ భూముల్లో చెట్ల పెంపకం, అటవీ పునరుద్ధరణపై చిత్తశుద్ధితో పనిచేసే అధికారులను కీలక ప్రాంతాల్లో నియమించి అక్కడ పనిచేస్తున్నవారిని ఇతర ప్రాంతాలకు బదిలీ చేసింది. 'జంగిల్ బచావో.. జంగిల్ బఢావో' నినాదంతో అడవుల సంరక్షణకు, అటవీ భూముల్లో అడవి పునరుద్ధరణకు చర్యలు చేపట్టాలని ఇటీవల ముఖ్యమంత్రి చేసిన ఆదేశాల నేపథ్యంలో ఈ బదిలీలు జరిగాయి. అటవీ పరిరక్షణ, సంరక్షణ విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించడం మాత్రమే కాకుండా కలపను స్మగ్లింగ్ చేసేవారితో సన్నిహితంగా ఉంటున్న పదకొండు మంది అటవీ సిబ్బందిపై సస్పెన్షన్ వేటు వేసింది. ముఖ్యమైన ప్రాంతాల్లో సత్ప్రవర్తన,మెరుగైన పనితీరు కలిగిన అధికారులను నియమించి స్మగ్లర్లకు సహకరిస్తున్న అధికారులపై చర్యలు తీసుకుంది. విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న వారికి మెమోలుఇవ్వడం లాంటి చర్యలు చేపట్టింది.

200 మంది బదిలీ: అడవులను సంరక్షించడంలో మంచి పేరున్న అధికారులను ప్రభుత్వం ముఖ్యమైన ప్రాంతాల్లో నియమించింది. చీఫ్ కన్జర్వేటర్ స్థాయి అధికారిని మొదలు బీట్ ఆఫీసర్ వరకు దాదాపు 200 మంది అటవీశాఖ ఉన్నతాధికారులు బదిలీ అయ్యారు. జిల్లా అటవీ అధికారులుగా పనిచేస్తున్న ఛీఫ్ కన్జర్వేటర్లు, కన్జర్వేటర్లు, డిఎఫ్ఓ స్థాయి కలిగిన 21 మందికి ముఖ్యమైన జిల్లాల బాధ్యతలను ప్రభుత్వం అప్పగించింది. చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్టు ఎకె. సిన్హాకు అచ్చంపేట బాధ్యతలు, కన్జర్వేటర్ హోదా కలిగిన శర్వానంద్‌కు మెదక్, వినోద్‌కుమార్‌కు కవ్వాల్ బాధ్యతలను అప్పగించింది. మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జనగామ, భూపాలపల్లి, ఖమ్మం, పాల్వంచ, కిన్నెరసాని, వరంగల్, ఖానాపూర్, అమ్రాబాద్, బాన్సువాడ, ఇల్లందు, కాగజ్‌నగర్, ఇచ్చోడకు కొత్త డిఎఫ్ఓలను నియమించింది. 19 మంది రేంజ్ అధికారులను కూడా మార్చింది. మహబూబాబాద్, గూడూరు, గంగారం, బయ్యారం, ఆజంనగర్, పెద్దపల్లి, నర్సంపేట, మంచిర్యాల, డోర్నకల్, కరీంనగర్, కొత్తగూడెం, కెరమెరి, బెల్లంపల్లి, తిర్యాని, గాంధారి, బాన్సువాడ, పిట్లం, నాగిరెడ్డిపేట, దూలపల్లికి కొత్త రేంజ్‌లకు కూడా అధికారులను నియమించింది. ఫారెస్టర్లు, బీట్ అధికారులు కలిపి మొత్తం 160 మంది బదిలీ అయ్యారు.

11 మందిపై సస్పెన్షన్ వేటు, పలువురికి మెమోలు: అడవులను సంరక్షించే విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో పాటు స్మగ్లర్లకు సహకరిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని ఇటీవల ముఖ్యమంత్రి ఆదేశించిన నేపథ్యంలో స్మగ్లర్లకు సహకరిస్తున్నారనే అభియోగాలతో 11 మంది అటవీ అధికారులపై సస్పెన్షన్ వేటు వేసింది. సస్పెండైన వారిలో ఫారెస్టు డెవలప్‌మెంట్ అధికారి స్థాయి నుంచి ఫారెస్టు గార్డుల వరకు వివిధ స్థాయిల్లోని సిబ్బంది ఉన్నారు. విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న వివిధ స్థాయిలోని పలువురు అధికారులతో పాటు సిబ్బందికి మెమోలు కూడా జారీ అయ్యాయి.

6 కోట్లు..6 లక్షలు.. చిత్రవధ

(మొదటిపేజీ తరువాయి)

దర్యాప్తులో తేలిందన్నారు. రాకేష్‌రెడ్డి హైదరాబాద్ నగరంలో స్థిరాస్తి వ్యాపారం చేసేవాడని, కుత్బుల్లాపూర్‌లోని జయరాం కంపెనీ లాకౌ ట్ సమస్య పరిష్కారం కోసం రాకేష్‌రెడ్డికి ఫోన్ చేశాడన్నారు. సమస్య పరిష్కారానికి శిఖాచౌదరికి సహరించాలని జయరాంను కోరాడని తెలిపారు. ఈక్రమంలో రాకేష్ రెడ్డి మూడు దఫాలుగా రూ.6కోట్ల రూపాయలు జయరాంకు అప్పు ఇచ్చాడన్నారు. కొంతకాలంల వడ్డీ చెల్లించిన జయరాం ఏ డాదిన్నర నుంచి ఏలాంటి మొత్తాలు చెల్లించలేదన్నారు. దీంతో తనకు రా వాల్సిన మొత్తాలను రాబట్టుకోవడం కోసం పలు మార్లు ఫోన్లు చేసినా జయరాం స్పందించలేదన్నారు. జయ రాం తనకు ఇవ్వాల్సిన మొత్తాలకు సంబంధించి శిఖారెడ్డిపై పలుమార్లు ఆగ్రహం వ్యక్తం చేశాడని తెలిపారు. అమెరికాలో ఉన్న జయరాం హైదరాబాద్‌కు వచ్చిన వెంటనే తనకు తెలిజేయాలని రాకేష్‌రెడ్డి వార్నింగ్ ఇచ్చాడన్నారు. అమెరికా నుంచి జయరాం వస్తున్న సమాచారం అందుకున్న రాకేష్‌రెడ్డి ఈ నేపథ్యంలో జయరాం తీరుతో విసిగివేసారెత్తిన రాకేష్‌రెడ్డి కొత్త పథకం రచించాడన్నారు. మహిళావ్యామోహం ఉన్న జయరాంను పట్టుకునేందుకు రీనా అనే యువతి పేరిట సిమ్‌కార్డు తీసుకుని జయరాంతో చాటింగ్ చేశాడన్నారు. గత నెల 30న తన ఇంటికి రావాలని రీనా పేరిట సందేశం పంపించాడన్నారు. ఆ సందేశంలో డ్రైవర్, గన్‌మెన్‌లు లేకుండా జూబ్లీహిల్స్ రోడ్ నెంబర్ 10లో ఉన్న ఇంటికి రావాలని సందేశంలో పేర్కొన్నారన్నారు. దీంతో రీనాను కలిసేందుకు అక్కడికి వెళ్లిన జయరాంను రాకేష్‌రెడ్డి తాళ్లతో కట్టి బంధించాడని తెలిపారు. సుమారు 19 గంటల పాటు గృహనిర్భంధం చేశాడని, దాదాపు 12 గంటల పాటు డబ్బు వసూళ్ల కోసం జయరాంను తీవ్రంగా హింసించారు. డబ్బు వసూళ్ల కోసం పలువురికి ఫోన్లు చేయించారు. జయరాం మేనకోడలు శిఖా చౌదరికి ఫోను చేయగా ఆమె తన దగ్గర అంత డబ్బులేదని సమాధానం ఇచ్చిందన్నారు. ఈ నేపథ్యంలో కోస్టల్ బ్యాంక్ మాజీ మేనేజర్ రూ.6 లక్షలు పంపిచాడని తెలిపారు. తనకు రూ.6 కోట్లు రావాల్సిఉండగా కేవలం రూ.6 లక్షలు మాత్రమే వసూలు కావడంతో రాకేష్ ఆగ్రహం కట్టలు తెంచుకుందన్నారు. దీంతో రాకేష్ ఊహించిన విధంగా డబ్బు రాకపోవడంతో జయరాంను ఇష్టానుసారం కొట్టాడటంతో సోఫాపై పడిపోయాడన్నారు. ఆగ్రహంతో ఉన్న రాకేష్‌రెడ్డి సోఫాపై పడివున్న జయరాం ముఖాన్ని అదిమిపెట్టి ఊపిరిఆడకుండా చేసి చంపేశాడన్నారు. జయరాం మృతి చెందాడని గ్రహించిన రాకేష్‌రెడ్డి వాచ్‌మెన్ సహాయంతో మృతదేహాన్ని కారులో పెట్టించుకుని నందిగామలో రోడ్డు ప్రమాదం జరిగినట్లుగా చిత్రీకరించాడన్నారు. కారులో జయరాం మృతదేహాన్ని పడవేసిన అనంతరం రాకేష్‌రెడ్డి, డ్రైవర్ శ్రీనివాస్‌లు వెళ్లిపోయారు.ఈక్రమంలో సిసి కెమెరాలు, సెల్‌ఫోన్ డేటా ఆధారంగా డిఎస్‌పి నేతృత్వంలో దర్యాప్తు చేపట్టిన పోలీసు అధికారులు రాకేష్‌రెడ్డి, డ్రైవర్ శ్రీనివాస్‌లను అరెస్టు చేయడం జరిగిందని ఎస్‌పి తెలిపారు. నిందితులపై 302, 201, 202,338, 346, 385 ఐపిసి సెక్షన్ల కింద కేసు నమోదు చేశామన్నారు.

న్యాయ సలహామేరకు కేసు బదిలీ చేస్తాం: ఎస్‌పి

ఎన్నారై జయరాం హత్య హైదరాబాద్‌లోనే జరిగిందని, అయితే ఎపి పోలీసులు దర్యాప్తు చేసి నిందితులను అరెస్టు చేయడం జరిగిందని ఎస్‌పి తెలిపారు. కేసు బదిలీ విషయంలో న్యాయ సలహా తీసుకుంటామన్నారు. నేరం జరిగిన ప్రాంతానికే కేసు బదిలీ చేయాలని న్యాయస్థానం ఆదేశిస్తే కేసును వెంటనే బదిలీ చేస్తామన్నారు. అయితే నిందితుల నుంచి ఇంకా అనేక విషయాలు రాబట్టాల్సి ఉందని, నిందితులను పోలీస్ కస్టడీకి కోరుతూ బుధవారం పిటిషన్ వేస్తామన్నారు.

ముగ్గురు పోలీసులపై వేటు : జయరాం ఘటనలో ఎఎస్‌పి, సిఐ, కానిస్టేబుళ్లపై వేటు పడింది. ఇబ్రహీం పట్నం ఎసిపి మల్లారెడ్డి,నల్లకుంట్ల సిఐ శ్రీనివాస్‌లు రాకేష్‌రెడ్డికి సహరించారన్న ఆరోపణలలో బదిలీ వేటు పండింది. పారిశ్రామిక వేత్త చిగురుపాటి జయరాం హత్య కేసు నిందితుడు రాకేష్‌రెడ్డితో ఎసిపి పలు మార్లు పోన్లో మాట్లాడటం, అతనితో సంబంధాలున్నట్లు తేలడంతో బదిలీ చేసినట్లు సిపి మహేష్‌భగవత్ పేర్కొన్నారు. మల్లారెడ్డితో రాకేష్‌రెడ్డి ఫోన్‌లో టచ్‌లో ఉన్నాడు. ఓ కేసు సందర్భంగా రాకేష్, ఎసిపిల మధ్య ఏర్పడిన పరిచయం వారి మధ్య స్నేహంగా మారింది. ఈక్రమంలో జయరాం హత్య అనంతరం రాకేష్‌రెడ్డి ఎసిపి మాల్లారెడ్డికి సమాచారం అందించి సలహా కోరాడు. జయరాం హత్యను రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించేందుకు పోలీసులు తమవంతు సలహాలిచ్చినట్లు ఎపి పోలీసులు గుర్తించారు. జయరాం కేసును తప్పుదారి పట్టించేందుకు పోలీసులు సహరించారని ఎపి పోలీసుల దర్యాప్తులో తేలింది. అయితే నందిగామ పోలీస్ కానిస్టేబుల్ వెంకటేశ్వర్లు శిఖాచౌదరిని పోలీసులు ప్రశ్నిస్తున్న సమయంలో తన సెల్‌లోఫోన్‌లో ఫోటో తీసి తన మిత్రులకు వాట్సప్ చేశాడు. ఈ విషయం పోలీసు ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లడంతో సదరు కానిస్టేబుల్‌ను సస్పెండ్ చేశారు. మల్లారెడ్డి బదిలీ చేయడంతో ఆ స్థానంలో వనస్థలిపురం ఎసిబి గాంధీనారాయణకు అదనపు బాధ్యతలు అప్పగించారు

తల్లి దండ్రులనూ వదలని రాకేష్‌రెడ్డి

జయరాం హత్య కేసు నిందితుడు రాకేష్‌రెడ్డి నేర చరిత్రలో కొత్త విషయం వెలుగుచూసింది. కన్నతల్లితండ్రుల పట్ల క్రూరంగా వ్యవహరించాడని జీడిమెట్ల పోలీసులు వివరిస్తున్నారు. కొద్దిరోజుల పాటు ఇంటికి రాకేష్‌రెడ్డి రాకపోవడంతో అతని తల్లితండ్రులు పద్మ, శ్రీనివాసరెడ్డి ఆందోళన చెందారు. ఈక్రమంలో తమ కుమారుడి ఆచూకీ కోసం అతని మిత్రుడికి ఫోన్ చేసి వాకబు చేశారు. దీంతో తెల్లవారి ఇంటికి వచ్చిన రాకేష్‌రెడ్డి తల్లి పద్మ తండ్రి శ్రీనివాసరెడ్డిలపై దాడి చేసి, తన గురించి ఎవరినీ అడగవద్దని హెచ్చరించారు. దీంతో భయాందోళనలకు గురైన వారు కుమారుడిపై కేసు పెట్టారు. తల్లితండ్రులను హతమారుస్తానని హెచ్చరించడంతో వారు పోలీసులను ఆశ్రయించారు. ఈ ఘటనపై 2017లో జీడిమెట్ల పోలీసులు కేసు నమోదు చేశారు.

చెక్‌డ్యామ్‌లతో నీటి వనరుల పునరుజ్జీవం

నివేదిక తయారీపై అధికారుల కసరత్తు





మన తెలంగాణ/హైదరాబాద్: రాష్ట్రంలో నదులను, వాగులను పునరుజ్జీవం చేయడానికి వాటిపై అనువైన చోట్ల చెక్ డ్యాంలు నిర్మించాలని, చెక్ డ్యాంలను ఈ వాగులపై, ఎక్కడెక్కడ నిర్మించాలి, వాటి సాంకేతిక అంశాలను అధ్యయనం చేసి సమగ్ర నివేదికను సమర్పించాలని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు సాగునీటి శాఖ అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు రిటైర్డ్ ఇఎన్‌సి విజయ ప్రకాష్ నేతృత్వంలో ఒక బృందం అధ్యయనం చేసింది. వాటిని క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న మైనర్ ఇరిగేషన్ ఇంజనీర్లకు వివరించడానికి జలసౌధలో ఒక వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ వర్క్‌షాప్‌కు ఈఈ స్థాయి వరకు ఇంజనీర్లు హాజరయ్యారు. సిఎం చేసిన సూచనలు, వర్క్‌షాప్ లక్ష్యాలను ఇఎన్‌సి మురళీధర్ అందరికీ వివరించగా, తెలంగాణ జలవనరుల అభివృద్ధి సంస్థ చైర్మన్ వి.ప్రకాష్ ముఖ్య అతిధిగా హాజరై ప్రసంగించారు. అనువైన చోట్ల చెక్ డ్యాంలు ఏర్పాటు చేయాలన్న నిర్ణయం చాలా కీలకమైందన్నారు. మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాలు చాలా కాలం క్రితమే ప్రధాన నదులు, వాటి ఉప నదులపై చెక్ డ్యాంలు, ఆనకట్టలు కట్టి, ఆ నీటిని వినియోగించుకున్నారన్నారు. తెలంగాణ ఉద్యమం జరిగే రోజుల్లోనే మంజీరా, దాని ఉపనదులపై కర్ణాటక, మహారాష్ట్రలు చెక్‌డ్యాంలు, ఆనకట్టలు చూసానన్నారు. పుష్కలంగా నీటి వనరులు ఉన్న తెలంగాణలో కూడా ఇటువంటి స్థితి ఏర్పడాలని తాను ఆశించానని, ఇప్పుడు ముఖ్యమంత్రి నిర్ణయంతో తన ఆశ నిజం కాబోతుందన్నారు. షేక్ హ్యాండ్ చెక్ డ్యాంలు వీలున్న చోట్ల నిర్మించాలని సూచించారు. జహీరాబాద్ ప్రాంత ంలో గొట్టిగానిపల్లి గ్రామంలో గతంలో ఇటువంటి గొప్ప ప్రయోగం సఫలం అయిందని గుర్తుచేశారు. ఆ గ్రామంలో ఉన్న ఒకే ఒక వాగుపై 12 చెక్ డ్యాంలు నిర్మించినందున ఆ గ్రామంలో నీటి వనరుల లభ్యత పెరిగి ఏటా రెండు పంటలు ఇప్పటికీ పండిస్తున్నారన్నారు. రాష్ట్రంలోని అన్ని పల్లెలు ఇదేవిధంగా మారాలని వి.ప్రకాష్ ఆకాంక్షించారు. అనంతరం విజయ ప్రకాష్ చెక్‌డ్యాంల నిర్మాణానికి ఎంపిక చేయాల్సిన వాగులను ఎట్లా గుర్తించాలి, వాటి సాంకేతిక అంశాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఎన్‌ఆర్‌ఎస్‌ఎ మ్యాపుల ద్వారా విపులంగా చర్చించారు. రాష్ట్రంలోని నదులను, వాగులను మొత్తం 8 స్థాయిలలో వర్గీకరించామన్నారు. ఇందులో 4 కేటగిరీలలో చెక్ డ్యాంల నిర్మాణానికి స్థలాలు ఎంపిక చేయాలని సూచించారు. ప్రాజెక్టుల ఆయకట్టు ఉన్న ప్రాంతాల్లో వాగులను ప్రథమ ప్రాధాన్యత కింద ఎంపిక చేయాలన్నారు. గోదావరి బేసిన్‌లో 4 నుంచి 8 స్థాయిల వాగులపై 6500 కిలోమీటర్ల పొడవులో ఇప్పటికే ఆనకట్టలు, చెక్‌డ్యాంలు, కత్వాలు, మాటులు మొత్తం 319 ఉన్నాయని, కృష్ణా బేసిన్‌లో 5700 కిలోమీటర్ల మేర పొడవున వాగులపై మొత్తం 446 ఉన్నట్లు గుర్తించామన్నారు. ఇందులో అత్యధికంగా చిన్న స్థాయి వాగులపైనే చెక్‌డ్యాంలు నిర్మించారన్నారు. పెద్దవాగులపై ఇంకా చెక్ డ్యాంలు నిర్మించే అవకాశాలు ఉన్నాయన్నారు. ఇప్పటికే నిర్మించబడ్డ చెరువులు, జలాశయాలకు ఎటువంటి నష్టం వాటిల్లకుండా తగినంత నీటి లభ్యత ఉన్న వాగులపైనే చెక్ డ్యాంలు ప్రతిపాదించాలన్నారు. చెక్ డ్యాంల మధ్య దూరాన్ని అక్కడి స్థానిక పరిస్థితులను బట్టి నిర్ణయించాలని, ప్రాజెక్టుల కమాండ్ ఏరియాలో షేక్ హ్యాండ్ చెక్ డ్యాంలు ప్రతిపాదించాలని, కమాండ్‌లో లేని వాగులపై అక్కడి స్థానిక పరిస్థితుల ఆధారంగా ప్రతిపాదించాలని సూచించారు. మంచి రాతిపునాధి కలిసిన స్థలాలను ఎంపిక చేయాలన్నారు. ప్రతిపాదనల తయారీలో భూగర్భ జల శాఖ అధికారులను కూడా భాగస్వాములను చేయాలని సూచించారు. 3 మీటర్ల లోతున భూగర్భ జలాలు లభ్యం అవుతున్న ప్రాంతాల్లో చెక్‌డ్యాంలు ప్రతిపాదించవద్దని, భూగర్భ జలమట్టం లోలోతుల్లోకి వెళ్లిన గ్రామాలకు, మండలాలకు అధిక ప్రాధాన్యం కల్పించాలని భూగర్భ జలశాఖ డైరక్టర్ పండిత్ సూచించారు. సోమవారం ఉదయం గోదావరి బేసిన్ ఇంజనీర్లకు, మధ్యాహ్నం కృష్ణా బేసిన్ ఇంజనీర్లకు ఈ వర్క్‌షాప్‌లో అవగాహన కల్పించగా, త్వరలోనే దీనిపై స్పష్టమైన మార్గదర్శకాలు అధికారికంగా విడుదల చేస్తామని ఇఎన్‌సి మురళీధర్ అన్నారు. వర్క్‌షాప్‌లో సిఎం ఓఎస్‌డి శ్రీధర్‌రావు దేశ్‌పాండే, మైనర్ ఇరిగేషన్ చీఫ్ ఇంజనీర్ శ్యాంసుందర్, ఎస్‌ఇ, ఈఈలు పాల్గొన్నారు.

వేసవి రద్దీకి ప్రత్యేక రైలు సర్వీసులు

మన తెలంగాణ / హైదరాబాద్ : ప్రయాణీకుల రద్దీతో పాటు వేసవి కాలం ప్రయాణాలను దృష్టిలో ఉంచుకొని దక్షిణ మధ్య రైల్వే కొన్ని ప్రత్యేక రైలు సర్వీసులను నిర్వహిస్తోంది. నర్సాపూర్, హైదరాబాద్, విజయవాడ, కాకినాడల మధ్య ఈ ప్రత్యేక రైళ్ళు నడుస్తాయని ద.మ. రైల్వే ఒక ప్రకటనలో తెలిపింది. ఇందుకు సంబంధించిన షెడ్యూల్‌ను మంగళవారం విడుదల చేసింది.

నర్సాపూర్, హైదరాబాద్ మధ్య : మార్చి 3, 10, 17, 24, 31 తేదీల్లో ప్రతీ ఆదివారం నర్సాపూర్‌లో సాయంత్రం ఆరు గంటలకు బయలుదేరే రైలు (నెం. 07258) తర్వాత రోజు తెల్లవారుజామున 4:45 గంటలకు హైదరాబాద్ చేరుకుంటుంది. ఎసి టు, త్రి టయర్లతో పాటు స్లీపర్ క్లాస్, జనరల్ సెకండ్ క్లాస్ బోగీలతో పాలకొల్లు, వీరవరసం, భీమ వరం జంక్షన్, భీమవరం టౌన్, ఆకివీడు, కైకలూరు, గుడివాడ, విజయవాడ, గుంటూరు, సత్తెనపల్లి, పిడుగురాళ్ల, నడికుడి, మిర్యాలగూడ, నల్గొండ స్టేషన్ల మీదుగా బయలుదేరుతుంది.

హైదరాబాద్, విజయవాడ మధ్య : మార్చి 4, 11, 18, 25, ఏప్రిల్ 1 తేదీలలో ప్రతీ సోమవారం రాత్రి 10:20 గంటలకు బయలుదేరే రైలు (నెం.07257) తర్వాత రోజు ఉదయం 6:35 గంటలకు విజయవాడ చేరుకుంటుంది. ఎసి టు, త్రి టయర్లతో పాటు స్లీపర్ క్లాస్, జనరల్ సెకండ్ క్లాస్ బోగీలతో కాజీపేట, వరంగల్, డోర్నకల్, ఖమ్మం స్టేషన్ల మీదుగా బయలుదేరుతుంది.

హైదరాబాద్, కాకినాడ టౌన్ మధ్య : ఈ నెల 8వ తేదీన హైదరాబాద్‌లో సాయంత్రం 6:50 బయలుదేరే రైలు (నెం.07001) తర్వాత రోజు ఉదయం ఆరు గంటలకు కాకినాడ టౌన్‌కు చేరుకుంటుంది. ఎసి టు, త్రి టయర్లతో పాటు స్లీపర్ క్లాస్ బోగీలతో కాజీపేట, వరంగల్, ఖమ్మం, రాయనపాడు, ఏలూరు. తాడేపల్లిగూడెం, నిడదవోలు, రాజమండ్రి, ద్వారాకపూడి, సామర్లకోట మీదుగా బయలుదేరుతుంది.


బుచ్చిరాములుకు కన్నీటి వీడ్కోలు





మన తెలంగాణ/సూర్యాపేట : నాలుగు దశాబ్ధాలు ఎర్ర జెండా నీడలో కార్మిక పక్షపాతిగా ఉన్న వర్ధెల్లి బుచ్చిరాములు సోమవారం రాత్రి కన్నుమూశారు. తెలంగాణ సా యుధ పోరాటంలో పాల్గొన్న ఆయన ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఉద్యమాలకు ఊపిరిపోశారు. సూర్యాపేట కేం ద్రంగా నిర్వహించిన కమ్యూనిస్టు ఉధ్యమాలకు కేంద్ర బి ందువయ్యారు. కొద్ది రోజులుగా అస్వస్థతకు గురైన ఆ యన హైదరాబాద్‌లో చికిత్స పొందారు. అనంతరం నల్లగొండలోని ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ అనంతలోకాలకు చేరుకున్నారు. విషయం తెలిసిన కమ్యూనిస్టు నాయకులు, ప్రజాప్రతినిధులు ఆయనకు సంతాపం ప్రకటించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి, సూర్యాపేట ఎ మ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్, నాగార్జున సాగర్, కోదాడ, తుంగతుర్తి, నకిరేకల్ ఎమ్మెల్యేలు నోమల నర్సింహాయ్య, బొల్లం మల్లయ్య యాదవ్, చి రుమర్తి లింగయ్య, గాదరి కిషోర్, నల్లగొండ మాజీ ఎమ్మెల్యేలు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, నంద్యాల నర్సింహారెడ్డితో, ప్రొఫెసర్ కోదండరాం, సాక్షి పత్రిక ఎడిటోరియల్ డైరెక్టర్ రామచంద్రమూర్తితో పాటు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి, జిల్లా కార్యదర్శి ముల్కలపల్లి రాములుతో పాటు వివిధ ప్రజా సంఘాల నాయకులు అభిమానులు, పుష్పమాలలు వేసి నివాళులు అర్పించారు.

ముగిసిన 21వ పిఎస్‌సి ఛైర్మన్ల జాతీయ సదస్సు



మన తెలంగాణ /హైదరాబాద్ : దేశంలోని అన్ని రాష్ట్రాల పబ్లిక్ సర్వీస్ కమిషన్లలో అనుసరిస్తున్న నియామక ప్రక్రియలో సాంకేతికత వినియోగం, నిబంధనలు తదితర అంశాలపై రాష్ట్ర పబ్లిక్ సర్వీసు కమిషన్ల ఛైర్‌పర్సన్ల సదస్సులో చర్చించారు. 4,5 తేదీలలో ఒరిస్సాలోని భువనేశ్వర్‌లో జరిగిన 21 రాష్ట్రాల పిఎస్‌సిల ఛైర్‌పర్సన్ల జాతీయ సదస్సు నిర్వహించారు. రెండు రోజుల పాటు జరిగిన ఈ సదస్సుకు మంగళవారం ముగిసింది. ఈ సదస్సును ఒరిస్సా గవర్నర్ ప్రొఫెసర్ గణేష్ ప్రారంభించగా, యుపిఎస్‌సి ఛైర్మన్ అరవింద్ సక్సేనా, స్టాండింగ్ కమిటీ ఛైర్మన్, టిఎస్‌పిఎస్‌సి ఛైర్మన్ ఘంటా చక్రపాణిలతో రాష్ట్రాల పిఎస్‌సి ఛైర్మన్లు పాల్గొని దేశవ్యాప్తంగా నియామక ప్రక్రియ విధానాలు, సాంకేతికత వినియోగం తదితర అంశాలపై చర్చించారు. ఈ సదస్సుకు ఒరిస్సా ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ హాజరయ్యారు.

బాలికపై అత్యాచార యత్నం, నిందితుడు పరారీ

మన తెలంగాణ/ చివ్వెంల : బాలికపై అత్యాచార యత్నం సంఘటన సూర్యాపేట జిల్లా చివ్వెంల మండలం కుడకుడ గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. బాధితురాలి తల్లిదండ్రులు తెలిపిన వివరాల ప్రకారం కుడకుడ గ్రామా నికి చెందిన గుండు యాకయ్య అభంసుభం తెలియని 8 ఏళ్ల బాలికలపై అత్యాచారం చేసేందుకు ప్రయత్నించాడు. సూర్యాపేట మండలం రాయినిగూడెం గ్రామానికి చెందిన గద్దల వెంకులు తన కూతురుని తీసుకొని కుడకుడ గ్రామా నికి వెళ్లాడు. సాయంత్రం వరకు పనిచేసిన వెంకులు మద్యం సేవించి రాయినిగూడెనికి వెళ్లాడు. గుండు యాకయ్య కూడా వెంకయ్యతో పనిచేసి ఇంటికి వెళ్లాడు. వారి ఇంట్లో ఉన్న వెంకులు కూతురిపై రాత్రి యాకయ్య అత్యాచార యత్నం చేయగా ఉదయం బాలికను రాయి నిగూడెం తీసుకెళ్లారు. బాలిక కడుపునొప్పితో బాధప డడంతో తల్లి విచారించి అత్యాచార యత్నానికి గురైందని తెలుసుకొని వెంటనే చివ్వెంల పోలీసులకు ఫిర్యాదు చేశారు. నిందితుడు పరారీలో ఉండగా బాలికను వైద్య పరీక్షల నిమిత్తం ఏరియా హాస్పిటల్‌కు తరలించారు. ఎస్సై సిహెచ్ నరేష్ వైద్య పరీక్షలు వచ్చిన తర్వాత నిందితుడిపై చర్యలు తీసుకుంటామని చెప్పారు.

మంచి వినోదాన్ని అందించడానికి 'వినయ విధేయ రామ' సినిమా కోసం నటీనటులు, సాంకేతిక నిపుణులు అందరం ఎంతగానో శ్రమించాం. అయితే దురదృష్టవశాత్తు మేము అనుకున్న విధంగా ఒక మంచి సినిమాను అందించలేకపోయాం. భవిష్యత్తులో ప్రేక్షకులు మెచ్చే సినిమాలు చేయడానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తాను. – స్టార్ హీరో రామ్‌చరణ్



పారితోషికంగా ఏరియాల హక్కులు!



టాలీవుడ్‌లో వంద శాతం సక్సెస్ రేటు ఉన్న దర్శకుల జాబితాను పరిశీలిస్తే అందులో కొరటాల శివ పేరు ప్రముఖంగా వినిపిస్తుంది. ఆయన సినిమా తీస్తే హిట్టే అన్న క్రేజు ట్రేడ్ వర్గాల్లో ఉంది. అందుకు తగ్గట్టే కొరటాల ఓ సినిమా ప్రారంభిస్తున్నారు అంటే దానిపై భారీ అంచనాలు ఏర్పడుతున్నాయి. మహేష్‌బాబు హీరోగా 'భరత్ అనే నేను' చిత్రం తెరకెక్కించి బ్లాక్‌బస్టర్ హిట్‌ను అందుకున్న కొరటాల ప్రస్తుతం మెగాస్టార్ చిరంజీవి నటించే 152వ సినిమాకు స్క్రిప్ట్ సిద్ధం చేస్తున్న సంగతి తెలిసిందే. ఈ చిత్రం ప్రీ ప్రొడక్షన్ పనులు పూర్తవుతున్నాయి. చిరంజీవి 'సైరా నరసింహారెడ్డి' చిత్రం పూర్తి చేసిన వెంటనే కొరటాల దర్శకత్వంలో నటించేందుకు సిద్ధమవుతున్నారు. ఇక చిరు సరసన పలువురు కథానాయికలను పరిశీలిస్తున్నారని తెలిసింది. ఈ పనుల్లో ఉండగానే కొరటాల శివ గురించిన ఓ ఆసక్తికరమైన విషయం తెలిసింది. చిరంజీవి సినిమా కోసం ఈ దర్శకుడికి ఇప్పటికే 2 కోట్ల అడ్వాన్స్ ఇచ్చారట. అలాగే కొన్ని ఏరియాల హక్కులను పారితోషికంగా అందజేస్తామని నిర్మాత రామ్‌చరణ్ మాటిచ్చారట. వాస్తవానికి ఒక్కో సినిమాకు కొరటాల 10 కోట్ల నుంచి 15 కోట్ల మేర పారితోషికం తీసుకుంటారని బయట ప్రచారం ఉంది. అంటే 2 కోట్లు అడ్వాన్స్ రూపంలో తీసుకున్నా మిగతా మొత్తం ఏరియా హక్కుల రూపంలో అతనికి దక్కుతాయి. కోస్తా, ఆంధ్రాలోని కొన్ని ఏరియాలను కొరటాలకు అప్పజెప్పేందుకు డీల్ కుదిర్చారన్న మాట వినిపిస్తోంది. ఏరియాను బట్టి హీరోలకు డిమాండ్ ఉంటుంది. అక్కడ వారికి బిజినెస్ కలెక్షన్స్ స్పీడ్ ఉంటుంది. మెగాస్టార్ చిరంజీవి నటించిన 'ఖైదీ నంబర్ 150' చిత్రానికి కేవలం గుంటూరు, కృష్ణ ఏరియా తీసుకున్నా ఏకంగా 10 కోట్ల వసూళ్లు దక్కాయి. అదేవిధంగా కొరటాలకు ఏరియాల నుంచి కలెక్షన్ల రూపంలో బాగానే వర్కవుట్ అవుతుందని అంచనా వేస్తున్నారు. మినిమంగా ఈ సినిమాతో అతనికి 10 నుంచి 15 కోట్లు వచ్చే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. మరొక కోణంలో చూస్తే ఏరియా హక్కులు, లాభాల్లో వాటా అంటే దర్శకుడిని అదుపులో పెట్టినట్టే. దీంతో కొరటాల చాలా జాగ్రత్తగా సినిమా తీయాల్సి ఉంటుంది. ఇది ఇరువురికి కలిసొచ్చే డీల్ అని భావించవచ్చు.

నేటి తరం ప్రేమ కథా చిత్రం



దొమ్మరాజు ఉదయ్‌కుమార్, వెంకటేష్, ఈశ్వర్

ఓం శ్రీచక్ర క్రియేషన్స్ బ్యానర్‌లో ఈశ్వర్, టువ చక్రవర్తి, అంకిత మహారాణా హీరోహీరోయిన్లుగా పరిచయమవుతున్న చిత్రం '4 లెటర్స్'. కుర్రాళ్లకు అర్థమవుతుందిలే అన్నది ఉపశీర్షిక. ఆర్.రఘురాజ్ దర్శకత్వంలో దొమ్మరాజు హేమలత, దొమ్మరాజు ఉదయ్‌కుమార్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ సినిమా ట్రైలర్‌ను చూసిన సీనియర్ స్టార్ వెంకటేష్ చిత్ర కథానాయకుడు, దర్శక నిర్మాతలను అభినందించారు. ఈ చిత్రం విజయవంతం కావాలని ఆకాంక్షించారు. ఈ చిత్రం సెన్సార్ కార్యక్రమాలను పూర్తి చేసుకొని 'ఎ' సర్టిఫికెట్ పొందింది. ఈనెల 22న ఈ చిత్రాన్ని విడుదల చేస్తున్నట్లు నిర్మాత ఉదయ్ కుమార్ తెలిపారు. కమర్షియల్ హంగులతో యూత్ సహా అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకునే ఎంటర్‌టైనర్‌గా ఈ సినిమా రూపొందిందని ఆయన చెప్పారు. దర్శకుడు ఆర్.రఘురాజ్ మాట్లాడుతూ "నేటి తరం ప్రేమ కథా చిత్రమిది. ప్రేమ, పెళ్లి విషయాలలో నేటి యువత ఆలోచనలు, అభిప్రాయాలు ఎలా ఉన్నాయని చెబుతూ వాస్తవానికి దగ్గరగా ఉండేలా ఈ సినిమాను తెరకెక్కించాం. హీరో ఈశ్వర్ చక్కగా నటించాడు. తనకు మంచి భవిష్యత్తు ఉంటుంది. హైదరాబాద్‌లో టాకీ పార్ట్‌ను, బ్యాంకాక్‌లో పాటలను చిత్రీకరించాం"అని తెలిపారు.

డబ్బుతో పాటు ఆత్మీయతను పంచుతున్నారు



'మనం సైతం' కార్యక్రమంలో ఓ అభాగ్యునికి చెక్‌ను అందజేస్తున్న రామ్మోహన్ రావు. చిత్రంలో శ్వేతా లక్ష్మారెడ్డి, కాదంబరి కిరణ్, దశరథ్.

వరుసగా సేవా కార్యక్రమాలను నిర్వహిస్తూ పేదల పక్షాన సేవా సమరం చేస్తోంది 'మనం సైతం'. ప్రముఖ నటులు కాదంబరి కిరణ్ ఆధ్వర్యంలో నడుస్తున్న ఈ సేవా సంస్థ క్రమం తప్పకుండా అవసరార్థులకు ఆర్థిక సహాయం అందిస్తోంది. వివిధ సమస్యల్లో చిక్కుకున్న పేదలను 'మనం సైతం' సభ్యులు ఆదుకుంటూ మానవతను చాటుతున్నారు. ఈ నేపథ్యంలో హైదరాబాద్‌లోని ఫిలింఛాంబర్‌లో జరిగిన కార్యక్రమంలో పది మంది పేదలకు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ వైద్య ఆరోగ్య శాఖ మంత్రి లక్ష్మారెడ్డి సతీమణి శ్వేతా లక్ష్మారెడ్డి, తెలంగాణ ఎఫ్‌డిసి ఛైర్మన్ రామ్మోహన్ రావు, దర్శకులు దశరథ్, న్యూస్ రీడర్ దీప్తి వాజ్‌పేయి, పాత్రికేయులు సాయి, 'మనం సైతం' సభ్యులు బందరు బాబీ, అనిల్ కుమార్, వినోద్ బాలా, సురేష్, కవిత తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పేదలకు చెక్కులను అందజేశారు. అనంతరం కాదంబరి కిరణ్ మాట్లాడుతూ "చిత్ర పరిశ్రమలో సుదీర్ఘ అనుభవాన్ని చూశాను. టివి కార్యక్రమాల నిర్వహణలో ఆర్థికంగా నష్టపోయాను. నా పక్కన నిలబడతారని అనుకున్న కొందరు అవసరమైన సమయంలో దూరంగా వెళ్లారు. వీళ్లందరితో నేను ఎదుర్కొన్న చేదు అనుభవాలను పుస్తకంగా రాద్దామనుకున్నాను. కానీ అలా చేస్తే అంత మందికి దూరం కావాల్సి ఉంటుంది. మరోవైపు చూస్తే లక్షలాది మంది సాయం కోసం ఎదురుచూస్తున్నారు. నేను ఎదుర్కొన్న బాధల కోపం, కసి, ప్రతీకారం, ఆవేదనకు మరో కోణంలో మొదలైందే 'మనం సైతం'. నేను చేస్తున్నది కొద్దిపాటి సాయమైనా పేదలకు ధైర్యాన్ని అందిస్తున్నాం. మేము అందిస్తున్న సాయానికి ఎన్నో రెట్లు దీవెనలు పొందుతున్నాం. ఈసారి పది మంది పేదలకు అతిథుల చేతుల మీదుగా చెక్కులను అందిస్తున్నాం. మా బృందం ఏడుగురితో మొదలైన 'మనం సైతం' సంస్థలో ఇప్పుడు లక్షా డెబ్బై వేల మంది సభ్యులు ఉన్నారు"అని అన్నారు. ఎఫ్‌డిసి ఛైర్మన్ రామ్మోహన్ రావు మాట్లాడుతూ "ఇంత గొప్ప సేవా కార్యక్రమాలు చేస్తున్న కాదంబరి కిరణ్‌కు అభినందనలు. పేదలకు డబ్బులు ఇవ్వడమే కాదు ఆత్మీయతను పంచుతున్నారు. అవసరం ఉన్న వాళ్ల ఇంటికి వెళ్లి పరామర్శించి ఆదుకుంటున్నారు. ఇక చిత్ర పరిశ్రమలోని కొన్ని విభాగాల కార్మికులకు ఆరోగ్య భీమా సౌకర్యం లేదు. అలాంటి శాఖల కార్మికులకు తెలంగాణ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ నుంచి సగం ఖర్చు మినహాయింపుతో ఆరోగ్య భీమా అందజేస్తామని ఈ సందర్భంగా చెబుతున్నాను. అలాగే చిత్రపురి కాలనీలో ఒక వైద్యశాల నిర్మించే ప్రయత్నం చేస్తున్నాం. పేద సినీ కార్మికులకు వైద్యం అందజేసేందుకు కృషి చేస్తాం"అని తెలిపారు. శ్వేతా లక్ష్మారెడ్డి మాట్లాడుతూ "ఈ కార్యక్రమానికి వచ్చాన మానవత్వం ఇంకా మిగిలి ఉందని అనిపిస్తోంది. ప్రభుత్వం వైద్య సేవలు అందిస్తున్నా అందరికీ చేరువ కావడం కష్టం. అలాంటి సందర్భంలో 'మనం సైతం' లాంటి సంస్థల అవసరం ఎంతైనా ఉంది"అని పేర్కొన్నారు.

50 రోజులు పూర్తి చేసుకోవడం అసాధారణ విషయం



'హుషారు' 50 రోజుల వేడుకలో ప్రియా వడ్లమానికి షీల్డును అందజేస్తున్న దిల్‌రాజు. చిత్రంలో బెక్కెం వేణుగోపాల్ తదితరులు.

బెక్కెం వేణుగోపాల్, రియాజ్ నిర్మాతలుగా రూపొందిన చిత్రం 'హుషారు'. శ్రీహర్ష కొనుగంటి దర్శకత్వంలో తేజస్ కంచర్ల, తేజ్ కూరపాటి, అభినవ్ మంచు, దినేష్ తేజ్, దక్ష నగార్కర్, ప్రియా వడ్లమాని, హేమ ఇంగ్లే ప్రధాన తారాగణంగా రూపొందిన ఈ సినిమా డిసెంబర్ 14న విడుదలై 50 రోజులను పూర్తిచేసుకుంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లోని ప్రసాద్‌ల్యాబ్స్‌లో '50 డేస్' ఫంక్షన్ నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్మాత బెక్కెం వేణుగోపాల్ మాట్లాడుతూ "సినిమా ఇంత పెద్ద విజయాన్ని సాధిస్తుందని నేను ఊహించలేదు. ఈ సినిమా కోసం అందరం ఏడాదిన్నర పాటు కష్టపడ్డాం. నాకు పెద్ద హిట్‌ను ఇచ్చిన చిత్రమిది"అని అన్నారు. దిల్‌రాజు మాట్లాడుతూ "ఫస్ట్ సాంగ్ రిలీజ్ రోజునే సినిమా బాగుందని చెప్పాను. నిజంగానే సినిమాను ప్రేక్షకులు ఆదరించారు. ఈరోజుల్లో సినిమా ఆడేదే కష్టం. అలాంటిది 50 రోజులు పూర్తి చేసుకోవడం అంటే అసాధారణ విషయం. చిత్ర బృందానికి అభినందనలు"అని తెలిపారు. శ్రీహర్ష కొనుగంటి మాట్లాడుతూ "ప్రేక్షకులు ఈ సినిమాను ఎంతగానో ఆదరించారు. ఈ చిత్ర విజయం నాకెంతో ఆనందాన్నిచ్చింది"అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తేజ్ కొర్రపాటి, దినేష్, తేజస్ కంచర్ల, ప్రియ వడ్లమాని తదితరులు పాల్గొన్నారు.



ఆ యంగ్ హీరోతో మరోసారి...

యంగ్ హీరో బెల్లంకొండ శ్రీనివాస్ జోరు మామూలుగా లేదు. తన కెరీర్‌లో ఇప్పటివరకు ఒక్క హిట్ కూడా రాలేదు కానీ వరుసగా అవకాశాలను దక్కించుకుంటున్నాడు. ప్రస్తుతం ఈ యువ హీరో తేజ దర్శకత్వంలో 'సీత' సినిమాలో నటిస్తున్నాడు. ఈ సినిమా తర్వాత 'ఆర్‌ఎక్స్ 100' చిత్రంతో సంచలనం సృష్టించిన అజయ్ భూపతి దర్శకత్వంలో ఒక క్రేజీ ప్రాజెక్ట్ సెట్ చేసుకున్నాడు. ఈ సినిమాను నిర్మించేందుకు ఒక ప్రముఖ నిర్మాణ సంస్థ ముందుకొచ్చిందట. ఈ సినిమాలో హీరోయిన్‌గా సమంతను తీసుకుందామని ప్లాన్ చేస్తున్నారట. ఇప్పటికే ఈ దిశగా చర్చలు సాగుతున్నాయని... సమంత కూడా ఈ సినిమాకు దాదాపుగా గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్టేనని సమాచారం. ఇక

పోలీస్ ఉన్మాదిగా ఎందుకు మారాడు?

ఆపదలో ఉన్న వారికి అభయ హస్తం అందించి... రక్షణ కల్పించే పోలీస్ ఉన్మాదిగా ఎందుకు మారాడు? అలా మారడానికి దారి తీసిన పరిస్థితులేంటి? అనే విషయాలను తెలుసుకోవాలంటే 'ఉన్మాది' సినిమా చూడాల్సిందేనని అంటున్నారు దర్శకుడు ఎన్.ఆర్.రెడ్డి. ప్రవీణ క్రియేషన్స్ ప్రై.లి. పతాకంపై కరణ్ రెడ్డి సమర్పణలో రూపొందుతున్న చిత్రమిది. సెన్సార్ సహా అన్ని కార్యక్రమాలను పూర్తిచేసుకున్న ఈ చిత్రం ఈనెల 8న విడుదల కానుంది. ఈ సందర్భంగా చిత్ర దర్శక నిర్మాత ఎన్.ఆర్.రెడ్డి మాట్లాడుతూ "గ్రామీణ నేపథ్యంలో జరిగే కథ ఇది. సినిమా పూర్తి కమర్షియల్ ఎంటర్‌టైనర్‌గా ఉంటుంది. డేవిడ్ సంగీతాన్ని అందించిన ఈ సినిమా పాటలు, ట్రైలర్‌ను ఇటీవల విడుదల చేశాం. చాలా మంచి స్పందన వచ్చింది. అన్ని కార్యక్రమాలను పూర్తిచేసి ఈనెల 8న విడుదల చేయబోతున్నాం"అని అన్నారు. టైటిల్ పాత్రలో ఎన్.ఆర్.రెడ్డి నటిస్తూ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో అల్లు రమేష్, శివ, శిరీష, నాగిరెడ్డి, రమ్య, ప్రమీల, పుష్పలత, సోను తదితరులు ప్రధాన పాత్రల్లో నటించారు. ఈ చిత్రానికి కెమెరా: దంటు వెంకట్, సంగీతం: డేవిడ్, ఎడిటర్: కె.ఎ.వై.పాపారావు, ఫైట్స్: దేవరాజ్.




శిరీష, ఎన్.ఆర్.రెడ్డి



ర్యాంప్ వాక్‌తో అదరగొట్టింది

'కంచె' బ్యూటీ ప్రగ్యా జైస్వాల్ సామాజిక మాధ్యమాల్లో ఎంత స్పీడ్‌గా ఉంటుందో తెలిసిందే. ఈమధ్య ఆమె జిమ్‌లో ఎక్సర్‌సైజ్‌లను చేస్తున్న ఫిట్‌నెస్ వీడియోలను ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేసింది. ఈ వీడియోలు యూత్‌ను మైమరపించాయి. ఇక ఈ ఏడాది ఎట్టి పరిస్థితుల్లోనూ తన కెరీర్‌ను చక్కదిద్దుకోవడమే ధ్యేయంగా ప్రగ్య తనను తాను ప్రమోట్ చేసుకుంటోంది. ఇన్‌స్టాగ్రామ్‌లో నిరంతరం లేటెస్ట్ ఫొటోలను అప్‌లోడ్ చేస్తోంది. ముంబయ్‌లో జరుగుతున్న లాక్మే ఫ్యాషన్ వీక్‌లో ప్రగ్య బోలెడంత సందడి చేసింది. ఈ ఫ్యాషన్ షోలో పలువురు నార్త్, సౌత్ స్టార్లతో కలిసి ఈ బ్యూటీ ర్యాంప్ వాక్ చేసి అదరగొట్టింది. ఇదే ఫ్యాషన్ వీక్‌లో తాను ధరించిన ఓ డ్రెస్‌ను ప్రగ్య అభిమానులకు పరిచయం చేస్తూ ఓ ఫొటోను ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేసింది. ఇక తన హాట్ ఫొటోలతో ఫిల్మ్‌మేకర్స్ దృష్టిలో పడేందుకు ప్రగ్యా జైస్వాల్ విశ్వ ప్రయత్నాలు చేస్తోంది.

క్రైమ్ థ్రిల్లర్



లేడీ సూపర్‌స్టార్ నయనతార నటించిన తమిళ్ బ్లాక్‌బస్టర్ సినిమా 'ఇమైక్క నోడిగల్'. ఈ చిత్రాన్ని తెలుగులో 'అంజలి సిబిఐ' పేరుతో అనువదిస్తున్నారు. ఆర్.అజయ్ జ్ఞానముత్తు ఈ క్రైమ్ థ్రిల్లర్‌ను తెరకెక్కించారు. నయనతార సిబిఐ ఆఫీసర్‌గా టైటిల్ రోల్‌లో నటించింది. ఈ చిత్రంలో అథర్వ, రాశీఖన్నా కీలక పాత్రల్లో నటించగా బాలీవుడ్ దర్శకుడు అనురాగ్ కశ్యప్ ప్రతినాయకుడిగా నటించారు. ప్రముఖ హీరో విజయ్ సేతుపతి ఇందులో విక్రమాదిత్య అనే అతిథి పాత్రలో నటించారు. నయనతార భర్త పాత్ర ఇది. ఈ చిత్రాన్ని క్యామియో ఫిల్మ్స్ బ్యానర్ సంస్థలో సిజె జయకుమార్ నిర్మించారు. హిప్ హాప్ తమిళన్ ఈ చిత్రాన్ని సంగీతాన్ని అందించగా ఆర్.డి.రాజశేఖర్ సినిమాటోగ్రఫీ అందించారు. విశ్వశాంతి క్రియేషన్స్ బ్యానర్‌పై ఈ చిత్రం తెలుగులో విడుదల కానుంది. నిర్మాతలు సిహెచ్ రాంబాబు, ఆచంట గోపీనాథ్‌లు ఈ చిత్రాన్ని ఈనెల 22న విడుదల చేయనున్నారు.



బోల్డ్ లుక్‌తో మురిపిస్తోంది

గాయని, నటీమణి ఆండ్రియా గురించి ప్రత్యేకించి పరిచయం చేయాల్సిన అవసరం లేదు. 'యుగానికి ఒక్కడు' చిత్రంలో కార్తీ సరసన బోల్డ్ పర్ఫార్మెన్స్‌తో అలరించింది ఈ బ్యూటీ. తన తొలి సినిమాతోనే అందరినీ ఆకట్టుకుంది ఆండ్రియా. తొలి సినిమా దర్శకుడు సెల్వ రాఘవన్‌తో ఎఫైర్ సాగించిందన్న టాక్ కూడా వినిపించింది. ఆతర్వాత నటించిన ఎన్నో మసాలా సినిమాలు టాలీవుడ్‌లో కూడా విడుదలయ్యాయి. అయితే ఆమె ఇంతవరకు స్టార్‌డమ్‌ను అందుకోలేకపోయింది. ఇటీవలే కమల్‌హాసన్ సరసన 'విశ్వరూపం 2' చిత్రంలో కనిపించి అలరించింది ఈ భామ. ధనుష్ సరసన 'వడ చెన్నయ్' అనే చిత్రంలోనూ ఆండ్రియా నటించింది. గత ఏడాది విడుదలైన ఈ చిత్రం పర్వాలేదనిపించింది. అలాగే 'కా' అనే థ్రిల్లర్ మూవీలో ప్రస్తుతం ఈ బ్యూటీ నటిస్తోంది. ఇక సామాజిక మాధ్యమాల్లో ఆండ్రియా తన హాట్ ఫొటోలతో సందడి చేస్తోంది. బోల్డ్ లుక్‌తో యూత్‌ను మురిపిస్తోంది.

69,000 కోట్ల డివిడెండ్

• వచ్చే ఆర్థిక సంవత్సరంలో ఆర్‌బిఐ నుంచి ఆశిస్తున్న ప్రభుత్వం

న్యూఢిల్లీ : వచ్చే ఆర్థిక సంవత్సరం(2019-20)లో ఆర్‌బిఐ నుంచి రూ.69 వేల కోట్ల డివిడెండ్‌ను ప్రభుత్వం ఆశిస్తోందని సమాచారం. ఆర్‌బిఐ నుంచి డివిడెండ్ రూపంలో పెద్ద మొత్తాన్ని ప్రభుత్వం ఆశిస్తోందని ఈమేరకు ఆర్థిక మంత్రిత్వశాఖకు చెందిన సీనియర్ అధికారి ఒకరు మీడియాతో తెలిపారు. తాత్కాలిక ఆర్థిక మంత్రి పీయూష్ గోయల్ గతవారం పార్లమెంట్‌లో బడ్జెట్-2019ను ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా వచ్చే ఆర్థిక సంవత్సరం నుంచి బ్యాంకులు,ఆర్థికసంస్థలు,ఆర్‌బిఐనుంచి రూ.82,911 కోట్ల డివిడెండ్‌ను అంచనా వేస్తున్నామని గోయల్ అన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి తాత్కాలిక డివిడెండ్‌గా రూ.28 వేల కోట్లను ఇచ్చేందుకు ఆర్‌బిఐ సెంట్రల్ బోర్డు ఆమోదం తెలిపినట్లయితే.. 2018-19లో మొత్తం మిగులు నిధుల బదిలీ రూ.68,000 కోట్ల కు చేరుతుంది. ఇప్పటికే ఆర్‌బిఐ రూ.40 వేల కోట్లను ప్రభుత్వానికి బదిలీ చేసింది. ఆర్‌బిఐ డివిడెండ్‌తో పాటు వివిధ వనరుల నుంచి వచ్చే వసూళ్లతో ప్రభుత్వం ద్రవ్య లోటు లక్ష్యాన్ని చేరుకునేందుకు దోహదపడుతుంది. తాత్కాలిక బడ్జెట్‌లో ప్రభుత్వం 2019-20 ఆర్థిక సంవత్సరానికి గాను ద్రవ్య లోటు లక్ష్యం 3.4 శాతంగా అంచనా వేసింది. ద్రవ్యలోటును తగ్గించేందుకు ప్రభు త్వం కూ డా రోడ్‌మ్యాప్‌ను సిద్ధం చేసింది. జిడిపి(స్థూల దేశీయోత్పత్తి)లో మొత్తం వ్యయం, ఆదాయం మధ్య లోటును 2020-21 నాటికి 3 శాతానికి తగ్గించేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోంది.



సమావేశమైన ఆర్‌బిఐ ఎంపిసి


ఆర్‌బిఐ ద్రవ్యవిధాన కమిటీ(ఎంపిసి) మూడు రోజుల సమావేశం మంగళవారం ప్రారంభమైంది. కీలక వడ్డీ రేట్లపై ఈ సమావేశంలో నిర్ణయం తీసుకోనున్నారు. ద్రవ్యోల్బణం దిగివచ్చినప్పటికీ ఆర్థిక సవాళ్లు, క్రూడ్ ఆయిల్ ధరలు పెరిగిన కారణంగా ఈవారంలో ఆర్‌బిఐ వడ్డీ రేట్లను యథాతథంగానే కొనసాగించవచ్చని నిపుణులు భావిస్తున్నారు. మరోవైపు ఆర్‌బిఐ వడ్డీ రేటులో 25 బేసిస్ పాయింట్ల మేర కోత విధించే అవకాశాలు ఉన్నాయని ఎస్‌బిఐ నివేదిక అంచనా వేసింది. ద్రవ్యోల్బణం తగ్గుముఖం పట్ట డం, ఇతర అంశాలు సానుకూలంగా ఉండడం వల్ల రేటులో కోత ఉండవచ్చని చెప్పింది. ఆర్‌బిఐ గవర్నర్ శక్తికాంతదాస్ నేతృత్వంలోని ఆరుగురు సభ్యులు ద్రవ్య విధాన కమిటీ (ఎంపిసి) ముంబైలో ఫిబ్రవరి 7న సమీక్ష వివరాలను ప్రకటించనుంది. గత సమీక్షలో రిజర్వు బ్యాంక్ రేట్లను యథాతథంగానే కొనసాగించింది. దీంతో ప్రస్తుతం రెపో 6.25 శాతంగా అమలవుతోంది. రివర్స్ రెపో 6.25 శాతం వద్ద కొనసాగుతోంది. ఎంఎస్‌ఎఫ్, బ్యాంక్ రేటు 6.75 శాతంగా ఉంది. కాగా గురువారం ఉదయం 11.45 గంటలకు ఆర్‌బిఐ నిర్ణయాలను ప్రకటిస్తుందని రిజర్వు బ్యాంక్ వెబ్‌సైట్‌లో పేర్కొంది.

యాక్సిస్, యుకో, సిండికేట్ బ్యాంకులపై జరిమానా

మూడు బ్యాంకులపై రిజర్వు బ్యాంక్ జరిమానా విధించింది. రెండు వేర్వేరు కేసుల్లో ప్రైవేటు దిగ్గజం యాక్సిస్ బ్యాంక్‌పై రూ.2.2 కోట్ల జరిమానా విధించినట్టు ఆర్‌బిఐ(భారతీయ రిజర్వు బ్యాంక్) ప్రకటించింది. యుకో బ్యాంక్‌పైనా రూ.2 కోట్ల జరిమానా విధించామని, అలాగే నిబంధనలు ఉల్లంఘించినందుకు గాను సిండికేట్ బ్యాంక్‌పై రూ.1 కోటి జరిమానా విధించామని కోర్టు వెల్లడించింది. చెక్కుల ద్వారా చెల్లింపులకు సంబంధించిన నిబంధనలను పాటించనందుకు గాను యాక్సిస్ బ్యాంక్, యుకో బ్యాంక్‌లపై ఆర్‌బిఐ రూ.2 కోట్ల చొప్పున జరిమానా విధించింది. మరో కేసులో నకిలీ నోట్ల గుర్తింపు, వాటికి సంబంధించిన ఆదేశాలకు విరుద్ధంగా నడచుకున్నందుకు గాను యాక్సిస్ బ్యాంక్ రూ.20 లక్షల జరిమానా వేశామని రిజర్వు బ్యాంక్ వివరించింది.

ఎయిర్‌టెల్ రేటింగ్‌ను తగ్గించిన మూడీస్

న్యూఢిల్లీ: రిలయన్స్ జియో రాకతో టెలికామ్ రంగంలో రారాజుగా వెలుగొందుతున్న భారతీ ఎయిర్‌టెల్ మరింత డీలాపడుతోంది. తాజాగా ఎయిర్‌టెల్‌కు మరో షాక్ తగిలింది. అంతర్జాతీయ రేటింగ్ సంస్థ మూడీస్ ఎయిర్‌టెల్‌కు డౌన్‌గ్రేడ్ రేటింగ్‌ను ఇచ్చింది. మూడీస్ ఇన్వెస్టర్ సర్వీస్ బిఎ3 నుంచి బిఎ1కు సవరించింది. నాన్ ఇన్వెస్ట్‌మెంట్ రేటింగ్ బిఎ1 ఇవ్వడం ద్వారా సంస్థ ఔట్‌లుక్‌ను ప్రతికూలంగా ప్రకటించింది. దీంతో మార్కెట్లో అమ్మకాల వెల్లువెత్తాయి. ఆఖరికి కోలుకుంది. క్యూ3 లాభాల్లో భారీ క్షీణతను నమోదు చేసిన ఎయిర్‌టెల్‌కు మూడీస్ సంస్థ నుంచి భారీ షాక్ తగిలింది.



తీవ్ర ఒడిదుడుకులు



ముంబై: తీవ్ర ఒడిదుడుకుల మధ్య మంగళవారం స్టాక్ మార్కెట్లు స్వల్ప లాభాలతో ముగిశాయి. సెన్సెక్స్ 34 పాయింట్ల లాభంతో 36,617వద్ద ముగిసింది. ఇక నిఫ్టీ 22 పాయింట్ల లాభంతో 10,934 వద్ద స్థిరపడింది. ఆటోమొబైల్‌సూచీ అత్యధికంగా లాభపడింది. హీరోమోటో కార్ప్, బజాజ్ ఆటో, మారుతీ సుజుకీ వంటి సంస్థల షేర్లు లాభపడ్డాయి. ఫలితాలు ఆశాజనకంగా ఉండటంతో పంజాబ్ నేషనల్ బ్యాంక్ లాభపడింది.

మాల్యా ఆస్తుల పునరుద్ధరణకు ఎలాంటి అభ్యంతరం లేదు

• బ్యాంకుల కన్సార్టియం పిటిషన్‌కు బదులిచ్చిన ఇడి



న్యూఢిల్లీ : విదేశాలకు పారిపోయిన పారిశ్రామికవేత్త విజయ్ మాల్యా ఆస్తుల పునరుద్ధరణకు ఎలాంటి అభ్యంతరం లేదని ఇడి(ఎన్‌ఫోర్స్‌మెం ట్ డైరెక్టరేట్) మంగళవారం ప్రత్యేక కోర్టుకు తెలియజేసింది. బ్యాంకుల కన్సార్టియం దాఖలు చేసిన పిటిషన్‌కు కేంద్ర దర్యాప్తు సంస్థ ఇడి ఈ విధంగా స్పందించింది. బ్యాంకుల కన్సార్టియం.. మాల్యా ఆస్తుల పునరుద్ధరణ చేపడితే తమకెలాంటి అభ్యంతరం లేదని, అయితే బ్యాంకులు భవిష్యత్‌లో ఆ నగదును కోర్టుకు తిరిగి ఇవ్వాలని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ పేర్కొంది. రూ.9,000 కోట్ల రుణం మోసం కేసులో నిందితుడు మాల్యాకు చెందిన ఆస్తుల పునరుద్ధరణ కోరుతూ ఎస్‌బిఐ(స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా)ఆధ్వర్యంలోని బ్యాంకుల కన్సార్టియడం కోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. కన్సార్టియం ప్రకారం, రూ.6200 కోట్లుగా బ్యాంకులు పేర్కొన్నాయి. కన్సార్టియడం అభ్యర్థనపై సరైన తీర్పును కోర్టుకే వదిలేస్తున్నామని పిఎంఎల్‌ఎ జడ్జి ఎం.ఎస్.అజ్మి ఎదుట దాఖలు చేసినఅఫిడవిట్‌లోఇడి పేర్కొంది.

అప్పీలుకు సిద్ధమైన మాల్యా

రూ.9000 కోట్ల రుణ మోసం కేసులో మాల్యాను భారత్‌కు అప్పగించేందుకు బ్రిటన్ ప్రభుత్వం అంగీకరించడంపై పారిశ్రామికవేత్త విజయ్ మాల్యా అప్పీలుకు సిద్ధమయ్యారు. మాల్యాను భారత్‌కు అప్పగించేందుకు ఆమోదం తెలుపుతూ బ్రిటన్ సోమవారం కీలక నిర్ణయం తీసుకుంది. మాల్యా అప్పగింత ఉత్తర్వుల ఫైలుపై బ్రిటన్ హోం శాఖమంత్రి సాజిద్ జావీద్ సంతకాలు చేశారు. బ్రిటన్ ప్రభుత్వ నిర్ణయంపై హైకోర్టులో అప్పీల్ చేస్తానని మాల్యా ట్వీట్టర్‌లో పేర్కొన్నారు. రెండు వారాల్లో విజయ్ మాల్య అప్పీల్ చేయాల్సి ఉంటుంది. ఒకవేళ బ్రిటన్ హైకోర్టులో ఓడిపోతే సుప్రీంకోర్టును కూడా ఆశ్రయించేందుకు వెసులుబాటు ఉంది. అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకున్న తర్వాతే మాల్యాను భారత్‌కు అప్పగించేందుకు బ్రిటన్ హోంమంత్రి ఆమోదం తెలిపారని హోంశాఖ ధ్రువీకరించింది. సుమారు రూ.9 వేల కోట్ల మేర బ్యాంకులను మోసగించి మాల్యా బ్రిటన్‌కు పారిపోయిన సంగతి తెలిసిం దే. నాటి నుంచి ఆయన్ను భారత్‌కు రప్పించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తూనే ఉన్నది.

దలాల్ స్ట్రీట్‌ను ఆశ్చర్యపరచిన పిఎన్‌బి

క్యూ3లో సంస్థ లాభం 7.12 శాతం పెరిగింది



న్యూఢిల్లీ : ప్రభుత్వరంగ పంజాబ్ నేషనల్ బ్యాంక్(పిఎన్‌బి) క్యూ3(అక్టోబర్-డిసెంబర్) ఫలితాల్లో ఆశించిన దానికంటే మెరుగైన ఫలితాలను నమోదు చేసింది. డిసెంబర్ 31 ముగింపు నాటి క్యూ3 ఫలితాల్లో పిఎన్‌బి నికర లాభం రూ.246.51 కోట్లతో 7.12 శాతం వృద్ధిని సాధించింది. ప్రోత్సాహకర ఫలితాలతో ఇన్వెస్టర్లు కొనుగోళ్లకు ఆసక్తి చూపారు. దీంతో పిఎన్‌బి షేరు 0.34 శాతం పెరిగి రూ. 73.40 వద్ద స్థిరపడింది. బ్యాంక్ నికర వడ్డీ ఆదాయం (ఎన్‌ఐఐ) 7.6 శాతం పెరిగి రూ. 4,290 కోట్లను తాకింది. రూ. 2754 కోట్లమేర ప్రొవిజన్లు చేపట్టగా, గతేడాదితో పోలిస్తే 38.35 శాతం తగ్గాయి. స్థూల మొండి బకాయిలు(ఎన్‌పిఎలు) 17.16 శాతం నుంచి 16.33 శాతానికి తగ్గాయి. నికర ఎన్‌పిఎలు కూడా 8.9 శాతం నుంచి 8.22 శాతానికి దిగివచ్చాయి. ఐబిసి ఖాతాల నుంచి రూ. 163 కోట్ల ప్రొవిజన్లను రైట్‌బ్యాక్ చేపట్టింది. నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్‌లో పిఎన్‌బి షేరు రూ.73.80ల వద్ద ట్రేడింగ్‌ను ప్రారంభించింది. మెరుగైన క్యూ3 ఫలితాలతో షేరు ఇంట్రాడేలో 5% ర్యాలీ చేసి రూ.76.50కు చేరింది. చివరకు స్వల్పలాభంతో రూ.73.40 వద్ద ముగిసింది. షేరు ఏడాది కనిష్ట, గరిష్ట ధరలు వరుసగా రూ.58.65 రూ.166లుగా ఉన్నాయి.

25 శాతం పెరిగిన బిహెచ్‌ఇఎల్ లాభం

న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ దిగ్గజం బిహెచ్‌ఇఎల్ మూడో త్రైమాసిక ఫలితాల్లో రాణించింది. క్యూ3(అక్టోబర్-డిసెంబర్)లో సంస్థ నికర లాభం 25 శాతం ఎగసి రూ. 192 కోట్లు నమోదు చేసింది. గతేడాది ఇదే సమయంలో సంస్థ లాభం రూ.153 కోట్లుగా ఉంది. బిహెచ్‌ఇఎల్ మొత్తం ఆదాయం 10 శాతం పుంజుకుని రూ.7,336 కోట్లను అధిగమించింది. నిర్వహణ లాభం(ఇబిటా) మాత్రం 18 శాతం తగ్గి రూ. 219 కోట్లకు చేరింది. ప్రోత్సాహకర ఫలితాలు సాధించినప్పటికీ విద్యుత్ పరికరాల ప్రభుత్వ రంగ దిగ్గజం బిహెచ్‌ఇఎల్ కౌంటర్లో అమ్మకాలు వెల్లువెత్తాయి. నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్‌లో బిహెచ్‌ఇఎల్ షేరు 9 శాతం నష్టపోయి 58.90 వద్ద ముగిసింది.

టాప్ గెయినర్స్ (+)

కంపెనీ పేరు	గరిష్టం	కనిష్టం	ముగింపు ధర	క్రితం ముగింపు	మార్పు	లాభం%
జీ ఎంటర్‌టైయిన్	369.90	341.05	365.35	347.75	17.60	5.06
టైటాన్ కంపెనీ	1,074.00	1,020.00	1,066.70	1,025.75	40.95	3.99
యుపిఎల్	800.00	772.85	795.95	770.90	25.05	3.25
డా. రెడ్డీస్ ల్యాబ్	2,859.85	2,773.00	2,821.45	2,735.20	86.25	3.15
హీరో మోటోకార్ప్	2,873.35	2,800.00	2,854.55	2,780.15	74.40	2.68
బజాజ్ ఆటో	2,720.00	2,645.00	2,710.65	2,642.50	68.15	2.58
ఇండస్ఇండ్ బ్యాంకు	1,557.15	1,498.05	1,541.75	1,504.65	37.10	2.47
ఐచర్ మోటర్స్	20,584.90	20,160.00	20,479.65	20,128.30	351.35	1.75
ఎం అండ్ ఎం	692.60	672.65	684.90	674.45	10.45	1.55
మారుతీ సుజుకి	7,125.00	6,985.40	7,093.60	6,988.20	105.40	1.51

టాప్ లూజర్స్ (-)

కంపెనీ పేరు	గరిష్టం	కనిష్టం	ముగింపు ధర	క్రితం ముగింపు	మార్పు	నష్టం%
కోల్ ఇండియా	223.40	215.70	216.40	222.10	5.70	2.57
టాటా మోటర్స్	181.15	174.70	175.80	180.25	4.45	2.47
టాటా స్టీల్	477.00	459.45	464.70	476.05	11.35	2.38
ఒఎన్‌జిసి	148.20	142.30	142.95	146.25	3.30	2.26
భారతీ ఎయిర్‌టెల్	295.00	286.45	288.90	295.05	6.15	2.08
యస్ బ్యాంక్	183.50	175.00	176.10	179.80	3.70	2.06
ఐఒసి	136.20	133.30	133.75	135.90	2.15	1.58
సన్‌ఫార్మా	418.50	406.55	409.90	414.80	4.90	1.18
ఐటిసి	277.80	272.50	274.15	277.10	2.95	1.06
ఇండియాబుల్స్	662.70	630.25	645.40	650.75	5.35	0.82



ఎల్‌ఐసి ఆధ్వర్యంలో క్యాన్సర్ అవగాహన వాక్

మనతెలంగాణ/హైదరాబాద్ : ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా ఎల్‌ఐసి, హైదరాబాద్ జోనల్ ఆఫీస్ క్యాన్సర్ అవగాహన వాక్ నిర్వహించింది. స్వస్తవ క్యాన్సర్ కేర్, రోటరీస్ సభ్యులతో కలిసి నిర్వహించిన ఈ వాక్‌లో ఎల్‌ఐసి ఉద్యోగులు, అధికారులు, ఎవి కళాశాల విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ వాక్‌లో సుమారు 500 మంది సభ్యులు టీ షర్టులు, క్యాంప్‌లు ధరించి, ప్లకార్డులు, బ్యానర్లతో సాధారణ ప్రజలకు క్యాన్సర్‌పై అవగాహన కల్పించారు. ఎల్‌ఐసి మార్కెటింగ్ రీజనల్ మేనేజర్ ఎం.జగన్నాథ్ క్యాన్సర్ అవగాహన వాక్‌ను ప్రారంభించి మాట్లాడారు. ఎల్‌ఐసి ప్రవేశపెట్టిన క్యాన్సర్ కవర్ పాలసీ క్యాన్సర్ చికిత్సకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఈ ప్లాన్ కింద అర్హులైన ప్రతి ఒక్కరూ రూ.50 లక్షల వరకు పాలసీ తీసుకోవచ్చని పేర్కొన్నారు. ఎల్‌ఐసి హెల్త్ ఇన్సూరెన్స్ రీజనల్ మేనేజర్ వి.సతీష్ కుమార్ మాట్లాడుతూ, తమ క్యాన్సర్ కవర్ పాలసీ విశేష స్పందన లభిస్తుందన్నారు. దేశవ్యాప్తంగా రెండు లక్షల మందికిపైగా ఇప్పటికే ఈ పాలసీని తీసుకున్నారని పేర్కొన్నారు. తమ జోన్ కూడా క్యాన్సర్ కవర్ పాలసీకి మంచి స్పందన ఉందని చెప్పారు. ఇప్పటికే పలు క్యాన్సర్ కవర్ క్లెయిమ్ సెటిల్ చేశామని అన్నారు.

మోర్గాన్ నివేదికను కొట్టిపారేసిన ఫ్లిప్‌కార్ట్ సిఇఒ

న్యూఢిల్లీ : కొత్త ఇ-కామర్స్ నిబంధనలు ప్రతికూల ప్రభావం చూపితే ఫ్లిప్‌కార్ట్‌లో పెట్టుబడుల నుంచి వాల్‌మార్ట్ వైదొలిగే అవకాశముందని మోర్గాన్ స్టాన్లీ చేసిన వ్యాఖ్యలపై ఇ-కామర్స్ దిగ్గజం ఫ్లిప్‌కార్ట్ తోసిపుచ్చింది. ఈ వార్తలు నిరాధారమైనవని, వాల్‌మార్ట్ భారత్ మార్కెట్‌పై విశ్వాసంతో ఉందని ఫ్లిప్‌కార్ట్ సిఇఒ కళ్యాన్ కృష్ణమూర్తి పేర్కొన్నారు. భారత్‌లో లాభాలు రాకపోతే వాల్‌మార్ట్ సంస్థ వెంటనే వైదొలగాలని వాల్‌మార్ట్‌కు ప్రముఖ ఫైనాన్షియల్‌సర్వీసెస్ సంస్థ మోర్గాన్‌స్టాన్లీ సూచించిందని వార్తలు వెలువడ్డాయి. ఫిబ్రవరి నుంచి కొత్తగా అమల్లోకి వచ్చిన ఇ-కామర్స్ నిబంధనలు వ్యాపారానికి కష్టంగా మారాయి. దీంతో ఫ్లిప్‌కార్ట్‌లో లాభాల్లో అనిశ్చిత నేపథ్యంలో మోర్గాన్ ఈ విధంగా పేర్కొన్నట్టు తెలిసింది. అయితే ఈ వార్తలను ఫ్లిప్‌కార్ట్ కొట్టిపారేసింది. 2017 మేలో వాల్‌మార్ట్ కంపెనీ 16 బిలియన్ డాలర్లను వెచ్చించి ఫ్లిప్‌కార్ట్‌లో 77% వాటా కొనుగోలు చేసింది. ఈ డీల్‌తో వాల్‌మార్ట్ భారతీయ మార్కెట్లో నేరుగా అమెజాన్‌తో తలపడినట్లైంది. కొత్తగా అమల్లోకి వచ్చిన నిబంధనలకు అనుగుణంగా తన వ్యూహాన్ని మార్చుకొని వాల్‌మార్ట్ భారత్‌లో కొనసాగుతుందని పేర్కొంది. కొత్త నిబంధనలు ఫ్లిప్‌కార్ట్, అమెజాన్‌లను విక్రయాలను దెబ్బతీస్తాయని అంచనా వేస్తున్నారు.


స్టాక్ మార్కెట్

ఈ రోజు మార్కెట్ ముగింపు		మార్పు	%
సెన్సెక్స్	36,616.81	34.07	(0.09%)
నిఫ్టీ	10,934.35	22.10	(0.20%)

కరెన్సీ మారక రేట్లు

అమెరికన్ డాలర్	71.70
యూరో	82.00
బ్రిటిష్ పౌండ్	93.49
ఆస్ట్రేలియన్ డాలర్	51.67
కెనెడియన్ డాలర్	54.65
సింగపూర్ డాలర్	53.01
స్విస్ ఫ్రాంక్	71.82
చైనీస్ యువాన్	10.63
మలేషియన్ రింగిట్	17.54
న్యూజిలాండ్ డాలర్	49.39
హాంకాంగ్ డాలర్	9.14
జపనీస్ యెన్	0.65
కువైట్ దినార్	236.44
సౌతాఫ్రికన్ రాండ్	5.34

బులియన్



బంగారం ధర

నగరం	ధర (రూ / 10 గ్రాములు)		
	22 క్యారట్	24 క్యారట్	మార్పు(%)
చెన్నై	31870	34085.56	0.19%
ముంబై	32490	34748.66	0%
ఢిల్లీ	32550	34812.83	0.15%
కోల్‌కతా	32900	35187.17	0.24%
కేరళ	31100	33262.03	0%
బెంగళూరు	31250	33422.46	0%
హైదరాబాద్	31870	34085.56	0.19%
గల్ఫ్	139.78	149.50	0.17%

వెండి ధర (రూ./ కిలో)

చెన్నై	₹ 43848.00
ముంబై	₹ 43848.00
ఢిల్లీ	₹ 43848.00
కోల్‌కతా	₹ 43848.00
హైదరాబాద్	₹ 43848.00





పారిస్ అపార్ట్‌మెంట్‌లో అగ్నిప్రమాదం

పదిమంది మృతి

పారిస్ : ఫ్రాన్స్ రాజధాని పారిస్‌లో భారీ అగ్ని ప్రమాదం జరిగింది. ఎనిమిది అంతస్థుల అపార్ట్‌మెంట్‌లోని పై ఫ్లోర్‌లో అర్ధరాత్రి జరిగిన అగ్ని ప్రమాదంలో పది మంది మృతి చెందినట్లు మంగళవారం అధికారులు తెలిపారు. సౌత్‌వెస్ట్ పారిస్‌లోని 16వ రు ఎర్లాంగర్ జిల్లాలో ఘటన చోటు చేసుకుంది. ఈ ఘటనలో ఆరుగురు అగ్నిమాపక సిబ్బంది సహా 30 మంది గాయపడ్డారు. దుండగులు ఉద్దేశ్యపూర్వకంగానే గృహ దహనానికి పాల్పడినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ ఘటనకు సంబంధించి ఓ మహిళను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. గత కొన్నేళ్లలో జరిగిన భారీ అగ్ని ప్రమాదంగా అధికారులు పేర్కొన్నారు.

చెక్‌పోస్ట్‌పై తాలిబాన్ల దాడి

11 మంది పోలీసుల మృతి

కాబూల్ : అప్ఘానిస్థాన్‌లో ఉగ్రవాదులు చెలరేగి పోయారు. బగ్లాని మర్కాజ్ జిల్లాలోని ఓ చెక్‌పోస్ట్ పై తాలిబాన్లు దాడికి తెగబడడంతో 11 మంది పోలీసులు సహా 21 మంది మృతి చెందారు. మాస్కోలో ప్రభుత్వ అధికారులు మినహా, తాలిబాన్ల ప్రతినిధులు, అఫ్గన్ మాజీ అధ్యక్షుడు హమీద్ కర్జాయ్, ప్రతిపక్ష నేతలు, గిరిజన పెద్దలు సమావేశం జరిపిన రోజునే ఘటన చోటు చేసుకుంది. స్థానిక పోలీసులు లక్ష్యంగా దాడి జరిగినట్లు ఉత్తర బాగ్లా ప్రావిన్షియల్ హెడ్ సఫ్దర్ మోహసిన్ తెలిపారు. సోమవారం రాత్రి చెక్‌పోస్ట్‌పై ఉగ్రవాదులు రెండు గంటల పాటు దాడికి పాల్పడ్డారన్నారు. ఈ ఘటనలో ఐదుగురు పోలీసులు గాయపడ్డారని ఆయన తెలిపారు. పోలీసుల నుంచి ఉగ్రవాదులు ఆయుధాలు, మందుగుండును స్వాధీనం చేసుకున్నారు. ఆలస్యంగా ఘటనా స్థలానికి చేరుకున్న అదనపు భద్రతా బలగాలు ఉగ్రవాదులతో పోరాడి చెక్‌పోస్టును తమ అదుపులోకి తీసుకున్నాయి. అంతకు ముందు రోజు ఉత్తర సమన్‌గన్ ప్రావిన్స్‌లో ఉగ్రవాదులు ప్రభుత్వ అనుకూల మిలిషియాపై దాడి చేయడంతో మహిళ సహా 10 మంది మృతి చెందారు. ఈ రెండు ఘటనలకు తామే పాల్పడినట్లు తాలిబాన్లు మీడియాకు తెలిపారు.

ఉద్ధవ్‌తో ప్రశాంత్ కిశోర్ భేటీ

మంబయి : వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో కలిసి పోటీ చేయాలని నితీశ్ వర్గానికి చెందిన జెడి(యు), శివసేనలు నిర్ణయించాయి. 2014 ఎన్నికల్లో ప్రధాని నరేంద్ర మోడీతో కలిసి ప్రచార వ్యూహాన్ని రూపొందించిన జెడి (యు) ఉపాధ్యక్షుడు ప్రశాంత్ కిశోర్‌తో ఆయన నివాసంలో శివసేన అధ్యక్షుడు ఉద్ధవ్ థాక్రే మంగళవారం సమావేశమయ్యారు. వచ్చే ఎన్నికల్లో కిశోర్‌తో కలిసి శివసేన వ్యూహాన్ని రూపొందించనుంది. ఇతర పార్టీలతో కలిసి శివసేన ప్రచార వ్యూహం రూపొందించడం ఇదే మొదటిసారి. బిజెపి పొత్తుపై స్పష్టత రాకపోవడంతో నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.

అవినీతి అధికారిని కాపాడటంపైనే మమతా ఆసక్తి : యోగి

పురులియా : శారదా కుంభకోణం కేసులో నిందితుడుగా ఆరోపణలు ఎదుర్కొంటున్న అవినీతి అధికారిని కాపాడేందుకు పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ఆసక్తి చూపుతున్నారని ఉత్తర ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యానాథ్ ఆరోపించారు. మంగళవారం బొకారో నుంచి ఆయన రోడ్డు మార్గం ద్వారా పురులియాకు చేరుకుని ఓ ర్యాలీ నుద్దేశించి ప్రసంగించారు. కేంద్ర పథకాలు పేద ప్రజలకు అందకుండా టిఎంసి ప్రభుత్వం అడ్డుకుంటుంటోందని యోగి ఆరోపించారు. ముఖ్యమంత్రి అవినీతి అధికారిని రక్షించడం అప్రజాస్వామికం, రాజ్యాంగ వ్యతిరేకమని ఆయన విమర్శించారు.

టిఎంసి ప్రభుత్వానికి చెంపపెట్టు : స్మృతి



న్యూఢిల్లీ : శారదా చిట్‌ఫండ్ కేసులో కోల్‌కతా పోలీస్ కమిషనర్ రాజీవ్ కుమార్ సిబిఐ దర్యాప్తుకు హాజరు కావాలని మంగళవారం సుప్రీం కోర్టు ఇచ్చిన ఆదేశం మమతాబెనర్జీ ప్రభుత్వానికి చెంప పెట్టు, గట్టి ఎదురు దెబ్బ... అని భారతీయ జనతాపార్టీ మంగళవారం వ్యాఖ్యానించింది. మమతా బెనర్జీ రాజకీయ పోకడలకు ఇది అడ్డుకట్ట వేయడమేనని బిజెపి పేర్కొంది. బిజెపి వైఖరి సరైందేనని సుప్రీం ఆదేశం వల్ల స్పష్టమైందని పార్టీ నాయకురాలు, కేంద్ర మంత్రి స్మృతి ఇరాని చెప్పారు. రాజీవ్‌కుమార్ షిల్లాంగ్ వంటి తటస్థ ప్రదేశంలో సిబిఐ దర్యాప్తునకు హాజరు కావాలనడంచూస్తే పశ్చిమ బెంగాల్‌లో చట్టాలగతి ఎలా ఉందో తేటతెల్లమవుతోందని ఆమె విమర్శించారు. ఇక్కడ విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కేంద్ర మంత్రి... సుప్రీం ఆదేశాన్ని బిజెపి అభినందిస్తోంది. మమతా బెనర్జీ అరాచకత్వానికి, రాజకీయ ఎత్తుగడలకు దీంతో ఫుల్‌స్టాప్ పెట్టినట్టయింది' అన్నారు. ఇరవై లక్షల మంది పెట్టుబడి దారుల డబ్బును దోచుకున్న వారిని కాపాడేందుకే మమతా బెనర్జీ నిరసన పథకాన్ని రూపొందించారు' అని ఇరానీ ఆరోపించారు. సుప్రీంకోర్టు ఆదేశం తమ నైతిక విజయమని మమతా బెనర్జీ వ్యాఖ్యానించడాన్ని కూడా స్మృతి ఇరానీ తప్పుబట్టారు. 'ఇది ఆమె మూర్ఖత్వాన్ని చాటుతోంది. ఆమె ఎలాంటి రాజకీయాలు నడుపుతున్నారో దీన్నిబట్టి తెలుస్తోందన్నారు. కోల్‌కతా పోలీస్ కమిషనర్ రాజీవ్ కుమార్ షిల్లాంగ్, మేఘాలయ వంటి చోట్ల సిబిఐ దర్యాప్తునకు హాజరు కావాలని, అయితే దర్యాప్తు సమయంలో అరెస్ట్ చేయడం వంటి బలవంతపు చర్యలేవీ చేపట్టకూడదని సుప్రీం ఆదేశించింది.

'కనకదుర్గ భర్త ఇంట్లో ఉండొచ్చు'

కేరళ గ్రామీణ న్యాయాలయ తీర్పు

మలప్పురం : శబరిమల అయ్యప్ప ఆలయంలోకి వెళ్లి ప్రార్థనలు చేసిన కనకదుర్గను ఆమె భర్త ఇంట్లో ఉండేందుకు అనుమతించాలని ఒక గ్రామీణ కోర్టు మంగళవారం ఆదేశించింది. గృహ హింస చట్టం కింద కనకదుర్గ దాఖలు చేసిన పిటిషన్ పై గ్రామ న్యాయాలయ (విలేజ్ కోర్ట్)... భర్త ఇంట్లో ఉండేందుకు ఆమెకు హక్కుందని పేర్కొంది. న్యాయాధికారి నిమ్మి కెకె ఈ తీర్పు చెప్పారు. ఫస్ట్ క్లాస్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ కున్న అధికారాలే గ్రామ న్యాయాలయాను నిర్వహించే న్యాయాధికారులకు కూడా ఉంటాయి. జనవరి 2న శబరిమల క్షేత్రంలోని ఆలయంలో ప్రార్థనలు చేసినందుకు కనకదుర్గ ఆమె భర్త, ఇతర బంధువుల నుంచి తీవ్రమైన ప్రతిఘటనను ఎదుర్కొన్నారు. ఇంట్లోకి రావద్దన్నారు. వాళ్లు ఇంటికి తాళం వేసి మరోచోటికి మకాం మార్చారు. దాంతో ఆమె పెరిన్‌థాలమన్న లో ఆశ్రయం పొందాల్సి వచ్చింది.

రూ. 1.98 లక్షల కోట్ల అదనపు వ్యయం

పార్లమెంట్ అనుమతి కోరిన కేంద్రం

న్యూఢిల్లీ : ఈ ఏడాది మార్చి 31తో ముగిసే ఆర్థిక సంవత్సరంలో రూ. 1.98 లక్షల కోట్ల అదనపు వ్యయానికి ప్రభుత్వం మంగళవారం పార్లమెంట్ అనుమతి కోరింది. ఇందుకు సంబంధించిన పత్రాన్ని తాత్కాలిక ఆర్థికమంత్రి పీయూష్ గోయల్ లోక్‌సభ కు దాఖలు చేశారు. నికర నగదు చెల్లింపులు రూ. 51,433 కోట్లు ఉంటాయి. ఇందులో వివిధ మంత్రిత్వశాఖలకు పెంచిన రికవరీలకు చెల్లించాల్సి ఉంటుంది. వ్యవసాయ మంత్రిత్వ శాఖకు రూ 19,481 కోట్లు, రహదారి రవాణా, హైవేస్ మంత్రిత్వశాఖకు రూ 4,840.75 కోట్లు ఇవ్వాల్సి ఉంటుంది. హోం వ్యవహారాల శాఖకు రూ 4,77 కోట్లు కావాలని కూడా ప్రభుత్వం కోరుతోంది. న్యూక్లియర్ పవర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా రుణాలకు రూ. 1,818.71 కోట్లు, ఆహారం, ప్రజాపంపిణీ శాఖకు రూ.2,864 కోట్లు, భారత ఆహార సంస్థకు రూ. 1,000 కోట్లు నికర నగదు చెల్లింపులుంటాయి.

రాష్ట్రంలోని అడవుల నుంచి పూచిక పుల్ల కూడా బయటికి రాకుండా పోలీస్, అటవీ శాఖల అధికారులు అడవులను జల్లెడ పడుతూ స్మగ్లర్లపై విరుచుకు పడుతున్నారు. రాష్ట్రంలోని వరంగల్, ఖమ్మం, జయశంకర్ భూపాలపల్లి, అదిలాబాద్, నాగర్‌కర్నూల్, నల్గొండ తదితర జిల్లాల్లో పోలీస్ అటవీ శాఖలు ఉమ్మడిగా విస్తృత స్థాయిలో దాడులు నిర్వహిస్తున్నారు. రాష్ట్ర సరిహద్దు జిల్లాల్లోని అటవీ ప్రాంతంలో ఉన్న విలువైన టేకు, ఎర్రచందనం లాంటి విలువైన వృక్షాలు గత ప్రభుత్వాల అసమర్ధత, అవినీతి కారణంగా స్మగ్లర్ల గొడ్డలి వేటుకు తరిగిపోగా ప్రస్తుతం పొరుగున ఉన్న మహారాష్ట్ర నుంచి కలప స్మగ్లింగ్ అధికమైంది. ఆ రాష్ట్రంలోని అడవుల్లో నరికిన వృక్షాలను దుంగ-లుగా కోసి గోదావరి నది దాటించి తెలంగాణ రాష్ట్రానికి తరలిస్తున్నారు. ఈ విషయాన్ని పసిగట్టిన అధికారులు నది దాటుతున్న అక్రమ కలపను పట్టుకునేందుకు పూర్తి స్థాయిలో నిఘాపెట్టారు.

మనతెలంగాణ/న్యూస్ నెట్‌వర్క్



అడవికి పోలీస్ కంచె

• పలు జిల్లాల్లో దాడులు • అక్రమ కలప పట్టివేత • సామిల్లుల సీజ్ • పొరుగు రాష్ట్రాల నుంచి కలప స్మగ్లింగ్

జయశంకర్ భూపాలపల్లి జిల్లా పలిమెల మండలం జసర్వాయి పేట అడవులలో పంట చేలలో నిల్వ ఉంచిన 56టేకు దుంగలను స్వాధీనం చేసుకొని ఆరు ట్రాక్టర్లలో రేంజ్ కార్యాలయానికి తరలించారు. విటితో పాటు టేకు దుంగలను చెక్కలుగా కోసే రెండు కర్రకోత మిషన్లను కూడా సీజ్ చేశారు. మంగపేట మండలం బోరు నర్సాపురం గ్రామంలో రెండు రోజుల పాటు దాడులు జరిపి రూ.7లక్షలు విలువ చేసే టేకు దుంగలను స్వాధీనం చేసుకున్నారు. పలిమెల మండల కేంద్రంలో సోమవారం రూ.6లక్షలు విలువ చేసే టేకు దుంగలను అధికాలు సోదాలలో గుర్తించి పట్టుకున్నారు. కన్నాయి గూడెం మండలంలోని బోపతిపురం, సింగారం, గిరిజన గ్రామాల్లో అధికారులు రెండు లక్షలు విలువ చేసే 50 దుంగలను స్వాధీనం చేసుకున్నారు. గోదావరి పరీవాహక ప్రాంతాలైన పలిమెల, కన్నాయి గూడెం, మంగపేట మండలాల్లో స్మగ్లర్లు గోదావరి ఆవలితీరాన గల చతీష్‌ఘడ్, మహారాష్ట్ర , మధ్యప్రదేశ్ రాష్ట్రాల నుంచి కలపను దుంగలుగా కోయించి గోదావరి జలదారులలో తెలంగాణ రాష్ట్ర సరిహద్దు ప్రాంతాలకు తెప్పించి ఇక్కడ విక్రయాలు జరుపుతున్నారు. ఈ స్మగ్లింగ్‌లో ప్రభుత్వంలో కీలక హోదాలో ఉన్నవారు సైతం మద్దతుగా ఉన్నట్లు అనుమానాలు వ్యక్తమౌతున్నాయి. గోదావరి జల దారుల గుండా దుంగల రూపంలో వచ్చిన కలపను సంకేత రేవుల ద్వారా రహస్య ప్రాంతాలకు తరలించి అక్కడున్న సామిల్లుల ద్వారా చెక్కలు కోయించి అడవి నుంచి రహస్య దారుల గుండా పొరుగు జిల్లాలు ఇతర రాష్ట్రాలకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. కాగా మంగపేట మండలంలో ఇటీవల పది లక్షలు విలువ చేసే కలపను స్వాధీనం చేసుకున్నప్పటికి స్మగ్లర్లను అరెస్టు చేయలేకపోయారు.

అదిలాబాద్ జిల్లా నేరేడుగొండ మండలంలోని అటవీ పరిధిలో మంగళవారం అక్రమంగా నిల్వ ఉంచిన 20 దుంగలను ఇచ్చోడ సిఐ ప్రసాద్‌రావు, నేరేడుగొండ ఎస్సై వెంకన్న, ఇంచార్జీ ఎఫ్ఆర్‌వో రవికుమార్ సాయుధ బలగాలతో కలిసి స్వాధీనం చేసుకున్నారు. దిని విలువ లక్ష యాభైవేల వరకు ఉంటుందని తెలిపారు. ఈ సందర్భంగా గ్రామస్థులతో మాట్లాడుతూ కలప స్మగ్లింగ్ చేస్తే పిడియాక్ట్ నమోదు చేస్తామని హెచ్చరించారు.

నాగర్‌కర్నూల్ జిల్లా పరిధిలోని అటవీ ప్రాంత గ్రామాలపై పూర్తి స్థాయి నిఘా ఏర్పాటు చేశారు. సిసి కెమారాలను కూడా వినియోగంలోకి తీసుకురావాలని పోలీస్ శాఖ భావిస్తున్నట్లు చెబుతున్నారు. ఇక్కడి అడవుల్లో చెట్లను నరికే వారి వివరాలను ఇప్పటికే సేకరించారు. నగర్‌కర్నూల్, నల్గొండ జిల్లాలతో పాటు, కర్నూల్, గుంటూర్, ప్రకాశం జిల్లాల సరిహద్దులోని కృష్ణ తీరం వెంట ఉన్న ప్రాంతాలపై ప్రత్యేక దృష్టిని సారించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన వారెవ్వరు తెలంగాణ ప్రాంత అటవీలోకి ప్రవేశించ కూండా నిఘాను పటిష్టం చేస్తున్నారు. నల్లమల అడవీ ప్రాంతంలో విలువైన నల్లమద్ది, గంధపు చెట్లతో పాటు నారవేప, వేప చెట్లు అధికంగా ఉన్నాయి. వీటిని నరకకుండా గట్టి నిఘాను ఏర్పాటు చేస్తున్నారు. భద్రాద్రి కొత్త గూడెం జిల్లా అమండలం పాల్వంచ డివిజన్ శ్వారావ్ పేట రేంజ్ పరిధిలో మంగళవారం అటవీ పోలీస్ శాఖల అధికారులు మెరుపు దాడులు నిర్వహించారు. మండల పరిధిలోని గాండ్ల గూడెం, అనాంతారం గ్రామాల్లో 80మంది సిబ్బందితో దాడులు నిర్వహించి అక్రమంగా నిల్వ ఉంచిన కలపను పట్టుకొని ట్రాక్టర్లపై అటవీ శాఖ కార్యాలయానికి తరలించారు. మంగళవారం నిర్వహించిన దాడుల్లో రూ. 12లక్షల విలువగల కలపను స్వాధీనం చేసుకున్నట్లు డిఎఫ్ఓ రాంబాబు తెలిపారు.

వనపర్తి జిల్లా పెబ్బేరు మండలంలోని పలు గ్రామాల్లోని సామిల్స్ వద్ద సిసి కెమెరాలను ఏర్పాటు చేశారు. జంగల్ బచావో, జంగల్ బడావో అనే నినాదంతో ముద్రించిన కరపత్రాల ద్వారా ప్రచారం నిర్వహించారు.



అదిలాబాద్‌లో..



జయశంకర్ భూపాలపల్లిలో..



అశ్వరావుపేటలో..

యుపి అసెంబ్లీలో రచ్చ

• గవర్నర్ బడ్జెట్ ప్రసంగాన్ని అడ్డుకున్న ప్రతిపక్షం • ప్ల కార్డులు, పోస్టర్ల ప్రదర్శన, పేపర్ బాల్స్ విసిరివేత

లక్నో : ఉత్తరప్రదేశ్ శాసనసభ బడ్జెట్ సమావేశాల మొదటిరోజైన మంగళవారం నాడు సభలో గందరగోళం చెలరేగింది. గవర్నర్ రామ్‌నాయక్ ఉభయసభల నుద్దేశించి ప్రసంగిస్తున్న సమయంలో ప్రతిపక్ష సభ్యులు పోడియం వైపు కాగితపు బంతులు విసిరి నినాదాలు చేశారు. 55 నిముషాలపాటు చేసిన ప్రసంగంలో గవర్నర్ ప్రభుత్వం చేపట్టి అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాల గురించి ప్రముఖంగా పేర్కొన్నారు. అలహాబాద్, ఫైజాబాద్ జిల్లాల పేరు మార్చడం సమంజసమేనన్నారు. 'నా ప్రభుత్వం ఆ జిల్లాల సాంస్కృతిక పేర్లను పునరుద్ధరించింది' అని వ్యాఖ్యానించారు. ఈ సమయంలో సమాజ్‌వాది పార్టీ (ఎస్‌పి), బహుజన్ సమాజ్ పార్టీ (బిఎస్‌పి), కాంగ్రెస్ పార్టీల సభ్యులతో సహా ప్రతిపక్ష సభ్యులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. గవర్నర్ నాయక్ తన ప్రసంగాన్ని ప్రారంభించగానే ...'గవర్నర్ గో బ్యాక్' అని కేకలు వేశారు. ఎస్‌పి సభ్యులు కాగితపు విసిరినా, గవర్నర్ సిబ్బంది వాటిని కార్డ్ బోర్డ్ ఫైల్స్‌తో అడ్డుకోవడంతో ఆయన తన ప్రసంగాన్ని కొనసాగించారు.

ప్ల కార్డుల ప్రదర్శన

ఇలా ఉండగా, ఎస్.పి, బిఎస్‌పి, ఇతర ప్రతిపక్ష సభ్యులు...'కూటమికి భయపడి వారు సిబిఐని, ఇడిని ప్రయోగించారు', 'అబద్ధపు హామీలిచ్చినందుకు సిఎం సిగ్గుపడాలి', 'ఎద్దుల నుంచి పొలాల్ని, దొంగల నుంచి దేశాన్ని రక్షించండి' అనే నినాదాలున్న ప్ల కార్డుల్ని ప్రదర్శించారు. సిబిఐని ఎగతాళి చేస్తూ పోస్టర్లను కూడా చూపించారు. రాష్ట్రంలో పశువులు ప్రమాద పరిస్థితిలో ఉన్నాయని సూచిస్తూ ఆవులు, ఎద్దుల చిహ్నాల్ని కూడా ప్రదర్శించారు.



ఖండించిన సిఎం యోగి

అసెంబ్లీ సెంట్రల్ హాల్ లో యుపి ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ విలేకరులతో మాట్లాడుతూ...ప్రతిపక్ష సభ్యుల తీరును ఖండించారు. 'ఇది అప్రజాస్వామికం, అమర్యాదకరం' అన్నారు. గొడవ జరుగుతున్న సమయంలో కుర్చీ మీద నిలబడిన ఎస్‌పి సభ్యుడు సుభాష్ పాసి కిందపడిపోయి, స్పృహ తప్పడంతో ఆయనను ఆస్పత్రికి తీసుకెళ్లారు.

రెండో రోజూ పార్లమెంటులో సిబిఐ గొడవ

• లోక్‌సభలో అధికార, ప్రతిపక్షాల వాగ్వాదం • కొనసాగని రాజ్యసభ కార్యకలాపాలు



న్యూఢిల్లీ : పార్లమెంటులో రెండో రోజు కూడా సిబిఐ వ్యవహారం కుదిపేసింది. లోక్‌సభలో రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ ప్రాంభం సందర్భంగా ప్రతిపక్షాలు, అధికార పక్షం మధ్య గొడవ కారణంగా పలుమార్లు సభ వాయిదా పడింది. మరోవైపు టిఎంసి,తో పాటుగా ప్రతిపక్షాల సభ్యుల గొడవ కారణంగా రెండో రోజు కూడా రాజ్యసభ ఎలాంటి కార్యకలాపాలు నిర్వహించలేకపోయింది. లోక్‌సభలో బిజెపి సభ్యుడు హుకుం నారాయణ్ దేవ్ యాదవ్ ధన్యవాదాల తీర్మానంపై చర్చను ప్రారంభించగానే టిఎంసి సభ్యులు వెల్‌లోకి దూసుకెళ్లి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేయడం ప్రాంభించారు.ఈ దశలో అవినీతి శక్తులు, సంఘ వ్యతిరేక శక్తులు ప్రధాని మోడీకి వ్యతిరేకంగా ఒక్కటవుతున్నాయని యాదవ్ వ్యాఖ్యానించడంతో ప్రతిపక్ష సభ్యులంతా ఒక్కసారిగా లేచి ఆ వ్యాఖ్యలను రికార్డులనుంచి తొలగించాలని స్పీకర్‌ను డిమాండ్ చేశారు. దీనికి అధికార పక్ష సభ్యులు అభ్యంతరం చెప్పడంతో గొడవ మొదలయింది. ఈ దశలో టిఎంసి సభ్యురాలు అపరూప పొద్దార్, ఎల్‌జెపికి చెందిన వీణాదేవి పరస్పరం దాడి చేసుకునేలా కనిపించడంతో సీనియర్ సభ్యులు సర్దిచెప్పి పరిస్థితిని చక్కదిద్దారు. ఇదంతా చూసిన స్పీకర్ తీవ్ర అసహనం వ్యక్తం చేస్తూ, సభ్యులు సభా మర్యాదలను పాటించాలంటూ సభను పది నిమిషాలు వాయిదా వేశారు. సభ తిరిగి ప్రారంభమైన తర్వాత హుకుందేవ్ తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ పేదలు, అట్టడుగు వర్గాల అభ్యున్నతికి ప్రభుత్వం అమలు చేస్తున్న పలు కార్యక్రమాలను ప్రశంసించారు. అంతేకాక రాబోయే లోక్ సభ ఎన్నికలను మహాభారత యుద్ధంతో పోలుస్తూ అవి మంచికి, చెడుకు మధ్య జరగబోయే పోరని అభివర్ణించారు. ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు పది శాతం రిజర్వేషన్లు కల్పించే దమ్ము మోడీ ప్రభుత్వానికి మాత్రమే ఉందని ఆయన అన్నారు. అనంతరం మాట్లాడిన బిజెపి సభ్యుడు జగదంబికా పాల్ కూడా రైతుల కోసం ప్రభుత్వం ఎన్నో చర్యలు తీసుకొందంటూ, చిన్న, సన్నకారు రైతుల కోసం ఇటీవల ప్రకటించిన పిఎం కిసాన్ పథకాన్ని ప్రస్తావించారు. అనంతరం స్పీకర్ కాంగ్రెస్ నాయకుడు మల్లికార్జున ఖర్గేను మాట్లాడమని కోరగా, సభ ఆర్డర్‌లో లేదని, అందువల్ల చర్చను బుధవారానికి వాయిదా వేయాలని ఆయన కోరారు. దీనిపై స్పీకర్ స్పందిస్తూ బుధవారం సభ సాఫీగా నడుస్తుందన్న గ్యారంటీ ఉందా అని ప్రశ్నించారు. ప్రభుత్వం తప్పులమీద తప్పులు చేస్తుంటే ప్రతిపక్షం మౌనంగా ఎలా ఉంటుందని ఖర్గే అన్నారు. చర్చను బుధవారానికి వాయిదా వేయాలని టిఎంసి పక్ష నాయకుడు సుదీప్ బందోపాధ్యాయ అంటూ, తాము కూడా సహకరిస్తామని చెప్పారు.

ఈ దశలో హోంమంత్రి రాజ్‌నాథ్ సింగ్ జోకచేసుకొని బుధవారం చర్చలో పాల్గొనాలనుకునే వారికి సమయం ఇవ్వాలని, అయితే ఈ రోజు మాట్లాడాలనుకునే వారిని అనుమతించాలని సూచించారు.అయితే ప్రతిపక్షాలు సభ కొనసాగడానికి అభ్యంతరం వ్యక్తం చేస్తూ గొడవ చేయడం ప్రాంభించారు. దీంతో స్పీకర్ మరోసారి అరగంట సేపు సభను వాయిదా వేశారు. అంతకు ముందు టిఎంసి సభ్యుల గొడవ కారణంగా భోజన విరామానికి ముందు సభ మూడు సార్లు వాయిదా పడింది. చివరికి ప్రశ్నోత్తరాల సమయం కూడా చేపట్టలేకపోయారు. మరో వైపు టిఎంసి సభ్యుల గొడవ కారణంగా రాజ్యసభ రెండో రోజు కూడా ఎలాంటి కార్యకలాపాలు నిర్వహించకుండానే వాయిదా పడింది.

ద.మ.రైల్వే జిఎంగా

గజానన్ బాధ్యతలు



మన తెలంగాణ / హైదరాబాద్ : దక్షిణ మధ్య రైల్వే నూతన జనరల్ మేనేజర్ గజానన్ మాల్యా బాధ్యతలను స్వీకరించారు. బీహార్‌లోని జమాల్‌పూర్ ఇండియన్ రైల్వే ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెకానికల్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ (ఐఆర్ఎస్ఎంఇ) సంస్థ డైరెక్టర్‌గా పనిచేస్తున్న మాల్యాను దక్షిణ మధ్య రైల్వే జిఎంగా నియమించారు. దీంతో మంగళవారం సికింద్రాబాద్‌లోని రైల్ నిలయంలో బాధ్యతలను స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న వినోద్‌కుమార్ యాదవ్‌ను కేంద్ర రైల్వే మంత్రిత్వశాఖ రైల్వేబోర్డు ఛైర్మన్‌గా నియమించింది. దీంతో దక్షిణ మధ్య రైల్వే జిఎం ఆర్‌కె.కులశ్రేష్టకు అదనపు బాధ్యతలను అప్పగించిన రైల్వేశాఖ ప్రస్తుతం పూర్తిస్థాయి జిఎంను నియమించింది. 1979వ బ్యాచ్‌కు చెందిన స్పెషల్ క్లాస్ రైల్వే అప్రెంటిస్‌గా రైల్వేలో తన సర్వీసును ప్రారంభించి వివిధ హోదాల్లో పనిచేశారు. ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్, మెటలర్జీలో ఎఎంఐఇ డిగ్రీలను సాధించిన మాల్యా లండన్ నుంచి మెకానికల్ ఇంజనీరింగ్‌లోనూ డిగ్రీని పొందారు. దీంతో పాటు ముంబాయి నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండస్ట్రీయల్ ఇంజనీరింగ్ ద్వారా ఇండస్ట్రీయల్ ఇంజనీరింగ్‌లో పోస్టు గ్రాడ్యుయేషన్ డిప్లొమాను కూడా పొందారు. జమాల్‌పూర్‌లోని ఐఆర్ఎస్ఎంఇ డైరెక్టర్‌గా వెబ్ ఆధారిత అభ్యసం, ఆశ్యక కోర్సుల అభివృద్ధి, కొత్త వృత్తి నైపుణ్య కోర్సులను ప్రవేశపెట్టడానికి ప్రత్యేక చొరవ చూపారు. దక్షిణ మధ్య రైల్వే సినియర్ డిజిఎంగా పనిచేసిన సమయంలో విజిలెన్స్ విభాగంలో ఫిర్యాదులపై తనిఖీలు సరిగా జరపడానికి ఎన్నో నూతన పద్దతులను ప్రవేశపెట్టారు. వేగంగా, పారదర్శకంగా పిర్యాదులను పరిష్కరించడానికి కొత్త సాఫ్ట్‌వేర్‌ను వృద్ధి చేసి డేటాబేస్‌లో కేసుల నిర్వహణను చేపట్టారు. భారతీయ రైల్వేలో విభిన్న రంగాల్లో విశిష్ట సేవలు అందించిన మాల్యాకు అనేక అవార్డులు, బహుమతులను సొంతం చేసుకున్నారు. వదోదరలోని రైల్వే స్టాఫ్ కాలేజీలో ఫౌండేషన్, ఇండక్షన్ కోర్సులలో ప్రథముడిగా డిస్టింక్షన్ సాధించినందుకు ప్రిన్సిపల్ మెడల్ ఆఫ్ మెరిట్ అవార్డును సాధించారు. 1988 –91 మధ్య ఐసిఎఫ్‌లో సేవలందించినప్పుడు ప్రతిభావంతమైన పనితీరు ప్రదర్శనకు వరుసగా మూడేళ్ల పాటు నగదు బహుమతులను సైతం అందుకున్నారు.

దీక్ష విరమించిన

అన్నా హజారే

రాలెగావ్ సిద్ధి(మహారాష్ట్ర): లోక్‌పాల్ నియామకం కోసం చేపట్టిన నిరాహార దీక్షను విరమిస్తున్నట్లు అవినీతి వ్యతిరేక ఉద్యమ నేత, ప్రముఖ గాంధేయవాది అన్నాహజారే ప్రకటించారు. మంగళవారం మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్, కేంద్ర మంత్రులు రాధామోహన్, సుభాష్ భమ్రేలు ఆయనను కలుసుకున్నారు. వారితో సుదీర్ఘంగా చర్చలు జరిపిన అనంతరం దీక్ష విరమిస్తున్నట్లు హజారే ప్రకటించారు. రాలెగావ్ సిద్ధిలో విలేఖరుల సమావేశంలో హజారే మాట్లాడారు.' ఫడ్నవిస్, ఇతర మంత్రులతో జరిపిన చర్చలు ఫలప్రదంగా ముగిశాయి. నా డిమాండ్లను పరిష్కరించేందుకు వారు అంగీకరించారు. అందువల్ల నా నిరాహార దీక్షను విరమిస్తున్నాను' అని ఆయన చెప్పారు. అనంతరం ఫడ్నవిస్ మాట్లాడుతూ, లోక్‌పాల్ నియామకాన్ని వీలయినంత త్వరలో చేపడతామని హామీ ఇచ్చారు.ఈ నెల 13న లోక్‌పాల్ సెర్చ్ కమిటీ సమావేశమవుతోందని చెప్పారు. లోక్‌పాల్ చట్టం అమలులోకి వచ్చి అయిదేళ్లయినా లోక్‌పాల్ నియామకాన్ని చేపట్టనందుకు నిరసనగా అన్నాహజారే గత నెల 30న నిరాహార దీక్ష ప్రారంభించిన విషయం తెలిసిందే.



సమరోత్సాహంతో భారత్

ప్రతీకారం కోసం కివీస్, నేడు తొలి టి–20



వెల్లింగ్టన్ : ఇప్పటికే వన్డే సిరీస్ గెలిచి జోరుమీదున్న టీమిండియా తాజా ట్వంటీ–20పై కన్నేసింది. మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా భారత్–న్యూజిలాండ్ జట్ల మధ్య తొలి టి–20 బుధవారం వెల్లింగ్టన్ వేదికగా జరుగుతుంది. వరుస విజయాలతో ప్రకంపనలు సృష్టిస్తున్న భారత జట్టు టి–20 సిరీస్‌ను కూడా గెలిచి న్యూజిలాండ్ పర్యటనకు ఘనంగా ముగింపు పలకాలని భావిస్తోంది. మరోవైపు ఆతిథ్య కివీస్ జట్టు వన్డేల్లో ఎదురైన పరాజయానికి టి–20 సిరీస్‌లో బదులు తీర్చుకోవాలని తహతహలాడుతోంది. భారత్‌తో పోల్చితే పొట్టి ఫార్మాట్‌లో కివీస్‌కు మెరుగైన రికార్డు ఉంది. ఈసారి కూడా అదే సంప్రదాయాన్ని కొనసాగించాలనే లక్ష్యంతో విలియమ్సన్ సేన పోరుకు సిద్ధమైంది. మరోవైపు వరుస విజయాలతో జోరుమీదున్న టీమిండియా టి–20 సిరీస్‌కు ఆత్మవిశ్వాసంతో సిద్ధమైంది. ఇందులో గెలవడం ద్వారా కివీస్‌పై ఉన్న చెత్త రికార్డును చెరిపేయాలని భావిస్తోంది. రెండు జట్లలోనూ ప్రతిభావంతులైన క్రికెటర్లకు కొదవలేదు. భారత జట్టులో కెప్టెన్ రోహిత్ శర్మ, శిఖర్ ధావన్, యువ సంచలనం రిషబ్ పంత్, పాండ్య బ్రదర్స్ వంటి మ్యాచ్ విన్నర్లు ఉన్నారు. అంతేగాక భువనేశ్వర్ కుమార్, సిద్ధార్థ్ కౌల్, ఖలీల్‌లతో ఫాస్ట్ బౌలింగ్ విభాగం కూడా బలంగా ఉంది. వీరికి తోడు ఒంటిచేత్తో మ్యాచ్ ఫలితాన్ని తారుమారు చేయగలిగే సత్తా కలిగిన స్టార్ స్పిన్నర్లు చాహల్, కుల్దీప్‌లు ఉండనే ఉన్నారు. వీరికి తోడుగా కేదార్ జాదవ్, కృనాల్ పాండ్య కూడా బంతిని తిప్పేందుకు తహతహలాడుతున్నారు. అంతేగాక విజయ్ శంకర్, హార్దిక్ వంటి అగ్రశ్రేణి ఆల్‌రౌండర్లు కూడా జట్టులో ఉన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో భారత్‌ను ఓడించాలంటే కివీస్‌కు చాలా కష్టమనే చెప్పాలి.

ఓపెనర్లే కీలకం..

చివరి రెండు వన్డేల్లో విఫలమైన భారత ఓపెనర్లు శిఖర్ ధావన్, రోహిత్ శర్మలకు కివీస్‌తో జరిగే తొలి ట్వంటీ–20 మ్యాచ్ సవాలుగా మారింది. వీరిద్దరూ ప్రారంభంలోనే ఔట్ కావడంతో తర్వాత వచ్చిన బ్యాట్స్‌మెన్ తీవ్ర ఒత్తిడి నెలకొంది. ఇలాంటి పరిస్థితుల్లో ధావన్, రోహిత్‌లు తమ బ్యాట్‌కు పని చెప్పాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఒంటిచేత్తో మ్యాచ్ ఫలితాన్ని తారుమారు చేయగలిగే సత్తా కలిగిన వీరిద్దరిపై జట్టు భారీ ఆశలు పెట్టుకుంది. ఇద్దరిలో ఏ ఒక్కరూ రాణించినా భారత్‌కు భారీ స్కోరు కష్టమేమి కాదు. ఇక, ఈ మ్యాచ్‌లో యువ ఆటగాడు రిషబ్ పంత్ బరిలోకి దిగడం దాదాపు ఖరారైనట్టే. ఆస్ట్రేలియాతో జరిగిన టెస్టు సిరీస్‌లో రిషబ్ పంత్ ప్రకంపనలు సృష్టించిన విషయం తెలిసిందే. ఈ మ్యాచ్‌లో పంత్‌ను ఆడించే అవకాశాలు అధికంగా కనిపిస్తున్నాయి. ఇదే జరిగితే సీనియర్ ఆటగాడు దినేశ్ కార్తీక్ పెవిలియన్‌కే పరిమితం కాక తప్పదు. మరోవైపు సీనియర్ ఆటగాడు మహేంద్ర సింగ్ ధోనికి కూడా సిరీస్ కీలకంగా మారింది. రానున్న ప్రపంచకప్ నేపథ్యంలో ధోని మెరుగైన ఆటను కనబరచక తప్పదు. వరల్డ్‌కప్ జట్టులో ధోని స్థానం దాదాపు ఖరారైనప్పటికీ పంత్ రూపంలో గట్టి పోటీ నెలకొంది. ధోని విఫలమైతే పంత్‌ను వరల్డ్‌కప్‌లో ఆడించినా ఆశ్చర్యంలేదు. మరోవైపు ఆడిన తొలి రెండు వన్డేల్లో విఫలమైన యువ ఆటగాడు శుభ్‌మన్ గిల్‌కు టి–20లో ఆడిస్తారా లేదా అనేది అనుమానంగానే ఉంది. అతనికి బదులు కేదార్ జాదవ్‌ను ఆడించే అవకాశాలే అధికంగా ఉన్నాయి. వన్డే సిరీస్‌లో కేదార్ ఆల్‌రౌండ్ షోతో ఆకట్టుకున్న విషయం తెలిసిందే. ఇక, చాహల్, కుల్దీప్, కృనాల్ పాండ్యలలో ఇద్దరికీ మాత్రమే జట్టులో ఛాన్స్ ఉండే అవకాశాలు కనిపిస్తున్నాయి. బ్యాట్‌తోనూ రాణించే సత్తా కలిగిన కృనాల్‌కు తుది జట్టులో స్థానం ఖాయంగా కనిపిస్తోంది. ఇదే జరిగితే కుల్దీప్, చాహల్‌లలో ఒకరు పెవిలియన్‌కే పరిమితం కాక తప్పదు. ఇక, ఆల్‌రౌండర్‌గా హార్దిక్ పాండ్య స్థానం దాదాపు ఖాయమైంది. విజయ్ శంకర్‌ను కూడా ఎంపిక చేస్తే ఖలీల్, సిద్ధార్థ్ కౌల్‌లలో ఒకరూ పెవిలియన్‌లోనే ఉండి పోవడం తథ్యం.





మధ్యాహ్నం 12:30 నుంచి స్టార్ నెట్‌వర్క్‌లో

తక్కువ అంచనా వేయలేం..

వన్డేలతో పోల్చితే టి–20 ఫార్మాట్‌లో న్యూజిలాండ్ చాలా ప్రమాదకర జట్టు అనడంలో సందేహం లేదు. ఆ జట్టులో ప్రతిభావంతులైన ఆటగాళ్లకు కొదవలేదు. ఓపెనర్ మన్రోకు టి–20లో కళ్లు చెదిరే రికార్డు ఉంది. వరుస సెంచరీలతో మన్రో ఇప్పటికే టి–20 ఫార్మాట్‌లో పెను ప్రకంపనలే సృష్టించాడు. కెప్టెన్ విలియమ్సన్‌కు కూడా మంచి రికార్డే ఉంది. ఎలాంటి బౌలింగ్‌నైనా చిన్నాభిన్నం చేసే సత్తా విలియమ్సన్ సొంతం. దీనికి తోడు ఈ ఫార్మాట్‌లో విలియమ్సన్‌కు సారథిగా మంచి అనుభవం ఉంది. ఇప్పటికే కిందటి సీజన్‌లో సన్‌రైజర్స్ సారథిగా సత్తా చాటాడు. ఈసారి కూడా అతని కెప్టెన్సీ సామర్థ్యం జట్టుకు అనుకూలంగా మారుతుందనడంలో సందేహం లేదు. ఇక, వన్డే సిరీస్‌లో నిలకడగా రాణించిన వెటరన్ బ్యాట్స్‌మన్ రాస్ టైలర్ ఉండనే ఉన్నాడు. అతనితో భారత బౌలర్లకు ప్రమాదం పొంచి ఉంది. టి–20లలో రాస్‌కు అద్భుత రికార్డు ఉన్న విషయం తెలిసిందే. నిశమ్, బ్రేస్‌వెల్, గ్రాండోమ్, సాంట్నర్, ఫెర్గ్యూసన్ వంటి అగ్రశ్రేణి ఆల్‌రౌండర్లతో కివీస్ చాలా బలంగా ఉంది. అంతేగాక టిమ్‌సౌథీ చేరికతో ఫాస్ట్ బౌలింగ్ విభాగం మరింత బలోపేతంగా మారింది. రెండు జట్లలోనూ ప్రతిభావంతులైన ఆటగాళ్లు ఉండడంతో పోరు నువ్వానేనా అన్నట్టు సాగడం ఖాయం.

జట్ల వివరాలు..

భారత్ : రోహిత్ శర్మ (కెప్టెన్), శిఖర్ ధావన్, రిషబ్ పంత్, శుభ్‌మన్ గిల్, మహేంద్ర సింగ్ ధోని, దినేశ్ కార్తీక్, హార్దిక్ పాండ్య, కుల్దీప్ యాదవ్, చాహల్, కృనాల్ పాండ్య, భువనేశ్వర్ కుమార్, కేదార్ జాదవ్, ఖలీల్, విజయ్ శంకర్, సిద్ధార్థ్ కౌల్.

న్యూజిలాండ్ : కేన్ విలియమ్సన్ (కెప్టెన్), రాస్ టైలర్, కొలిన్ మన్రో, టిమ్ సెల్ఫర్ట్, గ్రాండోమ్, జేమ్స్ నిశమ్, మిఛెల్ సాంట్నర్, బ్రేస్‌వెల్, టిమ్ సౌథీ, ఐష్ సౌధి, ఫెర్గ్యూసన్, స్కాట్, డారిల్ మిఛెల్.

రసపట్టులో రంజీ సమరం



నాగ్‌పూర్ : విదర్భ–సౌరాష్ట్ర జట్ల మధ్య జరుగుతున్న రంజీ ట్రోఫీ ఫైనల్ సమరం రసవత్తరంగా సాగుతోంది. విదర్భ కీలకమైన తొలి ఇన్నింగ్స్ ఆధిక్యాన్ని సాధించింది. అయితే తర్వాత రెండో ఇన్నింగ్స్ చేపట్టిన విదర్భ మంగళవారం మూడో రోజు ఆట ముగిసే సమయానికి రెండు వికెట్ల నష్టానికి 55 పరుగులు చేసింది. ఓపెనర్లు ఫైజ్ ఫైజల్ (10), సంజయ్ రామస్వామి (16) చేసి పెవిలియన్ చేరారు. మరోవైపు గణేశ్ సతీష్ 24 పరుగులతో క్రీజులో ఉన్నాడు. అతనికి సీనియర్ ఆటగాడు వసీం జాఫర్ 5(బ్యాటింగ్) అండగా ఉన్నాడు. మరోవైపు విదర్భ ఇప్పటి వరకు 60 పరుగుల ఆధిక్యంలో ఉంది. పిచ్ బౌలింగ్‌కు అనుకూలంగా కనిపిస్తున్న నేపథ్యంలో నాలుగో రోజు ఆటపై సర్వత్ర ఆసక్తి నెలకొంది. అంతకుముందు సౌరాష్ట్ర మొదటి ఇన్నింగ్స్‌లో 307 పరుగులకు ఆలౌటైంది. ఒక దశలో 184 పరుగులకే ఏడు వికెట్లు కోల్పోయి ఇబ్బందుల్లో చిక్కుకున్న సౌరాష్ట్రను చివరి వరుస బ్యాట్స్‌మెన్ ఆదుకున్నారు. జడేజా 23 పరుగులు చేయగా, కెప్టెన్సీ ఇన్నింగ్స్ ఆడిన ఉనద్కట్ 46 పరుగులు చేశాడు. చేతన్ సకరియా 28 పరుగులతో అజేయంగా ఉన్నాడు. మరోవైపు అద్భుత బ్యాటింగ్‌ను కనబరిచిన ఓపెనర్ స్నేల్ పటేల్ 15 ఫోర్లతో 102 పరుగులు చేసి జట్టును ఆదుకున్నాడు. విదర్భ బౌలర్లలో ఆదిత్య ఐదు, అక్షయ్ నాలుగు వికెట్లు పడగొట్టారు.

గెలుపుతో ముగిస్తాం..



వెల్లింగ్టన్ : న్యూజిలాండ్‌తో జరిగే ట్వంటీ–20 సిరీస్‌లో విజయమే లక్ష్యంగా పెట్టుకున్నామని టీమిండియా స్టార్ ఓపెనర్ శిఖర్ ధావన్ స్పష్టం చేశాడు. బుధవారం కివీస్‌తో తొలి ట్వంటీ–20 నేపథ్యంలో ధావన్ మీడియాతో మాట్లాడాడు. వన్డే సిరీస్ గెలిచి జోరుమీదున్న తాము టి–20లోనూ అదే ఆటను కనబరుస్తామని ధీమా వ్యక్తం చేశాడు. ఈ సిరీస్‌లోనూ గెలిచి కివీస్ పర్యటనను విజయవంతంగా ముగిస్తామని తెలిపాడు. ఈ సిరీస్‌లో తమకే గెలిచే అవకాశాలు అధికంగా ఉన్నాయన్నాడు. రిషబ్ పంత్ చేరికతో బ్యాటింగ్ చాలా బలంగా మారిందన్నాడు. ఇప్పటికే ఆస్ట్రేలియా గడ్డపై జరిగిన టెస్టు సిరీస్‌లో ప్రకంపనలు సృష్టించిన పంత్ టి–20 సిరీస్‌లో చెలరేగి పోతాడనే నమ్మకాన్ని ధావన్ వ్యక్తం చేశాడు. ప్రస్తుతం టీమిండియాలో అత్యంత ప్రతిభావంతుడైన క్రికెటర్ ఎవరైనా ఉన్నారంటే పంత్ మాత్రమేనని స్పష్టం చేశాడు. ఎటువంటి పరిస్థితినైనా తట్టుకొని ముందుకు సాగే తత్వం పంత్‌లో ఉందన్నాడు. అతని చేరికతో భారత బ్యాటింగ్ చాలా బలంగా మారిందన్నాడు. శుభ్‌మన్ గిల్‌లో కూడా అపార ప్రతిభ దాగివుందన్నాడు. తొలి రెండు మ్యాచుల్లో విఫలమైనంత మాత్రాన గిల్‌ను తక్కువ అంచన వేయలేమన్నాడు. రానున్న రోజుల్లో పంత్, గిల్, పృథ్వీషాలు భారత్ అస్త్రాలుగా మారడం ఖాయమన్నాడు. యువ ఆటగాళ్ల రాకతో టీమిండియా చాలా బలంగా మారిందన్నాడు. ఒకవైపు సీనియర్లు మరోవైపు యువ ఆటగాళ్లు అందివచ్చి అవకాశాలను సద్వినియోగం చేసుకుంటున్నారని, దీంతో జట్టుకు వరుస విజయాలు దక్కుతున్నాయన్నాడు. ఇక, కివీస్‌తో పోరు అనుకున్నంత తేలిక కాదని మరో ప్రశ్నకు సమాధానంగా చెప్పాడు.

బదులు తీర్చుకుంటాం..



వెల్లింగ్టన్ : వన్డే సిరీస్‌లో ఎదురైన పరాజయానికి టి–20లో బదులు తీర్చుకుంటామని న్యూజిలాండ్ కెప్టెన్ కేన్ విలియమ్సన్ జోస్యం చెప్పాడు. సొంత గడ్డపై వన్డే సిరీస్ కోల్పోవడం తమ ఆటగాళ్లు జీర్ణించుకోలేక పోతున్నారన్నాడు. కచ్చితంగా దీనికి టి–20 సిరీస్‌లో ప్రతీకారం తీర్చుకుంటామనే నమ్మకాన్ని వ్యక్తం చేశాడు. కీలక ఆటగాడు, ఓపెనర్ మార్టిన్ గుప్టిల్ గాయం వల్ల జట్టుకు దూరం కావడం పెద్దలోటేనన్నాడు. అయితే మన్రో రూపంలో తమకు పదునైన అస్త్రం అందుబాటులో ఉందదన్నాడు. ఈ సిరీస్‌లో సత్తా చాటేందుకు యువ ఆటగాళ్లకు మంచి అవకాశం ఉందన్నాడు. ఇందులో రాణించడం ద్వారా రానున్న సిరీస్‌లలో జట్టులో స్థానాన్ని సుస్థిరం చేసుకునే అకవాశం ఉంటుందన్నాడు. యువ క్రికెటర్లు అందివచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలన్నాడు. ఇక, సొంత గడ్డపై జరుగుతున్న సిరీస్‌లో తమకే గెలుపు అవకాశాలు అధికంగా ఉన్నాయన్నాడు. వన్డేలతో పోల్చితే టి–20లలో తమ రికార్డు బాగానే ఉందని విలియమ్సన్ అన్నాడు. సీనియర్ ఆటగాడు రాస్ టైలర్‌పై జట్టు భారీ ఆశలు పెట్టుకుందన్నాడు. వన్డేల్లో నిలకడగా రాణించిన టైలర్ టి–20లలో కూడా అదే జోరును కొనసాగిస్తాడనే నమ్మకం ఉందన్నాడు. ఇక, గ్రాండోమ్, నిశమ్, బ్రేస్‌వెల్, ఫెర్గ్యూసన్, సోధి, సాంట్నర్ వంటి అగ్రశ్రేణి ఆల్‌రౌండర్లు జట్టులో ఉన్నారన్నాడు. సమష్టిగా రాణిస్తే భారత్‌ను ఓడించడం తమకు కష్టం కాదని విలియమ్సన్ స్పష్టం చేశాడు. తొలి టి–20ను పురస్కరించుకుని అతను మీడియాతో మాట్లాడాడు.

కోహ్లిని మించిన క్రికెటర్ లేడు

ప్రధాన కోచ్ రవిశాస్త్రి



వెల్లింగ్టన్ : ప్రస్తుతం ప్రపంచ క్రికెట్‌లో టీమిండియా కెప్టెన్ విరాట్ కోహ్లిని మించిన క్రికెటర్ మరొకరూ లేరని భారత జట్టు ప్రధాన కోచ్ రవిశాస్త్రి అన్నాడు. ఓ మీడియా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో శాస్త్రి ఈ విషయం చెప్పాడు. ఒకప్పుడూ ప్రపంచ క్రికెట్‌లో వివిఎన్.రిచర్డ్స్ ఎలా ప్రకంపనలు సృష్టించాడో కోహ్లి కూడా అలాగే తనదైన ముద్ర వేశాడన్నాడు. ప్రస్తుతం కోహ్లికి సరితూగే ఆటగాడే కనిపించడం లేదన్నాడు. ఫార్మాట్ ఏదైనా కోహ్లి పరుగుల వరద పారిస్తున్నాడన్నాడు. అంతేగాక కెప్టెన్‌గా కూడా ఎంతో పరిణితి సాధించాడన్నాడు. అతని సారథ్య ప్రతిభకు ఆస్ట్రేలియా గడ్డపై చారిత్రక విజయమే నిదర్శనమన్నాడు. ఆస్ట్రేలియా వంటి బలమైన జట్టును వారి సొంత గడ్డపై ఓడించడం అంత తేలిక కాదన్నాడు. అయితే కెప్టెన్‌గా కోహ్లి జట్టును ముందుండి నడిపించిన విషయాన్ని శాస్త్రి గుర్తు చేశాడు. తాను చూసిన అత్యుత్తమ ఆటగాళ్లలో రిచర్డ్స్ తర్వాత అంతటి ఆటగాడు కోహ్లి మాత్రమేనన్నాడు. అతనిలో ఎంతో ప్రతిభ దాగివుందన్నాడు. కోహ్లి వంటి క్రికెటరర్ దొరకడం భారత అదృష్టమన్నాడు. రానున్న రోజుల్లో కోహ్లి ఎన్నో రికార్డులను బద్దలు కొట్టడం ఖాయమన్నాడు. ఎటువంటి పరిస్థితులు ఎదురైనా తట్టుకుని ముందుకు సాగే తత్వం కోహ్లిలో పుష్కలంగా ఉందన్నాడు. అదే అతన్ని అగ్రశ్రేణి క్రికెటర్‌గా తీర్చిదిద్దిందన్నాడు. ఇక, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్‌లతో సిరీస్‌ను గెలవడం చారిత్రక అంశమన్నాడు. సమష్టి కృషివల్లే చారిత్రక విజయాలు లభించాయన్నాడు. మరోవైపు యువ స్పిన్నర్ కుల్దీప్ యాదవ్‌పై శాస్త్రి ప్రశంసల వర్షం కురిపించాడు. కోహ్లిలాగే కుల్దీప్ కూడా మూడు ఫార్మాట్‌లలో జట్టుకు చాలా కీలకంగా మారాడన్నాడు. విదేశి సిరీస్‌లలో కూడా కుల్దీప్ బాగా రాణిస్తున్నాడన్నాడు. కుల్దీప్ రాకతో మరో సీనియర్ అశ్విన్‌కు భారత జట్టులో స్థానం కష్టంగా మారిందన్నాడు. అశ్విన్‌తో పోల్చితే కుల్దీప్ అద్భుత ప్రదర్శన ఇస్తుండడంతో అతనికే మెరుగైన అవకాశాలున్నాయన్నాడు. ఇలాంటి పరిస్థితుల్లో రానున్న రోజుల్లో అశ్విన్ జాతీయ జట్టులో స్థానం పొందడం చాలా కష్టమని శాస్త్రి అభిప్రాయపడ్డాడు.



జాతీయ మహిళా టి-20 క్రికెట్ విజేత 'తెలంగాణ'

మనతెలంగాణ/ఖమ్మం స్పోర్ట్స్ : ఖమ్మంలో నాలుగు రోజుల నుంచి జరుగుతున్న జాతీయ మహిళా టి20 క్రికెట్ పోటీల్లో తెలంగాణ జట్టు విజేతగా నిలిచి ట్రోఫీని కైవసం చేసుకుంది. ఖమ్మం సర్దార్ పటేల్ స్టేడియంలో మంగళవారం ఉత్తరప్రదేశ్, తెలంగాణ జట్ల మధ్య జరిగిన ఫైనల్‌లో తొలుత టాస్ గెలిచి ఉత్తర్‌ప్రదేశ్ జట్టు తొమ్మిది వికెట్లు కోల్పోయి 122 పరుగులు సాధించింది. అనంతరం బ్యాటింగ్ ప్రారంభించిన తెలంగాణ 12 ఓవర్లలో మదు వికెట్ల నష్టానికి 82 పరుగులు చేయగా బ్యాడ్ లైటింగ్ కారణంతో రన్‌రేట్ ఆధారంగా తెలంగాణ జట్టు విజయం సాధించింది. గెలుపొందిన విజేతకు పోలీస్ కమిషనర్ తఫ్సీర్ ఇక్బాల్, జిల్లా జడ్జీ ఎం.లక్ష్మ ణ్‌లు విచ్చేసి విజేతలకు ట్రోఫీలను అందజేశారు.



ముంబయి వేదికగా జరుగుతున్న లాక్మే ఫ్యాషన్ షోలో భారత స్టార్ షట్లర్ పి.వి.సింధు బాలీవుడ్ నటుడు రణ్‌వీర్ సింగ్‌తో కలిసి సందడి చేశారు. ఈ సందర్భంగా తన అభిమాన హీరో రణ్‌వీర్‌తో దిగిన సెల్ఫీని సింధు అభిమానులతో పంచుకున్నారు..
రణ్‌వీర్ ప్రస్తుతం గల్లీ బాయ్ సినిమాలో బీజీగా ఉన్నాడు..

మన తెలంగాణ
హైదరాబాద్
బుధవారం 6, ఫిబ్రవరి 2019
www.manatelangana.news

అమెరికాలో చికిత్స పొందుతున్న కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ ఈ వారాంతంలో తిరిగి రానున్నట్లు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. జైట్లీ, వైద్య చికిత్సలు తీసుకోవాల్సి రావడంతో తన బాధ్యతలను తాత్కాలికంగా పీయూష్ గోయల్‌కు అప్పగించారు. దీంతో తాత్కాలిక బడ్జెట్‌ను ఆయన స్థానంలో గోయల్ ప్రవేశపెట్టారు. చికిత్స పొందుతున్నప్పటికీ, జైట్లీ సోషల్ మీడియాలో చురుగ్గా పాల్గొంటున్నారు. ఆయన ట్వీట్లు చేయడంతోపాటు ఫేస్‌బుక్‌లో పోస్టింగులు పెడుతున్నారు.

త్వరలో ఢిల్లీలో పోరాటం


తుపాకులు, గోరక్షకులతో దేశం నడవదు • మోడీ... రాజీనామా చేసి గుజరాత్ వెళ్లిపో

సుప్రీం తీర్పు మా నైతిక విజయం • ధర్నా విరమిస్తూ పశ్చిమ బెంగాల్ సిఎం మమత ధ్వజం

కోల్‌కతా : కలకత్తా పోలీసు కమిషనర్‌పట్ల కేంద్ర ప్రభుత్వ తీరుకు నిరసనగా చేపట్టిన సత్యాగ్రహ దీక్షను ముగిస్తున్నట్లు పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ప్రకటించారు. మంగళవారం సాయంత్రం ఆమె ధర్నా వేదికపై మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. కోల్‌కతా పోలీస్ కమిషనర్ ధర్నాలో ఎలా పాల్గొంటారని కేంద్ర ప్రభుత్వ ప్రశ్నిస్తోందని, కానీ ఆ అధికారికి ధర్నాలో పాలుపంచుకోలేదని ఆమె పేర్కొన్నారు. అధికారి అసలు ధర్నా వేదికపైకి రాలేదన్నారు. సుప్రీంకోర్టు తీర్పు తమకు అనుకూలంగానే వచ్చిందన్నారు. వచ్చే వారం ఈ విషయంపై ఢిల్లీలో పోరాటం చేస్తామని మమత వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ఏజెన్సీలతో పాటు అన్ని సంస్థలను తమ గుప్పిట్లో ఉంచుకోవాలని అనుకుంటుందని, ప్రధాని మోడీ వెంటనే తన పదవికి రాజీనామా చేసి గుజరాత్ వెళ్లిపోవాలని డిమాండ్ చేశారు. అప్పుడే ప్రజాస్వామ్యం పదికాలాలపాటు నిలుస్తుందని పేర్కొన్నారు. దేశం తుపాకులు, గోరక్షకులతో నడవదని అన్నారు. కాగా, సుప్రీంకోర్టు తీర్పు తమ నైతిక విజయంగా మమత అభివర్ణించారు. న్యాయ వ్యవస్థ పట్ల తమకు గౌరవం ఉందన్నారు. ఇలాంటి ఆదేశాలు గతంలో కూడా జారీ అయ్యాయన్నారు. తాను అందుబాటులో ఉండనని రాజీవ్ కుమార్ ఎప్పుడూ చెప్పలేదని ఆమె అన్నారు. రాజీవ్ కుమార్‌ను అరెస్టు చేయవద్దని కోర్టు చెప్పిందన్నారు. ఈ తీర్పు చెప్పినందుకు న్యాయస్థానానికి కృతజ్ఞులమని అన్నారు. ఇది ప్రజాస్వామ్యానికి విజయమని ఆమె చెప్పారు. తాము దర్యాప్తు సంస్థల అధికారులకు వ్యతిరేకం కాదని, వారు కూడా తమ సోదరులేనని మమత అన్నారు. అయితే వారిని రాజకీయంగా ఉపయోగించుకోరాదన్నారు. ప్రజాస్వామ్య ప్రమాదంలో ఉందని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. మంగళవారం దీక్ష చేస్తున్న మమతను పలువురు నేతలు కలుసుకున్నారు. ఆర్‌జెడి నేత తేజస్వీయాదవ్, డిఎంకె నేత కనిమొళి తదితరులు ఆమెతో మాట్లాడారు. శారదా కుంభకోణం కేసులో కోల్‌కతా పోలీస్ కమిషనర్‌ను ప్రశ్నించే నిమిత్తంసిబిఐ అధికారులు ఆదివారం సాయంత్రం ఆయన నివాసానికి వెళ్లే ప్రయత్నం చేశారు. ఈ చర్యపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన మమతా బెనర్జీ రాత్రికి రాత్రే దీక్షకు దిగిన సంగతి తెలిసిందే.




మమత అతిగా స్పందించారు: జైట్లీ



న్యూఢిల్లీ: కోల్‌కతా పోలీసు కమిషనర్‌ను ప్రశ్నించడానికి సిబిఐ అధికారులు వెళ్లినప్పుడు పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ప్రవర్తించిన తీరు అతిగా ఉందని కేంద్ర మంత్రి అరుణ్ జైట్లీ ఆరోపించారు. శారదా చిట్‌ఫండ్ కుంభకోణం కేసులో సిబిఐ దర్యా ప్తు యత్నాలను నిరసిస్తూ మమత చేస్తున్న ధర్నా అసంబద్ధమైన, మితిమీరిన స్పం దన అని ఆయన వ్యాఖ్యానించారు. 'అవినీతి నేతల కూటమి'అనే శీర్షికతో రాసిన బ్లాగ్‌పోస్ట్‌లో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. మమతా బెనర్జీ తాను చేస్తున్న ధర్నాలో పాల్గొనాలని ఇతర ప్రతిపక్ష నేతలను కోరడం వెనుక అసలు ఉద్దేశం ఏమిటని జైట్లీ ప్రశ్నించారు. పశ్చిమ బెంగాల్‌లో చిట్‌ఫండ్ కుంభకోణం 2012–13లో వెలుగులోకి వచ్చిందని, సుప్రీంకోర్టు ఈ కేసు దర్యాప్తును సిబిఐకి అప్పగించిందని ఆయన చెప్పారు. దర్యాప్తును సుప్రీంకోర్టు పర్యవేక్షిస్తోందన్నారు. ఇప్పటికే సిబిఐ ఈ కేసులో పలువురిని ప్రశ్నించి కొందరిని అరెస్టు చేసిందని, కొందరు బెయిల్‌పై విడుదలయ్యారని ఆయన అన్నారు. కేసు దర్యాప్తులో భాగంగా ఒక పోలీసు ఉన్నతాధికారిని ప్రశ్నించాల్సి వచ్చినప్పుడు అది సూపర్ ఎమర్జెనీ, ఫెడరల్ వ్యవస్థపై దాడి ఎలా అవుతుందని ప్రశ్నించారు. మమత అనుసరిస్తున్న ఆ మోదయోగ్యం కాని, అసంబద్ధమైన మితిమీరిన ప్రవర్తన వెనుక వ్యూ హం ఏమిటని కూడా ఆయన ప్రశ్నించారు. కేంద్ర దర్యాప్తు సంస్థకు సుప్రీంకోర్టు అప్పగించిన బాధ్యతను అది నిర్వర్తించకుండా అడ్డుకోవడం అంటే నేరుగా సమాఖ్యపై దాడి చేయడమేనని ఆయన అన్నారు. టిఎంసి మిత్రపక్షాల నేతలంతా అవినీతిలో కూరుకు పోయారని జైట్లీ ఆరోపించారు. వైద్య చికిత్స కోసం జైట్లీ ప్రస్తుతం అమెరికాలో ఉన్న విషయం తెలిసిందే.

టిఎంసి, బిజెపి దొందూ దొందే: ఏచూరి



న్యూఢిల్లీ: అవినీతి విషయంలో తృణమూల్ కాంగ్రెస్, బిజెపిలు దొందూ దొందేనని, సుప్రీంకోర్టు తీర్పు ఆ రెండు పార్టీలకు తాము ఉండాల్సిన స్థానలాఉ ఏమిటో చూపించిందని సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి అన్నారు. మంగళవారం ఆయన ఇక్కడ విలేఖరులతో మాట్లాడుతూ, ఈ కేసులో దర్యాప్తు జరిపేందుకు సిబిఐ అధికారులు కోల్‌కతాకు వెళ్లడంలో తప్పేమీ లేదని, వారు తమంతట తాముగా వెళ్లి ఉంటే అభ్యంతరకరం అయి ఉండేదని అన్నారు. 'సిబిఐ తనకు తానుగా చర్య తీసుకుని ఉంటే, రాష్ట్ర ప్రభుత్వం అనుమతి లేకుండా దర్యాప్తు చేసి ఉంటే అభ్యంతరకరం అయి ఉండేది. అయితే ఈ విషయంలో అలా జరగలేదు. ఇది కేంద్ర– రాష్ట్ర సంబంధాలకు సంబంధించిన అంశం కాదు' అని ఏచూరి అన్నారు. ఒక కేసును దర్యాప్తు చేయమని న్యాయవ్యవస్థ సిబిఐని ఆదేశించినప్పుడు వారు ఏ రాష్ట్రానికయినా, ఏ ప్రాంతానికయినా వెళ్లవచ్చు. అది రాష్ట్ర ప్రభుత్వ అధికారాల్లో జోక్యం చేసుకోవడంగా భావించడానికి వీల్లేదని ఆయన అన్నారు. టిఎంసి, బిజెపి రెండూ కూడా అవినీతి పార్టీలేనని ఆయన అంటూ, వాటికి వాటి స్థానం ఏమిటో సుప్రీం కోర్టు చూపించిందన్నారు. ఈ కుంభకోణంలో టిఇఎంసి అగ్రనాయకత్వంపై కూడా దర్యాప్తు జరపాలని కూడా ఆయన డిమాండ్ చేశారు. టిఎంసికి చెందిన పలువురు ఎంపిలను అరెస్టు చేయడం, వారిపై చార్జిషీట్లు దాఖలు చేయడం కూడా జరిగిందన్నారు. అయితే ఈ కేసులో దర్యాప్తు చేయడానికి బిజెపి అయిదేళ్ల పాటు ఎందుకు వేచి చూసింది, అవినీతిపరులను తమ పార్టీలోకి లాక్కోవడం కోసమేనా? అని ఏచూరి ప్రశ్నించారు.

ఎన్‌ఆర్‌సి ప్రక్రియ నాశనం చేస్తారా?

- మీ ఉద్దేశం అలాగే ఉంది
- హోంశాఖపై సుప్రీం చిటపటలు





న్యూఢిల్లీ: అస్సాంలో జాతీయ పౌరసత్వ నమోదులో (నేషనల్ రిజిస్టర్ ఆఫ్ సిటిజన్స్ ...ఎన్‌ఆర్‌సి) తుది జాబితా రూపొందించే ప్రక్రియను కొనసాగకుండా చేస్తోందని కేంద్రంపై సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. కేంద్ర సాయుధ పోలీసు బలగాలు (సిపిఎఫ్) ఎన్నికల విధుల్లో కీలకంగా వ్యవహరించాలి కనుక రెండు వారాల పాటు ఎన్‌ఆర్‌సి పనిని నిలపాలని కోరుతూ కేంద్ర హోంమంత్రిత్వశాఖ చేసిన అభ్యర్థనపై మండిపడింది. జూలై 31కల్లా ఎన్‌ఆర్‌సి పని పూర్తి కావాలని, ఆ గడువును పొడిగించే ప్రసక్తే లేదని అత్యున్నత న్యాయస్థానం పునరుద్ఘాటించింది. ఎన్‌ఆర్‌సి ప్రక్రియలో కేంద్ర సహకరించడంలేదని ప్రధాన న్యాయమూర్తి రంజన్ గొగోయ్ సారథ్యంలోని ధర్మాసనం వ్యాఖ్యానించింది. ఈ ప్రక్రియను నాశనం చేయడమే హోంమంత్రిత్వ శాఖ ఉద్దేశంలా కనబడుతోందని ఆరోపించింది. ఎన్‌ఆర్‌సి ప్రక్రియను కొనసాగించేందుకు కొందరు రాష్ట్ర అధికారులను ఎన్నికల డ్యూటీనుంచి మినహాయించాలని ఎన్నికల కమిషన్‌ను కోరింది. అస్సాంకు ఎన్‌ఆర్‌సి తుది రూపకల్పనకు 2019 జూలై 31 తుది గడువు అని జనవరి 24న సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఆ గడువును పొడిగించేందుకు వీల్లేదని కూడా తెలిపింది. రాబోయే సాధారణ ఎన్నికల కారణంగా ఈ ప్రక్రియ మందకొడిగా సాగకూడదని రాష్ట్ర ప్రభుత్వాన్ని, ఎన్‌ఆర్‌సి కో ఆర్డినేటర్‌ను, ఎన్నికల సంఘాన్ని కోరింది. అస్సోం ఎన్‌ఆర్‌సిల ముసాయిదా 2018 జూలై 30 వెలువడింది. అందులో 3. 29 కోట్ల మంది పేర్లుండాలి. కానీ 2.89 కోట్ల మంది పేర్లే ఉన్నాయి. 40,70,707 మంది పేర్లు జాబితాలో లేవు. అందులో 37,59,630 మంది పేర్లను తిరస్కరించగా, 2,48,077 మందిని నిలిపి ఉంచారు. ఈ వ్యవహారం వివాదాస్పదంగా మారింది.

ప్రియాంకకు సొంత కార్యాలయం



న్యూఢిల్లీ: క్రియాశీల రాజకీయాల్లోకి ప్రవేశించిన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ వాద్రాకు సొంత కార్యాలయం సమకూరింది. న్యూఢిల్లీలోని కాంగ్రెస్ ప్రధాన కార్యాలయం భవనంలో ఆమెకు ఒక కార్యాలయాన్ని పార్టీ కేటాయించింది. తన సోదరుడు రాహుల్ గాంధీ గతంలో ఉపయోగించిన కార్యాలయమే ఆమెకు లభించింది. కార్యాలయం వెలుపల హిందీ, ఇంగ్లీష్‌లో రాసిన ఆమె నేమ్‌పేట్లను కొత్తగా ఏర్పాటు చేశారు. ఆమె ఈ నెలలోనే తూర్పు ఉత్తర్ ప్రదేశ్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టనున్నారు. ఇదిలా ఉంటే, ప్రియాంక గాంధీ కూడా సోషల్ మీడియా ద్వారా కాంగ్రెస్ పార్టీ కోసం ప్రచారాన్ని ఉధృతం చేయనున్నారు. త్వరలోనే పార్టీ తరపున ఆమెకు ఫేస్‌బుక్ పేజ్, ట్విట్టర్ ఖాతా రానున్నాయి. ఇప్పటి వరకు ప్రియాంక సోషల్ మీడియాకు దూరంగా ఉంటూ వచ్చారు. ప్రత్యక్ష రాజకీయాలలోకి ప్రవేశించిన దరిమిలా సోషల్ మీడియాలో కూడా ఆమె చురుకైన పాత్రను పోషించనున్నారు. సోమవారం రాహుల్ గాంధీతోపాటు మరి కొందరు కాంగ్రెస్ సీనియర్ నాయకులతో ఆయన నివాసంలో సమావేశమైన ప్రియాంక వచ్చే లోక్‌సభ ఎన్నికల సందర్భంగా అనుసరించాల్సిన వ్యూహంపై చర్చించారు. ఈ సమావేశంలో పశ్చిమ యుపి కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా నియమితులైన జ్యోతిరాదిత్య సింధియా కూడా పాల్గొన్నారు. యుపిలోని 80 లోక్‌సభ నియోజకవర్గాలలో 43 స్థానాలలో పార్టీ ఇన్‌చార్జిగా ప్రియాంక బాధ్యతలు నిర్వర్తించనున్నారు.

విద్యార్థులను కలిసేందుకు అనుమతి

117 మందికి అమెరికా కాన్సులర్ యాక్సెస్





న్యూఢిల్లీ: అమెరికాలో అరెస్టయిన భారతీయ విద్యార్థులను దౌత్య అధికారులు కలుసుకోవడానికి అమెరికా ప్రభుత్వంనుంచి కాన్సులర్ యాక్సెస్ అభించింది. యుఎస్ గవర్నమెంట్ స్టాటిస్టిక్స్ సమాచారం ప్రకారం మొత్తం 129 మంది విద్యార్థులు అరెస్టు కాగా వారిలో 117 మందిని దౌత్య అధికారులు కలుసుకునేందుకు అనుమతి లభించింది. కేంద్ర విదేశాంగ శాఖ ఈ విషయాన్ని తెలియజేసింది. మిగతా 12 మందిని కలుసుకునేందుకు వీలుగా కాన్సులర్ యాక్సెస్ పొందేందుకు ప్రయత్నిస్తున్నట్లు ఆ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. అలాగే అమెరికాలోని భారత రాయబార కార్యాలయంలో 24 గంటలు పని చేసే హెల్ప్‌లైన్‌ను కూడా ఏర్పాటు చేసినట్లు కూడా తెలిపింది.అమెరికాలో నకిలీ వీసా రాకెట్‌లో 130 మందిని పోలీసులు అరెస్టు చేసిన విషయం తెలిసిందే. వీరిలో 129 మంది భారతీయులని తేలింది. వీరే కాకుండా ఎనిమిది మంది దళారులను కూడా అరెస్టు చేయడం విదితమే.

మేము తప్పు చేయలేదు: 8 మంది దళారీలు

ఫర్మింగ్టన్ నకిలీ యూనివర్శిటీ కేసులో అరెస్టయిన ఎనిమిది మంది భారతీయులు తాము ఎలాంటి తప్పు చేయలేదని మిచిగాన్ లోని ఫెడరల్ కోర్టులో వాదించారు. కాగా, ఈ కేసులో అరెస్టయిన వారిలో ఒకరైన ఫణిదీప్ కర్నాటిని సోమవారం పదివేల డాలర్ల వ్యక్తిగత పైచీకత్తుపై విడుదల చేశారు. కర్నాటితో పాటుగా అరెస్టయిన మిగతా ఏడుగురు ఖరత్ కాకిరెడ్డి, సురేష్ కందాల, ప్రేమ్ రామ్‌పీసా, సంతోష్ సమ. అవినీష్ తక్కెళ్లపల్లి, అశ్వత్ నునె, నవీన్ ప్రత్తిపాటిలను సోమవారం మిచిగాన్ తూర్పు జిల్లాకు చెందిన జడ్జి ఎదుట హాజరు పరిచారు. అమెరికా ఇమ్మిగ్రేషన్, కస్టమ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం దేశ వ్యాప్తంగా నిర్వహించిన ఆపరేషన్‌లో భాగంగా ఈ ఎనిమిది మందిని డెట్రాయిట్ ఫ్లోరిడా, వర్జీనియాలలో గత సోమవారం అరెస్టు చేసిన విషయం తెలిసిందే. వీరే కాకుండా వీరు అక్రమంగా యూనివర్శిటీలో చేర్పించిన 130 మంది విద్యార్థులను కూడా అధికారులు అదుపులోకి తీసుకున్నారు. వీరిలో 129 మంది భారతీయులున్నారు. కాగా సోమవారం కోర్టులో హాజరుపరిచిన ఎనిమిది మంది కూడా తాము ఏ తప్పు చేయలేదని కోర్టుకు చెప్పినట్లు కర్నాటి తరపు న్యాయవాది జాన్ డబ్ల్యు బ్రస్టర్ మిచిగాన్‌నుంచి ఫోన్‌లో పిటిఐకి చెప్పారు.

తప్పు చేస్తున్నామని విద్యార్థులకు ముందే తెలుసు: అమెరికా వాదన

వాషింగ్టన్: అమెరికాలో భారత విద్యార్థుల అరెస్టుపై కేంద్ర ప్రభుత్వం ఢిల్లీలోని అమెరికా రాయబార కార్యాలయానికి అభ్యంతర పత్రం(డిమార్చె) జారీ చేయడంపై అమెరికా ప్రభుత్వం స్పందించింది. తాము తప్పు చేస్తున్నామనే విషయం భారతీయ విద్యార్థులకు ముందే తెలుసునని చెప్పుకొచ్చింది.' ఈ విషయంలో అరెస్టయిన విద్యార్థులందరికీ తాము తప్పు చేస్తున్నామనే విషయం ముందే తెలుసు. ఫార్మింగ్టన్ యూనివర్శిటీలో బోధనా సిబ్బంది కానీ, తరగతులు కానీ లేవని వారికి తెలుసు. అమెరికాలో అక్రమంగా ఉండాలనే ఉద్దేశంతోనే వారు అలా చేశారు' అని హోంలాండ్ సెక్యూరిటీ విభాగం సోమవారం ఒక ప్రకటనలో తెలియజేసింది. అయితే ఈ అంశంపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్న భారత ప్రభుత్వం పరిస్థితులను చక్కదిద్దేందుకు చర్యలు చేపట్టింది.

హిమాచల్‌లో స్వైన్‌ఫ్లూతో 16 మంది మృతి

సిమ్లా: హిమాచల్‌ప్రదేశ్‌లో ఈ సీజన్‌లో స్వైన్ ఫ్లూతో 16 మంది మృతి చెందినట్లు మంగళవారం రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి విపిన్ పార్మార్ అసెంబ్లీకి తెలిపారు. 113 మంది రోగులకు హెచ్1 ఎన్1 వైరస్ సోకినట్లు నిర్ధారణ అయిందన్నారు. కాంగ్రా జిల్లాలో 36 కేసులు, సిమ్లాలో 33 కేసులు నమోదయినట్లు ఆయన తెలిపారు. ప్రస్తుతం సిమ్లాలోని ఐజిఎంఎస్ ఆస్పత్రిలో 21 మంది, టాండా మెడికల్ కాలేజ్‌లో ఎనిమిది మంది మృతి చెందినట్లు పార్మార్ తెలిపారు. ప్రశ్నోత్తరాల సమయం ప్రారంభమైన వెం టనే ఆయన ఒక ప్రకటన చేస్తూ స్వైన్ ఫ్లూతో మృతి చెందిన వారు ఇతర రోగాలతో బాధపడుతున్నట్లు తెలిపారు. సోమవారం మృతి చెందిన వారిలో 92 ఏళ్ల వృద్ధుడికి గుండె సంబంధిత రోగాలతో పాటు తీవ్రమైన ఇన్‌ఫెక్షన్‌కు గురయ్యాడని, మరొకరు మధుమేహం, కిడ్నీ వైఫల్యం, బిపితో బాధపడుతున్నట్లు పార్మార్ తెలిపారు. ప్రజలు భయాందోళనకు గురి కావలసిన అవసరం లేదని, పరిస్థితిని ఎదుర్కొనేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆయన తెలిపారు.





స్లిప్పర్ సెల్ఫీ హల్‌చల్

హైదరాబాద్ : ఐదుగురు చిన్నారులు దిగిన ఓ స్లిప్పర్ సెల్ఫీ సోషల్ మీడియాలో తెగ హల్ చల్ చేస్తోంది. స్లిప్పర్ సెల్ఫీ ఏంటి అనేగా మీ అనుమానం.. ఆ చిన్నారులు దిగిన సెల్ఫీ స్మార్ట్ ఫోన్ తో కాదు.. స్లిప్పర్ తో. అందుకే స్లిప్పర్ సెల్ఫీగా వైరలవుతోన్న ఈ ఫోటోలో ఐదుగురు చిన్నారులు చిరునవ్వులు చిందిస్తూ ఉండగా.. వారిలో ఒక పిల్లాడు చెప్పు(స్లిప్పర్)తో సెల్ఫీ తీస్తున్నాడు. ఈ చిన్నారుల సృజనాత్మకతను నెటిజన్లనే కాదు సెలబ్రిటీలను కూడా ఫిదా చేసింది.

టిఎంసితో ఎలాంటి సంబంధాలు లేవు



భువనేశ్వర్ : గతేడాది కాలంగా బిజూ జనతా దల్ (బిజెడి), తృణమూల్ కాంగ్రెస్ (టిఎంసి)ల మధ్య ఎలాంటి సంబంధాలు కొనసాగలేదని ఒడిశా ముఖ్యమంత్రి, బిజెడి అధినేత నవీన్ పట్నాయక్ తెలిపారు. టింఎసితో పొత్తు విషయమై కూడా తాను పశ్చిమబెంగాల్ సిఎం, టిఎంసి అధినేత్రి మమతా బెనర్జీతో ఎలాంటి ఆలోచన చేయలేదని ఆయన అన్నారు. ''టిఎంసి ప్రతినిధులు మమ్మల్ని సంప్రదించలేదు. అయినా, మేము అందరినీ ఇష్టపడుతాం. సిబిఐ తన పని తను చేసుకోవడం ఉత్తమం'' అని పట్నాయక్ పేర్కొన్నారు.

కేజ్రీవాల్‌పై మరోసారి లాంబా ఆరోపణలు



న్యూఢిల్లీ : ఆమ్ ఆద్మీ పార్టీ ఎంఎల్‌ఎ అల్కా లాంబా మరోసారి వార్తల్లోకెక్కారు. ముఖ్యమంత్రి, ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్ తనను ట్విటర్‌లో అన్‌ఫాలో చేశారని, పార్టీ కార్యకలాపాలకు తనను కావాలనే దూరం పెట్టారని ఆరోపించారు. ఇలాంటి పరిస్థితుల్లో పార్టీలో పనిచేయడం కష్టమేనన్నారు. పార్టీకి తన సేవలు అవసరం లేదనిపిస్తోందన్నారు. ఆత్మగౌరవానికి రాజీ పడి నేను పనిచేయలేను అని అల్కా లాంబా చెప్పుకొచ్చారు. కాగా అల్కా లాంబా వ్యాఖ్యలపై ఆమ్ ఆద్మీపార్టీ తీవ్రంగా మండిపడింది. ఆమె పార్టీ నుంచి వైదొలగాలని చూస్తున్నారని, అందుకోసం కారణాలు వెతుక్కుంటున్నారని ఆప్ అధికార ప్రతినిధి సౌరభ్ భరద్వాజ్ విమర్శించారు.

కుంభమేళాలో స్వల్ప అగ్నిప్రమాదం

లక్నో : యుపిలోని ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న కుంభమేళాలో మంగళవారం అగ్నిప్రమాదం జరిగింది. రెండు గుడారాల్లో మంటలు చెలరేగాయి. అప్రమత్తమైన అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేశారు. ఈ ప్రమాదంతో భారీగా ఆస్తి నష్టం సంభవించింది. గుడారాల్లో ఉన్న కొంత నగదు పూర్తిగా కాలిపోయింది. కాలిపోయిన నోట్లలో కొత్త రూ. 500, రూ. 200, రూ. 100, రూ. 50 నోట్లు అధికంగా ఉన్నట్టు పోలీసులు తెలిపారు. అగ్నిప్రమాదానికి గల కారణాలు తెలియరాలేదని వారు చెప్పారు. జనవరి 14న కుంభమేళా ప్రదేశంలోని దిగంబర్ అకాడ శిబిరంలో గ్యాస్ సిలిండర్ పేలడంతో ప్రమాదం సంభవించింది. జనవరి 15న ప్రారంభమైన కుంభమేళా మార్చి 4వ తేదీ వరకు కొనసాగనుంది. కుంభమేళాలో భాగంగా పది వేల మంది నాగ సాధువులుగా మారారు

కుప్పకూలిన శిక్షణ విమానం



ముంబై : పుణెలోని ఇందపూర్ సమీపంలో కార్వేర్ ఏవియేషన్‌కు చెందిన శిక్షణ విమానం కుప్పకూలింది. ఈ ప్రమాదంలో ట్రైనీ పైలట్ తీవ్రంగా గాయపడ్డారు. మంగళవారం మధ్యాహ్నం 12:30 గంటలకు ఎయిర్‌క్రాఫ్ట్ టేకాఫ్ అయిన కొద్దిసేపటికే కుప్పకూలిపోయింది. ప్రమాదస్థలికి స్థానిక ప్రజలు చేరుకుని గాయపడిన ట్రైనీ పైలట్ సిద్ధార్థను చికిత్స కోసం ఆస్పత్రికి తరలించారు. పైలట్ చేతికి తీవ్ర గాయమైనట్లు వైద్యులు తెలిపారు. కార్వేర్ ఏవియేషన్ అధికారులు ఘటనాస్థలిని పరిశీలించారు. ఈ ప్రమాదానికి దారితీసిన కారణాలపై విచారణ చేస్తున్నామని కార్వేర్ ఏవియేషన్ అధికారులు తెలిపారు.

బ్లాక్‌లిస్ట్‌లో పలు ఆన్‌లైన్ గేమ్‌లు

న్యూఢిల్లీ: పిల్లలకు హాని కలిగించే కొన్ని ఆన్‌లైన్ గేమ్స్‌ను ఢిల్లీ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ బ్లాక్ లిస్ట్‌లో పెట్టింది. పబ్‌జీ, ఫోర్ట్ నైట్, గ్రాండ్ థెఫ్ట్ ఆటో, గాడ్ ఆఫ్ వార్, హిట్‌మాన్, పోకోమాన్, ప్లగ్యూ సహా పలు గేమ్స్‌ను డిసిపిసిఆర్ బ్లాక్ లిస్ట్‌లో చేర్చింది. పిల్లలపై చెడు ప్రభావం చూపేలా సదరు గేమ్స్ ఉన్నాయని ఈ సందర్భంగా ఢిల్లీ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ పేర్కొంది. కాగా ఇప్పటికే గుజరాత్, జమ్మూకాశ్మీర్ తదితర రాష్ట్రాలు పబ్‌జీ గేమ్‌ను నిషేధించిన సంగతి తెలిసిందే.

వాహనాలకు నిప్పపెట్టిన మావోయిస్టులు

కంధమాల్ : మావోయిస్టులు దుశ్చర్యకు పాల్పడ్డారు. ంధమాల్ జిల్లా బెల్గర్ పోలీసు స్టేషన్ పరిధిలో మావోయిస్టులు 6 వాహనాలను దగ్ధం చేశారు. బేస్ ఘాట్ రోడ్డుపై బ్రిడ్జి పనులు చేస్తున్న గుత్తేదారు క్యాంపుపై మావోయిస్టులు దాడి చేశారు. అనంతరం 6 వాహనాలను దగ్ధం చేశారు. సోమవారం రాత్రి జరిగిన ఈ ఘటనలో 20 మంది మావోయిస్టులు పాల్గొన్నట్టుపోలీసులు అనుమానిస్తున్నారు. మావోయిస్టుల కదలికలతో పోలీసులు ఈ ప్రాంతంలో భారీఎత్తున కూంబింగ్ నిర్వహిస్తున్నారు.



Printed and Published by **Tumu Mohan Rao** on behalf of Moveon Media Private Limited, Printed at M/s. JAGATI PUBLICATIONS LIMITED, Sakshi Press, D-75 & C-52, Industrial Estate (APIE), Balanagar-500037 Medchel-Malkajgiri District, TELANGANA and Published from H.No.1-1-60/7A, 4th floor Beacon towers, street no.13, Jawaharnagar, near RTC X Roads Hyderabad-500020 Telangana state, Editor : **Anjaiah Polisetty**, RNI No. TELTEL/2012/42234. Email Id. editor@manatelangana.org. Phone No.040-27655666